
V3 NEWS

www.vishvambhara.com
తెలుగు దినపత్రిక
# ప్రజా విశ్వంభర
అక్షరం సాక్షిగా..
బుధవారం
09-09-2026
RNI No : TGTEL/25/A1676
సంపుటి : 02 | సంచిక : 58 | పేజీలు : 12 | వెల : 5/- తెలంగాణ / ఆంధ్రప్రదేశ్



డా॥ కాచం సత్యనారాయణ
CMD

## మహామనిషి కాళోజీ



ప్రజా ఉద్యమాలకు తన జీవితాన్ని ధారబోసిన కాళోజీ నారాయణ రావు ధిక్కారానికి ప్రతీక.సమాజంలోని అన్యాయాలకు, అణిచివేతలనే ఇతివృత్తంగా చేసుకొని తన రచనలతో ప్రజల్లో చైతన్యాన్ని నింపిన మహనీయుడు కాళోజీ. తెలంగాణ రాష్ట్ర సాధనకు పరితపించిన అక్షర తపస్వి కాళోజీ నారాయణ రావు.

తెలంగాణ భాష బడి పలుకుల భాష కాదు, పలుకుబడుల భాష అని ఎలుగెత్తి చాటిన మహా కవి కాళోజీ . పుట్టుక నీది.. చావు నీది.. బ్రతుకంతా దేశానిదంటూ తాను రాసిన విధంగానే దేశం కోసం జీవించిన నిస్వార్థ దేశభక్తుడాయన. నిరంతరం వ్యవస్థతో గొడవపడం ఆయన నైజం. మాండలికానికి పట్టం కట్టిన మహనీయుడు. అందుకే నేటి తరానికి ఆయన జీవితం స్ఫూర్తిదాయకం.నేడు కాళోజీ నారాయణ రావు జయంతి. ఆయన గురించి కొన్ని మాటలు..

''అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తి ప్రాప్తి... అన్యాయాన్నెదిరించిన వాడే నాకు ఆరాధ్యుడు'' అంటూ కాళోజీ గర్వంగా తన కవితా సారాంశాన్ని ప్రకటించుకున్నారు. కాళన్నగా ప్రసిద్ధులైన ఆయన గాంధేయవాది. మీదు మిక్కిలి సున్నిత మనస్కులు. తెలుగు అంటే ఆయనకు చాలా ఇష్టం. తెలంగాణలో జరిగిన గ్రంథాలయోద్యమంలో, భాషోద్యమంలో కీలక పాత్ర పోషించారు. ''బడి పలుకుల భాష కాదు, మనకు పలుకుబడుల భాష కావాలి'' అని నినదించిన ప్రజాకవి కాళోజీ ..

తన జీవితకాలంలో జరిగిన ప్రతి ఉద్యమాన్నీ ఊపిరిగా మార్చుకుని, వాటిలో తన వంతు పాత్రను చురుగ్గా పోషించారు కాళోజీ. నిజాం దౌర్జన్యాలకు వ్యతిరేకంగా సాగిన పోరాటంలో విద్యార్థి నాయకుడిగా పాలుపంచుకున్నారు. సమకాలీన సమాజంపై ఆయన ప్రభావం అపారమైనది. మాజీ ప్రధాని పి.వి.నరసింహారావు లాంటి వారు కాళోజీ అంటే అమితమైన గౌరవాభిమానాలు చూపేవారు.

కాళోజీ నారాయణరావు 1914 సెప్టెంబర్ 9న ప్రస్తుత కర్ణాటకలోని బీజాపుర్ జిల్లా రట్టిహళ్లి గ్రామంలో జన్మించారు. తల్లి రమాబాయి, తండ్రి గంగారావు. నిజాం కాలంలో భూముల గణాంకాలు చూడటానికి వరంగల్ జిల్లాకు వచ్చి మడికొండలో స్థిరపడ్డారు. కాళోజీ హైదరాబాద్‌లో న్యాయశాస్త్ర పట్టా పొందారు. తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఆంగ్ల భాషల్లో కవిగా ఆయన సుప్రసిద్ధులు. ముఖ్యంగా రాజకీయ వ్యంగ్య కవిత్వం రాయడంలో కాళోజీది అందెవేసిన చెయ్యి. 'నా గొడవ' అంటూ ప్రజల వైపు నిక్కచ్చిగా నిలబడి సమకాలీన సమస్యలపై కవిత్వం రాసిన ఆయన రాజ్యం మీద అక్షరాయుధాలను గురిచూసి సంధించిన ప్రజావైతాళికుడు.

కాళోజీకి ఆరేళ్ల వయసులో తల్లి చనిపోయారు. అన్న రామేశ్వరరావు తానే సర్వస్వమై కాళోజీని ఆయన కుటుంబాన్ని పోషించారు. ''ఆరవ ఏట మా అన్న భుజాల మీద ఎక్కినాను. అతను చనిపోయేదాకా దిగలేదు. నేను అతని భుజాల మీదికి ఎక్కడం గొప్ప కాదు. నాకు 70 ఏళ్లు వచ్చేవరకు అతను నన్ను దించకుండా ఉండటం గొప్ప'' అని సోదరుడు చనిపోయినప్పుడు కాళోజీ గద్గదమయ్యారు. శాసనమండలిలో స్వతంత్ర సభ్యుడిగా రెండేళ్ల పాటు పనిచేసిన ఆయన నాటి ఆంధ్రప్రదేశ్ సారస్వత పరిషత్తు వ్యవస్థాపక సభ్యుడు. తెలంగాణ రచయితల సంఘం అధ్యక్షుడిగానూ సేవలందించారు. కవి, రచయితగానే కాదు, అవసరమైనప్పుడు రాజకీయాల్లోనూ ప్రజాపక్షం వహించారు.

1977 శాసనసభ ఎన్నికల్లో ఖమ్మం జిల్లా సత్తుపల్లి నుంచి నాటి ముఖ్యమంత్రి వెంగళరావుకు వ్యతిరేకంగా స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేశారు.ఖలీల్ జిబ్రాన్ 'ది ప్రాఫెట్'ను కాళోజీ 'జీవన గీత' పేరిట తెలుగులోకి తీసుకొచ్చారు. దానికి ఏపీ సాహిత్య అకాడమీ అనువాద పురస్కారం లభించింది. గాంధీజీ ప్రబోధించిన అహింసా మార్గాన్నే కాళోజీ అనుసరించినా, ప్రతిహింస తప్పని సందర్భాలూ అనివార్యంగా ఎదురవుతాయని అంగీకరించారు. పాలకులు చేసే అన్యాయాలూ అక్రమాలను బతికినంత కాలం తన ప్రభావవంతమైన ఉపన్యాసాలు, కవితల ద్వారా ఎదుర్కొన్నారు.ఆనాటి హైదరాబాద్ రాష్ట్రంలో స్వాతంత్ర్య ఉద్యమాన్ని నడిపిన కాళోజీపౌర హక్కుల సాధనలో క్రియాశీలకంగా ఉన్న ఆయన.. తుర్కుండె కమిటీలో సభ్యుడిగా కొనసాగారు. ఆంధ్రప్రదేశ్ లెజిస్లేటివ్ కౌన్సిల్‌కు మూడు సార్లు పోటీ చేసిన కాళోజీ.. ఒకసారి విజయం సాధించారు. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడిగా.. అనంతర కాలంలో అధ్యక్షుడిగా ఎన్నికై సేవలందించారు.నిజాంను తీవ్రంగా వ్యతిరేకించడం ద్వారా తన కవితలను పదునెక్కించిన ఆయన 1939, 1943లో రెండుసార్లు జైలు జీవితం గడిపారు. 1956లో ఆంధ్రప్రదేశ్ ఏర్పడినప్పుడు పాములపర్తి సదాశివరావుతో కలిసి తెలంగాణ ప్రత్యేక సంచికను విడుదల చేశారు. తెలంగాణకు జరుగుతున్న అన్యాయాలను నిరసిస్తూ ప్రత్యేక రాష్ట్రం కావాలని నినదించారు. అందుకోసం జరిగిన అన్ని ఉద్యమాలలో పాలుపంచుకున్నారు.

జయప్రకాష్ నారాయణ్ చనిపోయినప్పుడు ''పుట్టుక నీది చావు నీది బతుకంతా దేశానిది'' అంటూ కాళోజీ నివాళులర్పించారు. తన జీవితాన్ని ఆయన అలాగే ప్రజలకు అంకితం చేశారు. ఒక సిరా చుక్క లక్ష మెదళ్లకు కదలిక అంటూ ఆలోచనాజ్యోతులను వెలిగించిన కాళోజీ 2002 నవంబరు 13న కీర్తిశేషులయ్యారు. ప్రజల పక్షం వహించిన కవిగానే కాదు ప్రజాకాంక్షలను ఎలుగెత్తి చాటిన అసలు సిసలైన ఉద్యమకారుడిగానూ ఆయన ఖ్యాతి అజరామరం. కాళోజీ తెలుగు భాషాభిమానమైతే నిత్యం స్ఫూర్తిదాయకమైనది. ''అన్యభాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు సకిలించు ఆంధ్రుడా చావవెందుకురా'' అంటూ తెలుగువారిని కాళోజీ హెచ్చరించారు. ఆత్మాభిమానంతో కూడిన తన కవితా ప్రకటన ద్వారా అమ్మభాషకు దూరమైతే అస్తిత్వానికి విలువ లేదని స్పష్టంగా చెప్పారు.

కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీష్ భాషల్లో అనేక రచనలు చేసి ఖ్యాతి గడించారు. తన కవితల ద్వారా పేదలు, తెలంగాణ ప్రజల ఆవేదన, ఆగ్రహాన్ని ప్రపంచానికి చాటిచెప్పారు. ఆయన రాసిన 'నా గొడవ' సంకలనంలో సమకాలీన సామాజిక సమస్యలను ఏకరువు పెట్టారు. ఆంధ్ర సారస్వత పరిషత్ వ్యవస్థాపక సభ్యుడిగా, ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడెమి సభ్యుడిగా కూడా సేవలందించారు. కాళోజీ సేవలకు గుర్తింపుగా కాకతీయ విశ్వవిద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా.. భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ పురస్కారంతో సత్కరించింది. తెలంగాణ ప్రభుత్వం ఆయన సేవలకు గౌరవంగా వైద్యవిశ్వవిద్యాలయానికి కాళోజీ నారాయణరావు హెల్త్ సైన్సెస్ యూనివర్శిటీ అని పేరు పెట్టింది.కాలోజీ వివక్ష ఎక్కడ ఉన్నా వ్యతిరేకించాడు..మంచి ఎక్కడ ఉన్నా స్వాగతించాడు..

అన్యాయం అణచివేతలపై తిరగబడ్డాడు..తెలంగాణ వైతాళికుడిగా పేరు సంపాదించాడు.మహాకవి కావడానికి పాండిత్యం తెలిసి ఉండాలి. ప్రజా కవి కావడానికి ప్రజల కష్టాలు తెలిసి ఉండాలి. అలాంటి సామాన్య ప్రజల ధిక్కార స్వరం కాళోజీ. సమాజంలో జరుగుతున్న అన్యాయాలన్ని ఆకృత్యాల్నీ, అవకతవకలను జూచి హృదయం ద్రవించి తన సిరాచుక్కతో లక్షల మెదళ్లకు కదలిక తెచ్చారు. నియంతృత్వాన్ని ధిక్కరించారు. ప్రజల కోసం సమ సమాజం కోసం అక్షరాలు ఎక్కు పెట్టారు. నేడు ఆయన జయంతి సందర్భంగా ఆ మహనీయుడికి అక్షర నివాళులర్పిస్తూ..

**- డా.కాచం సత్యనారాయణ**
**తెలంగాణ ఉద్యమకారుల సంక్షేమ సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు**

## అర్హత లేని టీచర్ల నియామకం చెల్లదు

2

- సుప్రీంకోర్టు సంచలన ఉత్తర్వులు
- విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం తగదు..
- టెట్ , నెట్ లాంటి అర్హత పరీక్షలు పాస్ కాని వారిని ఉపాధ్యాయులుగా నియమించడానికి వీల్లేదన్న సుప్రీం



## తప్పదోవ పట్టించేవారు ప్రతి మలుపు వద్దా ఉంటారు

2

- భారత యువత సత్యాన్నే అనుసరిస్తుంది
- 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదు
- తాము మాత్రం 50వేల రైలు కోచ్‌లను నిర్మించాం
- ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలి
- ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదు: ప్రధాని మోడీ











# రెండోరోజూ ఆరని జ్వాల

### ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు

### తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి రిమాండ్‌కు కోర్టు తిరస్కరణ

### తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారమున్నా అలా చేయలేదు: స్పీకర్

- 1000 డప్పులతో కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి.. ఎర్రవల్లిలో తీవ్ర ఉద్రిక్తత..
- ఎర్రవల్లి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్ హరీశ్ రావు అరెస్టు
- అసెంబ్లీలో స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల రగడ..
- రేవంత్ రెడ్డి తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి తీవ్రమైన రాజకీయ కుట్రలు: కేటీఆర్
- రాష్టంలో ప్రజాస్వామ్యం ఖూనీ చేస్తున్నారు: ఎమ్మెల్యే హరీష్ రావు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాల రెండో రోజూ కాంగ్రెస్, బీఆర్ఎస్ మధ్య రాజకీయ వేడి మరింత పెరిగింది. స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై తాతా మధు, నవీన్‌రెడ్డి వ్యాఖ్యలతో మొదలైన వివాదం అరెస్టులు, సస్పెన్షన్లు, అసెంబ్లీ తీర్మానాలు, ఎర్రవల్లి ఫామ్‌హౌస్ వద్ద ఘర్షణల వరకు వెళ్లింది. తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు రెండో రోజు మంగళవారం బీఆర్ఎస్ సభ్యులు నల్ల బ్యాడ్జీలతో సభకు హాజరయ్యారు. సభ ప్రారంభమైనప్పటి నుంచి బీఆర్ఎస్ సభ్యులు నినాదాలతో హోరెత్తించారు. మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పీకర్‌తో ఎమ్మెల్యే హరీశ్ రావు వాగ్వాదానికి దిగారు. స్పీకర్ సైతం ఘాటుగా స్పందిస్తూ.. మీరు లొల్లి పెడితే భయపడేది లేదంటూ వ్యాఖ్యానించారు. ఎందుకంత ఆవేశం. మీకు కాదు ఆవేశం.. నాకు ఉండాలి. నీ తల్లిని అనలేదు.. నా తల్లిని అన్నారని భావోద్వేగానికి గురయ్యారు. తాతా మధుపై చర్యలకు కాంగ్రెస్ పట్టుబడుతుండగా.. బీఆర్ఎస్ మహిళా సభ్యులను అవమానించారని.. సీఎం రేవంత్ క్షమాపణ చెప్పాలని బీఆర్ఎస్ డిమాండ్ చేసింది. శాసనసభ వ్యవహారాల మంత్రి డి. శ్రీధర్ బాబు మాట్లాడుతూ.. స్పీకర్ ను బెదిరించేలా.. మిగతా2లో...

## ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పెంచాలి

- తెలంగాణ–ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించాలి
- రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి

3



## సెప్టెంబరు 11న మోడీ-పుతిన్ భేటీ

- ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొన్న ఇరుదేశాధినేతలు
- వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారు
- క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడి
- ఈ నెల 12-13 తేదీలలో ఢిల్లీలో18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం



2



2

## గణేశ్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ నమోదు

- చివరి నిమిషం దాకా వేచి చూడకుండా వెబ్‌సైట్‌ను రిజిష్టర్ చేసుకోవాలన్న సీపీ సజ్జనార్
- పండుగ ప్రశాంతంగా జరిగేలా సహకరించాలని నిర్వాహకులను కోరిన సీపీ

## దేశంలో బొగ్గు కొరత భయం లేదు

- దేశవ్యాప్తంగా 123 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు
- ఇవి దేశానికి దాదాపు 51 రోజులకు సరిపడా నిల్వలు
- కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి

2




## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి లాలూచీ రాజకీయాలు

- ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారు
- స్పీకర్ ను బీఆర్ఎస్ నేతలు దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరు
- బీఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలి
- కేంద్ర మంత్రి బండి సంజయ్ ఫైర్

2



# రెండోరోజూ ఆరని జ్వాల



(మొదటి పేజీ తరువాయి)

బీఆర్ఎస్ సభ్యుల తీరు ఉందని అన్నారు. స్పీకర్ స్థానంలో ఉన్న వ్యక్తిపై ఇలా మాట్లాడటం ఎప్పుడూ చూడలేదు.. స్పీకర్ పై బెదిరింపు ధోరణితో సభ నడవదని గుర్తించుకోవాలి. సభను ఎలా నడపాలో మీరు ఎలా చెబుతారు..? అంటూ శ్రీధర్ బాబు ప్రశ్నించారు. మహిళా సభ్యుల విషయంలో బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పినా పట్టించుకోలేదు.. స్పీకర్ పట్ల దుర్భాషలాడిన విషయాన్ని పక్కన పెట్టాలని బీఆర్ఎస్ సభ్యులు చెబుతున్నారు. స్పీకర్‌ను కించపరిచేలా మాట్లాడితే తప్పని చెప్పాల్సిన బాధ్యత వారిపై ఉందని శ్రీధర్ బాబు అన్నారు. మంత్రి అడ్లూరి లక్ష్మణ్ మాట్లాడుతూ.. స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యల పట్ల క్షమాపణ చెప్పకుండా బీఆర్ఎస్ సభ్యులు రాజకీయం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ శాసనసభ ఉపనేత హరీశ్ రావు మాట్లాడుతూ.. స్పీకర్ గడ్డం ప్రసాద్ అంటే వ్యక్తిగతంగా మాకు గౌరవం. స్పీకర్ ను బీఆర్ఎస్ గౌరవిస్తుంది. స్పీకర్‌ను ఉద్దేశించి అనలేదని తాతా మధు చెప్పారు. అలా భావించి ఉంటే లిఖిత పూర్వకంగా విచారం వ్యక్తం చేశారు. అదే విషయంపై మేము విచారం వ్యక్తం చేస్తున్నాము. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి మూడేళ్లు అవుతుంది. దళిత గిరిజనులపై ఈ ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదు. 125 అడుగుల డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహానికి పూలమాల ఎందుకు వెయ్యలేదు? మూడేళ్లు అవుతుంది ప్రభుత్వం అధికారంలోకి వచ్చి.. ఎస్సీ, ఎస్టీ డిక్లరేషన్ ఏమైంది? అంటూ హరీశ్ రావు ప్రశ్నించారు.

**ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సస్పెన్షన్ వేటు**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల వ్యవహారంలో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి సస్పెన్షన్ వేటు వేశారు. ఇద్దరిని సస్పెండ్ చేయాలని శాసనమండలిలో మంత్రి శ్రీధర్‌బాబు తీర్మానం ప్రవేశపెట్టారు. దీనిపై మూజువాణి ఓటుతో ఓటింగ్ నిర్వహించిన ఛైర్మన్.. సెషన్ ముగిసేంత వరకు ఇద్దరు ఎమ్మెల్సీలను సస్పెండ్ చేసినట్లు ప్రకటించారు. అనంతరం మండలి వాయిదా పడింది. అంతకుముందు శాసనసభ కూడా తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిలపై చర్యలు తీసుకోవాలని తీర్మానించింది. మంత్రి దామోదర రాజనర్సింహ ఈ మేరకు సభలో తీర్మానాన్ని ప్రవేశపెట్టారు. "స్పీకర్‌పై తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి దూషణలను సభ తీవ్రంగా ఖండిస్తోంది. సభామర్యాదలకు విరుద్ధమైన వ్యాఖ్యలపై నిరసన తెలుపుతోంది. మహిళా ఎమ్మెల్సీలకు అగౌరవకరంగా ప్రవర్తించడాన్ని ఖండిస్తోంది. బీఆర్ఎస్ సభ్యుల అనుచిత ప్రవర్తన ఆ పార్టీ అధినేత కేసీఆర్ బాధ్యత తీసుకోవాలి. శాసనసభాపతికి కేసీఆర్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి. నిబంధనల అనుగుణంగా మండలి ఛైర్మన్ చర్యలు తీసుకోవాలి" అని శాసనసభ తీర్మానించింది.

**బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డి రిమాండ్ తిరస్కరణ..**

శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై అనుచిత వ్యాఖ్యల కేసులో బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు తాతా మధు , నవీన్‌కుమార్‌రెడ్డి ల రిమాండ్‌ను నాంపల్లి కోర్టు తిరస్కరించింది. ఇద్దరు ఎమ్మెల్సీలు పూచీకత్తు సమర్పించాలని ఆదేశించింది. ఈ ఇద్దరిని పోలీసులు మంగళవారం ఉదయం అరెస్టు చేసిన విషయం తెలిసిందే. స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను కులం పేరుతో పాటు, అసభ్య పదజాలంతో దూషించారని స్పీకర్ ఓఎస్డీ పొల్లెపల్లి వెంకటేశం ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాతా మధు, నవీన్‌కుమార్‌రెడ్డిపై సైఫాబాద్ పీఎస్‌లో కేసు నమోదైంది. అనంతరం వారిని కోర్టులో ప్రవేశపెట్టగా.. న్యాయస్థానం రిమాండ్‌ను తిరస్కరించింది.

**తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారమున్నా అలా చేయలేదు..**

అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం తనకుందని.. కానీ తాను అలా చేయలేదని శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ అన్నారు. మీడియాతో స్పీకర్ చిట్‌చాట్ నిర్వహించారు. ''శాసనసభలో సభ్యుడు కాకపోయినా తాతా మధుపై చర్యలు తీసుకునే అధికారం నాకుంది. బీఆర్ఎస్‌లాగా వెంటనే బహిష్కరించలేను. ఏదైనా ప్రజాస్వామ్యయుతంగా వ్యవహరిస్తున్నాం. మహిళా సభ్యులపై పోలీసులు అనుచితంగా ప్రవర్తించినట్లు తేలితే చర్యలు తీసుకుంటాం. రాహుల్ గాంధీ నల్ల టీషర్ట్ వేసుకుని వెళ్లారు కానీ.. అదానీ ఫొటో పెట్టుకోలేదు. తాతా మధు వ్యవహారంలో కేసీఆర్ వచ్చి క్షమాపణ చెప్పాలని ప్రభుత్వం డిమాండ్ చేస్తోంది. సమావేశాలకు హాజరుకావాలని ప్రతి సెషన్ ముందు ఆయన్ను కోరుతూనే ఉన్నాను. ఇవాళ నేను సభ నడపలేనని చెప్పాను. ప్యానల్ స్పీకర్‌గా కడియం శ్రీహరి సభను నడిపిస్తారు'' అని గడ్డం ప్రసాద్ కుమార్ తెలిపారు.

**1000 డప్పులతో కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడి.. ఎర్రవల్లిలో తీవ్ర ఉద్రిక్తత..**

కేసీఆర్ ఫాంహౌస్ ముట్టడికి కాంగ్రెస్ కార్యకర్తలు, దళిత సంఘాలు తరలి వెళ్లిన నేపథ్యంలో తీవ్ర పరిసరాల్లో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. వారిని మార్గ మధ్యలోనే పోలీసులు అడ్డుకుంటున్నారు. కేసీఆర్ ఫామ్ హౌస్ వద్ద డప్పుల మోతకు కాంగ్రెస్ పిలుపునివ్వగా ప్రభుత్వమే పోలీసుల సాయంతో కాంగ్రెస్ నేతలను ప్రోత్సహిస్తోందని బీఆర్ఎస్ ఆరోపిస్తోంది. ఫామ్ హౌస్ వద్దకు వెళ్తున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు.దళితులను అవమానించారని ఆరోపిస్తూ బీఆర్ఎస్‌పై కాంగ్రెస్ పార్టీ నిరసన చేపట్టింది. దీని కోసం దళిత సంఘాల నేతలు భారీగా బయలుదేరారు. గజ్వేల్ నియోజకవర్గవ్యాప్తంగా మాత్రమే కాకుండా వివిధ ప్రాంతాల నుంచి కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. వెయ్యి మంది డప్పు కళాకారులతో సిద్ధిపేట జిల్లా ఎర్రవెల్లిలోని కేసీఆర్ ఫామ్ హౌస్ ముందు నిరసనకు బయలుదేరగా పోలీసులు అడ్డుకున్నారు.వరద రాజాపూర్ మీదుగా కేసీఆర్ ఫాంహౌస్ సమీపానికి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు నిలువరించారు. దీంతో పోలీసులు కాంగ్రెస్ శ్రేణులకు మధ్య తోపులాట జరిగింది. కేసీఆర్ ఫాంహౌస్‌కు అరకిలోమీటర్ దూరంలో డప్పుల మోతతో నిరసన తెలిపారు. బారికేడ్లను తోసుకుని కేసీఆర్ ఫాంహౌస్ వైపు దూసుకెళ్లేందుకు నిరసనకారులు యత్నించారు. నిరసనకారులను వెనక్కి తీసుకువచ్చిన పోలీసులు అదుపు చేసే క్రమంలో పలువురు పోలీసులకు స్వల్ప గాయాలయ్యాయి. రెండున్నర గంటలపాటు కేసీఆర్ ఫాంహౌస్ సమీపంలో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. ఉద్రిక్తత నేపథ్యంలో గజ్వేల్ మాజీ ఎమ్మెల్యే నర్సారెడ్డితో పాటు పలువురు నాయకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. వరదరాజాపూర్ మీదుగా ఫాంహౌస్ సమీపానికి చేరుకున్న కాంగ్రెస్ శ్రేణులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో అవాంఛనీయ ఘటనలు చోటు చేసుకోకుండా పోలీసులు అప్రమత్తమయ్యారు. ఫాంహౌస్ వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు.ఈ విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీ నుంచి ఎర్రవెల్లి ఫామ్‌హౌస్‌కు బయలుదేరారు. అక్కడ ఉద్రిక్తతల నేపథ్యంలో కేటీఆర్, హరీశ్‌రావు సహా ఎమ్మెల్యేలు వెళ్లారు. ఎర్రవల్లి వెళ్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హకీంపేట వద్ద పోలీసులు అరెస్టు చేశారు. హకీంపేట వద్ద పోలీసులతో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు వాగ్వాదానికి దిగారు. కేటీఆర్‌ను బోయిన్‌పల్లి పీఎస్‌కు, హరీశ్‌రావును జవహర్‌నగర్ పీఎస్‌కు తరలించారు. కేసీఆర్‌పై దాడి చేయడానికి కాంగ్రెస్ కార్యకర్తలు ప్రయత్నిస్తుంటే పోలీసులే సహకరిస్తున్నారని కేటీఆర్ ఆరోపించారు. అంతకు ముందు వారిని పోలీసులు అడ్డుకోవడంతో హరీశ్ రావు, కేటీఆర్ పాదయాత్ర చేసుకుంటూ ఎర్రవల్లికి వెళ్తామని కారు దిగారు. కొంత దూరం నడిచిన అనంతరం మల్కాజిగిరి సీపీ ఆధ్వర్యంలో కేటీఆర్‌ను అరెస్టు చేశారు. ఎర్రవల్లి ఫాంహౌస్ వద్ద సిద్దిపేట సీపీ రష్మీ పెరుమాళ్ స్వయంగా వచ్చి భద్రత బలగాల ఏర్పాటును పరిశీలించారు.

**అసెంబ్లీలో స్పీకర్‌పై చేసిన వ్యాఖ్యల పట్ల రగడ..**

స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యల పట్ల శాసనసభ, మండలిలో ఉద్రిక్త వాతావరణంలో చర్చలు జరిగాయి. బీఆర్ఎస్‌ను దళితుల వ్యతిరేక పార్టీ అని మంత్రులు, శాసనసభ సభ్యులు సంభోదించారు. గతంలో కేసీఆర్ సీఎంగా ఉన్నప్పుడు దళితుల పట్ల అహంకారపూరితంగా వ్యవహరించారని విమర్శించారు. తీన్మార్ మల్లన్న మాట్లాడుతూ డిప్యూటీ సీఎంగా ఉన్న తాటికొండ రాజయ్యను కారణం చెప్పకుండా మంత్రి వర్గం నుంచి తొలగించారని గుర్తుచేశారు. కాంగ్రెస్, బీజేపీ, ఎంఐఎం, సీపీఐ పార్టీలు తాతా మధుపై చర్యలు తీసుకోవాలని ప్రభుత్వానికి సూచించాయి.

**రేవంత్ రెడ్డి తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి తీవ్రమైన రాజకీయ కుట్రలు: కేటీఆర్..**

సీఎం రేవంత్ రెడ్డి వైఖరిపై మాజీ మంత్రి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు.రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తన అసమర్థతను కప్పిపుచ్చుకోవడానికి తీవ్రమైన రాజకీయ కుట్రలకు పాల్పడుతున్నారని ఆయన ఆరోపించారు. కాంగ్రెస్ ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో పూర్తిగా విఫలమైందని, ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.శాసనసభ వేదికగా తమ పార్టీకి చెందిన సీనియర్ మహిళా నాయకులు, మాజీ మంత్రులు సబితా ఇంద్రారెడ్డి, సునీతా లక్ష్మా రెడ్డిలపై జరిగిన దాడి , అనుచిత ప్రవర్తనను కేటీఆర్ తీవ్రంగా ఖండించారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళా ప్రజాప్రతినిధులకు ఇచ్చే గౌరవం ఇదేనా అని ప్రశ్నించారు. ఈ ఘటనపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే బహిరంగంగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైఫల్యాల నుంచి ప్రజల దృష్టిని మళ్లించేందుకు కాంగ్రెస్ పార్టీ స్పీకర్ హోదాను, కులాన్ని రాజకీయం చేస్తోందని కేటీఆర్ విమర్శించారు. మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ మరణించాలని రేవంత్ రెడ్డి ప్రోద్బలంతోనే కాంగ్రెస్ నాయకులు వ్యాఖ్యానించారని, కేసీఆర్ ఇంటిపైకి కార్యకర్తలను రెచ్చగొట్టి పంపారని ఆగ్రహం వ్యక్తం చేశారు. సంస్కారం లేని ఇటువంటి వ్యాఖ్యలు తెలంగాణ సమాజాన్ని తీవ్రంగా గాయపరిచాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు ఇచ్చిన '420 హామీలను' నెరవేర్చడంలో ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని కేటీఆర్ మండిపడ్డారు. నిరుద్యోగ భృతి, ఫీజు రీయింబర్స్‌మెంట్, రైతు భరోసా, మహిళలకు ఆర్థిక సాయం వంటి కీలకమైన సంక్షేమ పథకాలను పక్కనబెట్టారని ఆరోపించారు. తమ వైఫల్యాలను ఎండగడుతున్న బీఆర్ఎస్ శాసన మండలి సభ్యులను బెదిరిస్తూ, సస్పెండ్ చేస్తామని హెచ్చరించడం ప్రజాస్వామ్యానికి విరుద్ధమని స్పష్టం చేశారు. ప్రస్తుత రేవంత్ రెడ్డి పాలనను కేటీఆర్ నాడు జర్మనీలో సాగిన హిట్లర్ నిరంకుశ పాలనతో పోల్చారు. ప్రతిపక్షాల గొంతు నొక్కేందుకు ప్రయత్నిస్తున్న రేవంత్ రెడ్డికి కూడా భవిష్యత్తులో హిట్లర్ తరహా గతే పడుతుందని తీవ్రంగా హెచ్చరించారు. ప్రజల సమస్యలు పరిష్కారమయ్యే వరకు, ఆడబిడ్డలకు జరిగిన అవమానానికి న్యాయం జరిగే వరకు తమ పోరాటం ఆగేది లేదని తేల్చి చెప్పారు.

**రాష్టంలో ప్రజాస్వామ్యం ఖూనీ చేస్తున్నారు - ఎమ్మెల్యే హరీష్ రావు..**

రాష్ట్ర ప్రభుత్వం 100 రోజుల్లో ఇస్తానన్న ఆరు గ్యారంటీలు 1000 రోజులైనా అమలు కాలేదని, సభలో చర్చ జరిగితే ప్రభుత్వ వైఫల్యాలు బయటపడుతాయనే, సభలో చర్చ జరగకుండా రేవంత్ రెడ్డి డైవర్షన్ పాలిటిక్స్ కు పాల్పడుతున్నాడని డైవర్షన్ పాలిటిక్స్ ఆపి.. ప్రజలు అడుగుతున్న ప్రశ్నలకు సమాధానమివ్వాలని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఫార్మ్ హౌస్ కు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు హరీష్ రావు, ప్రశాంత్ రెడ్డి, లక్ష్మారెడ్డి, డాక్టర్ సంజయ్, పల్ల రాజేశ్వర్ రెడ్డి, కేపీ వివేకానంద, మాణిక్ రావులు వెళ్తుండగా మధ్యలో పోలీసులు అడ్డుకొని అరెస్ట్ చేసి జవహర్ నగర్ పోలీస్ స్టేషన్ కు తరలించారు. సాయంత్రం ఐదు గంటల అనంతరం ఆయనను స్టేషన్ నుంచి బయటకు పంపించారు. ఈ సందర్భంగా పోలీస్‌స్టేషన్ వద్ద విలేకరులతో హరీశ్‌రావు మాట్లాడుతూ.. స్పీకర్ పై మా ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలకు విచారం వ్యక్తం చేసి, మాటలను వెనక్కి తీసుకున్నప్పటికీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మాత్రం అరెస్టు చేసి ఎమ్మెల్సీని జైల్లో పెట్టే ప్రయత్నం చేస్తున్నాడు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిపై ఎలాంటి విచారం వ్యక్తం చేయలేదని విమర్శించారు. ''నాడు ద్రౌపదిపై కౌరవులు వ్యవహరించిన తీరును గుర్తు చేసేలా నేడు రాష్ట్రంలో రేవంత్‌రెడ్డి తీరు ఉంది. శాసనసభను కౌరవ సభగా మార్చింది ఆయనే'' అని ఆరోపించారు. బీజేపీ ఎమ్మెల్యేలు ప్లకార్డులతో వస్తే పట్టించుకోకుండా, బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను మాత్రం సభ నుంచి బయటకు గెంటివేయడం ఏమిటని ప్రశ్నించారు. కాంగ్రెస్, బీజేపీల మధ్య ఫెవికాల్ బంధం ఉందని విమర్శించారు. మహిళా ఎమ్మెల్యేలు ఇచ్చిన ఫిర్యాదులను పోలీసులు పట్టించుకోకుండా, వారిపైనే కేసులు నమోదు చేయడమేంటని ప్రశ్నించారు. సునీతా లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కోవా లక్ష్మిలపై కేసులు పెట్టడాన్ని ఆయన తప్పుబట్టారు.కాంగ్రెస్ ప్రభుత్వ వెయ్యి రోజుల పాలనపై అసెంబ్లీలో బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నిలదీయనున్నారని, ఆ చర్చ జరగకుండా అసెంబ్లీ బయటే ఎమ్మెల్యేలను అడ్డుకుంటూ ప్రభుత్వం డైవర్షన్ రాజకీయాలకు పాల్పడుతోందని హరీశ్‌రావు ఆరోపించారు. రాష్ట్రంలో నిరుద్యోగులు, రైతులు, అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని అన్నారు. నిరాహార దీక్ష చేసి చావు నోట్లో తలపెట్టి తెలంగాణ సాధించిన మాజీ సీఎం కేసీఆర్ ఇంటిపై దాడికి పురిగొల్పడం, ఎమ్మెల్యేలపై దాడులకు పాల్పడం, పోలీసులను అడ్డుపెట్టుకుని కాంగ్రెస్ కార్యకర్తలను రెచ్చగొట్టడం ఏమిటని ప్రశ్నించారు. రాష్ట్రంలో ప్రజాస్వామ్యం ఉందా? అని నిలదీశారు. మాజీ హోంశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి పై దాడికి దిగడమే కాక ఆమె అసెంబ్లీలో మాట్లాడేందుకు కూడా మైక్ ఇవ్వకపోవడం దుర్మార్గమైన చర్యగా ఆయన అభివర్ణించారు. మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే క్షమాపణ చెప్పాలని హరీశ్‌రావు డిమాండ్ చేశారు. రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయని ఆరోపిస్తూ రాష్ట్రపతి పాలన విధించాలని కేంద్ర ప్రభుత్వాన్ని, గవర్నర్‌ను కోరుతున్నామని తెలిపారు. ప్రశ్నించే గొంతులపై అక్రమ కేసులు పెట్టి, నిర్బంధించి, దాడులు చేస్తున్నా కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలు ఆయనకు తెలియవా అని నిలదీశారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కేటీఆర్, రాజశేఖర్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, డాక్టర్ సంజయ్, యాదగిరిపై దాడులు చేసి గాయపరిచారని ఆరోపించారు.

## గణేశ్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ నమోదు

**విశ్వంభర, హైదరాబాద్ :** హైదరాబాద్ మహా నగరంలో గణేశ్ మండపాల ఏర్పాటుకు ఆన్‌లైన్ నమోదును పోలీసులు తప్పనిసరి చేశారు. ఉత్సవ నిర్వాహకులు చివరి నిమిషం దాకా వేచి చూడకుండా policeportal.tspolice.gov.in వెబ్‌సైట్‌ను సందర్శించి తమ వివరాలను నమోదు చేసుకోవాలని సీపీ సజ్జనార్ ఎక్స్ వేదికగా విజ్ఞప్తి చేశారు. మండపాల ఏర్పాటు, నిమజ్జన వివరాలు ముందుగానే అందిస్తే ఆయా ప్రాంతాల్లో పటిష్ట బందోబస్తు, భద్రతతో పాటు ట్రాఫిక్ క్రమబద్ధీకరణ సమర్థంగా చేపట్టేందుకు వీలవుతుందని ఆయన స్పష్టం చేశారు. హైదరాబాద్‌లో పండుగ ప్రశాంతంగా జరిగేలా పోలీసులకు సహకరించాలని నిర్వాహకులను కోరారు. రాష్ట్రవ్యాప్తంగా గణేశ్ చతుర్థి వేడుకలు ప్రశాంతంగా జరిగేలా పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని డీజీపీ సీవీ ఆనంద్ అధికారులను ఆదేశించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా చర్యలు తీసుకోవాలని ఆయన సూచించారు. సోమవారం నాడు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న సబ్‌ఇన్‌స్పెక్టర్, అంతకంటే పైస్థాయి అధికారులతో ఆయన వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. మండపాలలో నిర్వాహకులు సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేసేలా, వాలంటీర్లను నియమించేలా ప్రోత్సహించాలని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. అలా చేస్తే మండపాలను జియోట్యాగ్ చేసి 'TGCOP' పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని సూచించారు. ఎస్పీలు, కమిషనర్లు, డీసీపీలు ఉత్సవ కమిటీలతో సమన్వయ సమావేశాలు నిర్వహించాలన్నారు. సోషల్ మీడియాలో ప్రచారమయ్యే సమాచారంపై కూడా అధికారులు నిశితంగా దృష్టి సారించాలని తెలిపారు. ఈ సమావేశంలో టెక్నికల్ సర్వీసెస్ డీజీ వీవీ శ్రీనివాసరావు, ఇంటెలిజెన్స్ ఐజీ కార్తికేయ, ఐజీ చంద్రశేఖర్ రెడ్డి, టీస్పార్క్ ఎస్పీ రూపేశ్ తదితరులు పాల్గొన్నారు.

## కాంగ్రెస్, బీఆర్ఎస్‌లవి లాలూచీ రాజకీయాలు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ శాసనసభ సమావేశాల తీరు, అధికార కాంగ్రెస్ , ప్రధాన ప్రతిపక్షం బీఆర్ఎస్ పార్టీల వ్యవహార శైలిపై కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. మంగళవారం బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇరు పార్టీలు ప్రజా సమస్యలను గాలికొదిలేసి రాజకీయ డ్రామాలతో ప్రజలను మోసం చేస్తున్నాయని మండిపడ్డారు. అసెంబ్లీలో జరుగుతున్న పరిణామాలను చూసి రాష్ట్ర ప్రజలు అసహ్యించుకుంటున్నారని, నేతల బజారు భాష చూసి నవ్వుకుంటున్నారని ఎద్దేవా చేశారు. 'నువ్వు కొట్టినట్లు చేయ్.. నేను ఏడ్చినట్లు చేస్తా' అన్న చందంగా కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు లాలూచీ రాజకీయాలు చేస్తూ ప్రజలను పిచ్చోళ్లను చేస్తున్నారని బండి సంజయ్ ఆరోపించారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ నేతలు అసభ్య పదజాలంతో దూషించడాన్ని ప్రజాస్వామ్యవాదులెవరూ జీర్ణించుకోలేరని స్పష్టం చేశారు. తాతా మధుతో పాటు విధి నిర్వహణలో ఉన్న పోలీసులపై చేయి చేసుకున్న బీఆర్ఎస్ నేతలను వెంటనే అరెస్ట్ చేసి చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కేసీఆర్ కలుగులో దాక్కున్నారని, అసెంబ్లీకే రానప్పుడు ఆయనకు ప్రధాన ప్రతిపక్ష నేత హోదా ఎందుకని నిలదీశారు. రాష్ట్రంలో 22ఎనిషేధిత భూముల సమస్యతో ప్రజలు అల్లాడిపోతుంటే, మంత్రులు, అధికార పార్టీ నేతలు వేల కోట్ల రూపాయల భూదందాలకు పాల్పడుతున్నారని బండి సంజయ్ ఆరోపించారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రాక, సర్టిఫికెట్లు అందక లక్షలాది మంది విద్యార్థులు అరిగోస పడుతున్నారని అన్నారు. సాగునీరు లేక దక్షిణ తెలంగాణ రైతాంగం ఆందోళనలో ఉందని, ఉద్యోగాలు లేక నిరుద్యోగులు, డీఏలు పెండింగ్ బిల్లులు రాక ఉద్యోగులు, ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఆరు గ్యారెంటీల అమలు ఊసేలేదని.. ఇక రెండు రోజుల పాటు ఒకే అంశంపై చర్చించి విలువైన సభా సమయాన్ని వృథా చేయడం దుర్మార్గమని విమర్శించారు. ఇక ఫీజు రీయింబర్స్‌మెంట్‌పై ప్రజాస్వామ్యబద్ధంగా నిరసన తెలిపిన బీజేపీ కార్యకర్తలపై పోలీసులు రక్తం కారేలా లాఠీచార్జ్ చేయడం దారుణమని బండి సంజయ్ అన్నారు. బీఆర్ఎస్ నేతలకు ఎలాంటి దెబ్బలు తగలకపోయినా ఏదో జరిగిపోయినట్లుగా డ్రామాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ దొందూ దొందేనని, రెండు పార్టీలు కలిసి ప్రజలను దోచుకుంటున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకనైనా డైవర్షన్ రాజకీయాలు, డ్రామాలు కట్టిపెట్టి అసెంబ్లీలో ప్రజా సమస్యలపై చర్చించి పరిష్కార మార్గాలు చూపాలని బండి సంజయ్ హితవు పలికారు.

## సెప్టెంబరు 11న మోడీ-పుతిన్ భేటీ

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** ప్రధాని నరేంద్ర మోడీ సెప్టెంబర్ 11న రష్యా అధ్యక్షుడు పుతిన్ తో భేటీ కానున్నారు. ఈ నెల 1213 తేదీలలో ఢిల్లీలో భారత్ అధ్యక్షతన 18వ బ్రిక్స్ శిఖరాగ్ర సమావేశం జరగనున్న విషయం తెలిసిందే. ఆ సమావేశానికి ముందు ఇరువురు దేశాధినేతలు ద్వైపాక్షిక చర్చల్లో పాల్గొననున్నట్లు రష్యా అధ్యక్ష కార్యాలయం క్రెమ్లిన్ అధికార ప్రతినిధి డిమిత్రి పెస్కోవ్ వెల్లడించారు. భారత్ తమకు వ్యూహాత్మక భాగస్వామి అని.. ఇరుదేశాల మధ్య భద్రత, అంతరిక్షం, ఇంధనం, రవాణా, సైన్స్ అండ్ టెక్నాలజీ సహా పలు రంగాలలో సహకారం విస్తరిస్తోందన్నారు. ఇరుదేశాల నేతలు ద్వైపాక్షిక సమావేశం లో వాణిజ్యం, ఆర్థిక సంబంధాలకు పెద్దపీట వేయనున్నారని డిమిత్రి పేర్కొన్నారు. ఉక్రెయిన్‌తో యుద్ధం, గల్ఫ్ ఉద్రిక్తతలు, ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై దాని ప్రభావం వంటి విషయాలపైనా చర్చలు జరిపే అవకాశం ఉందన్నారు. రష్యాఉక్రెయిన్ సంక్షోభాన్ని పరిష్కరించడంలో భారత్ మధ్యవర్తిత్వం వహించడం తమకు అంగీకారమేనని తెలిపారు. యుద్ధాన్ని ముగించడానికి అమెరికా అధ్యక్షుడు ట్రంప్ సైతం తీవ్రంగా కృషి చేస్తున్నారన్నారు. ఉక్రెయిన్‌తో చర్చలు తిరిగి ప్రారంభించడానికి అమెరికా చర్యలు తీసుకుంటోందన్నారు.

**బ్రిక్స్ ఇప్పుడు ఒక భారీ కూటమి..**

బ్రిక్స్ కేవలం ఒక సాధారణ సంస్థ మాత్రమే కాదని..అదొక ప్రధాన ప్రపంచ కూటమి అని డిమిత్రి అభివర్ణించారు. ఈ కూటమి మరింత విస్తరించాలని రష్యా కోరుకుంటోందన్నారు. బ్రిక్స్ సమావేశాల్లో మరిన్ని దేశాలు పాల్గొంటే బాగుంటుందని.. ఇతర దేశాలను ఆహ్వానించడానికి తమ మద్దతు ఎప్పుడూ ఉంటుందని పేర్కొన్నారు.

**భారత్‌తో అణు సహకారంపై దృష్టి..**

రష్యాభారత్ సహకారంలో అణు శక్తి ఒక కీలక రంగమని డిమిత్రి పేర్కొన్నారు. 'అణు రంగంలో రష్యా ప్రపంచ అగ్రగామిగా ఉంది. ప్రపంచంలోని అన్ని దేశాల కంటే మేమే ఎక్కువ అణు విద్యుత్ కేంద్రాలను నిర్మిస్తున్నాం. భారత్‌లో కుడంకుళం ప్రాజెక్ట్ పనులు వేగంగా కొనసాగుతున్నాయి. భారత్‌లో నిర్మించబోయే మరో కొత్త ప్లాంట్‌కు సంబంధించి చర్చలు జరుగుతున్నాయి'' అని పేర్కొన్నారు.

## దేశంలో బొగ్గు కొరత భయం లేదు

**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** వర్షాకాలం కారణంగా బొగ్గు ఉత్పత్తిలో కొద్దిరోజుల పాటు స్వల్ప అంతరాయం ఏర్పడినా, ప్రస్తుతం దేశంలో ఎలాంటి కొరత లేదని కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి కిషన్ రెడ్డి స్పష్టం చేశారు. మంగళవారం ఆయన ఢిల్లీలో జాతీయ మీడియాతో మాట్లాడుతూ.. బొగ్గు నిల్వలు, విద్యుత్ ఉత్పత్తికి సంబంధించిన అంశాలపై క్లారిటీ ఇచ్చారు.

దేశవ్యాప్తంగా ప్రస్తుతం సుమారు 123 మిలియన్ టన్నుల బొగ్గు నిల్వలు అందుబాటులో ఉన్నాయని కిషన్‌రెడ్డి తెలిపారు. ఇది దేశానికి దాదాపు 51 రోజులకు సరిపడా నిల్వలు అని, విద్యుత్ ప్లాంట్లు, ఉత్పత్తి కంపెనీల వద్ద కూడా సుమారు 23 రోజులకు సరిపడా బొగ్గు నిల్వలు ఉన్నాయని పేర్కొన్నారు. వర్షాలు తగ్గుముఖం పట్టడంతో గత రెండు, మూడు రోజులుగా బొగ్గు ఉత్పత్తి గరిష్ట స్థాయికి చేరిందని మంత్రి కిషన్ రెడ్డి వెల్లడించారు. బొగ్గు, రైల్వే, విద్యుత్ శాఖలు సమన్వయంతో ఉదయం నుంచి రాత్రి వరకు ఎప్పటికప్పుడు పరిస్థితిని సమీక్షిస్తున్నాయని తెలిపారు. ఇక అవసరమైన ప్రాంతాలకు ఎలాంటి కొరత లేకుండా వంద శాతం బొగ్గును సరఫరా చేస్తున్నామని, భవిష్యత్తులోనూ ఎలాంటి ప్రభావం ఉండదని భరోసానిచ్చారు. ఈ ఏడాది ఇప్పటి వరకు బొగ్గు ఉత్పత్తి గత ఏడాదితో పోలిస్తే 4.5 శాతం వృద్ధిని సాధించిందని వెల్లడించారు. బొగ్గు గ్యాసిఫికేషన్‌కు సంబంధించి దరఖాస్తుల ప్రక్రియ ముగిసిందని ఆయన తెలిపారు. మొదటి విడత విజయవంతం కాగా, ఏడు ప్రముఖ కంపెనీలు దరఖాస్తులు సమర్పించాయని, సోమవారం నుంచి రెండో విడత దరఖాస్తుల ప్రక్రియ ప్రారంభమైందని కిషన్ రెడ్డి వెల్లడించారు.

## మహిళా ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలి

**బిఆర్ఎస్ ఎమ్మెల్యేలకు క్షమాపణ చెప్పాల్సిందే.. : డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి**



**విశ్వంభర, సరూర్ నగర్ :** మహిళా ప్రజాప్రతినిధుల గౌరవాన్ని కాపాడాలని, ప్రజాస్వామ్య విలువలను పరిరక్షించాలని బీఆర్ఎస్ సరూర్‌నగర్ డివిజన్ మాజీ అధ్యక్షుడు ఇంటూరి అంకిరెడ్డి అన్నారు. అసెంబ్లీ వద్ద మాజీమంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే సబితారెడ్డికి జరిగిన అవమానానికి నిరసనగా మంగళవారం సరూర్‌నగర్‌లో ధర్నా చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజలచేత ఎన్నుకోబడిన ప్రజాప్రతినిధులతో గౌరవంగా వ్యవహరించాల్సిన బాధ్యత ప్రభుత్వానికి, పోలీస్ అధికారులకు ఉందని పేర్కొన్నారు. సోమవారం అసెంబ్లీ వద్ద జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సబితారెడ్డికి జరిగిన అవమానం తెలంగాణ మహిళా సమాజానికి జరిగిన అవమానంగా భావిస్తున్నామని, దీనికి తగిన మూల్యం తప్పదని హెచ్చరించారు. మహిళా ప్రజాప్రతినిధులను గౌరవించాల్సిన పోలీసులు దురుసుగా ప్రవర్తించడం దారుణమని అన్నారు. మహిళల హక్కులు, ప్రజాస్వామ్యాన్ని కాపాడాల్సిన బాధ్యత పోలీసులదేనని స్పష్టం చేశారు. అనంతరం మహేశ్వరంలో నిర్వహించిన మహాధర్నాకు తరలివెళ్లారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ శ్రీధర్, పార్టీ సీనియర్ నాయకులు సుదామా, భాగ్య, సుశీలరెడ్డి, కట్ట ప్రవీణ్, అభిలాష్, రుషి, నారాయణ, శ్రీనివాసు, సుధ తదితరులు పాల్గొన్నారు.

## అర్హత లేని టీచర్ల నియామకం చెల్లదు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** దేశంలో ఉపాధ్యాయుల నియామకాలు, సర్దుబాటు ప్రక్రియపై దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీంకోర్టు సంచలన తీర్పును వెలువరించింది. అర్హత లేని వ్యక్తులను స్కూళ్లు, కాలేజీల్లో టీచర్లు, ట్యూటర్లుగా నియమించడాన్ని ధర్మాసనం తీవ్రంగా తప్పుబట్టింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జాయ్‌మల్య బాగ్చి, జస్టిస్ మోహనాలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. విద్యా హక్కు చట్టం , నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ , యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ నిబంధనల ప్రకారం నిర్దేశిత కనీస అర్హతలు, టెట్ , నెట్ లాంటి అర్హత పరీక్షలు పాస్ కాని వారిని ఏ విద్యా సంస్థలోనూ ఉపాధ్యాయులుగా నియమించడానికి వీలేదని స్పష్టం చేసింది.

**విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటం తగదు..**

విచారణ సందర్భంగా ధర్మాసనం స్పందిస్తూ.. అర్హత లేని వ్యక్తులను ఉపాధ్యాయులుగా ఎందుకు నియమిస్తున్నారు? ఇది భావి తరాల భవిష్యత్తును పూర్తిగా నాశనం చేస్తుందని తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. సరైన అర్హతలు, పారదర్శకమైన పోటీ పరీక్షల ప్రక్రియ లేకుండా వెనుకదారులు పట్టి ప్రభుత్వ ఉద్యోగాల్లోకి, సబ్సిడరీ వ్యవస్థల్లోకి ఉపాధ్యాయులను తీసుకోవడాన్ని కోర్టు తప్పుబట్టింది. రాజ్యాంగం కల్పించిన అధికరణం 21ఎ ప్రకారం నాణ్యమైన విద్య ప్రతి పౌరుడి ప్రాథమిక హక్కు అని కోర్టు గుర్తుచేసింది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా ఇష్టానుసారం నియామకాలు చేపడితే దేశ విద్యా ప్రమాణాలు తీవ్రంగా దెబ్బతింటాయని అభిప్రాయపడింది. భవిష్యత్తులో అన్ని ప్రభుత్వ నియామకాలు పూర్తిగా పారదర్శకంగా, నిబంధనలకు లోబడి మాత్రమే జరగాలని సుప్రీంకోర్టు తేల్చిచెప్పింది.


## తప్పుదోవ పట్టించేవారు ప్రతి మలుపు వద్దా ఉంటారు

**విశ్వంభర, నేషనల్ బ్యూరో :** యువత ఆకాంక్షలు, గళం.. విపక్షాల అబద్ధాలను అధిగమిస్తాయని ప్రధాని మోడీ అన్నారు. తప్పుదోవ పట్టించాలని చూసేవారు మన ప్రయాణంలో ప్రతి మలుపు వద్దా కనిపిస్తారని, కానీ భారత యువత సత్యాన్నే అనుసరిస్తుందని చెప్పారు. దేశ భవిష్యత్తును వారే నిర్ణయిస్తారని పేర్కొన్నారు. కాంగ్రెస్ అగ్రనాయకుడు రాహుల్ గాంధీ 'Chhatron Ki Goonj' (విద్యార్థుల ప్రతిధ్వని) పేరిట విద్యార్థులతో మాట్లాడుతోన్న సంగతి తెలిసిందే. దానిని ఉద్దేశించే మోడీ విమర్శలు చేశారు. గుజరాత్ లోని వడోదరలో 'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ''దేశంలో ప్రభుత్వాల పని సంస్కృతిలో వచ్చిన మార్పునకు వెస్ట్రర్న్ డెడికేటెడ్ ఫ్రైట్ కారిడార్ ఒక ఉదాహరణ. దానికి సంబంధించి చివరి దశకూడా పూర్తయింది. 2004లో ఈ ప్రాజెక్టను ప్రతిపాదించారు. దీని అమలు కోసం 2006లో ఒక సంస్థను ఏర్పాటు చేశారు. 2014 వరకు దానికి సంబంధించిన ఫైళ్లు అక్కడక్కడే తిరిగాయి'' అని యూపీఏ పాలనపై మోడీ ధ్వజమెత్తారు. 10 ఏళ్లలో వారు 50వేల టాయిలెట్లు కూడా కట్టించలేదని, తాము మాత్రం 50వేల రైలు కోచ్‌లను నిర్మించామని వెల్లడించారు. అనంతరం యువత గురించి మాట్లాడిన ప్రధాని.. ఏఐ యుగానికి అంతా సిద్ధంగా ఉండాలన్నారు. ఏఐ నైపుణ్యాలు ఐటీ రంగానికి మాత్రమే పరిమితం కాకూడదని సూచించారు. అలాగే రూఫ్‌టాప్ సోలార్ విస్తరణ గురించి ప్రస్తావించారు. ''ఇప్పుడు ఎన్నో కుటుంబాలు ఎలక్ట్రిసిటీ ఉత్పత్తిదారులుగా మారిపోయాయి. సౌర ఉత్పత్తి, అమర్చడం, సర్వీస్ విస్తరించడంతో యువతకు ఉపాధి అవకాశాలు పెరిగాయి'' అని పేర్కొన్నారు. ఇప్పుడు దేశం చిప్స్ నుంచి షిప్స్ వరకూ తయారీ రంగంలో కొత్త చరిత్ర లిఖిస్తోందన్నారు.

**ధురంధర్ పాటతో మోడీకి స్వాగతం..**

'నమో ఫర్ వికసిత్ భారత్' కార్యక్రమంలో భాగంగా మోడీ వస్తుండగా.. వేదికపైన ధురంధర్ సినిమాలోని 'Aari Aari', క్వీన్ చిత్రంలోని 'We Will Rock You' పాటలు వినిపించాయి. యువత నినాదాల మధ్య ప్రధానిని ఘనంగా స్వాగతించారు.

## తాతా మధు క్షమాపణ చెప్పాలి



**విశ్వంభర, హిమాయత్‌నగర్ :** స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు బహిరంగ క్షమాపణ చెప్పాలని మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదు లోయర్ ట్యాంక్‌బండ్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద మహిళా కాంగ్రెస్ ఆధ్వర్యంలో నిరసన చేపట్టి దిష్టిబొమ్మను దహనం చేశారు. క్షమాపణ చెప్పకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేపడతామని స్వర్ణ హెచ్చరించారు. ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ మహిళా అధ్యక్షురాలు శంభుల ఉషశ్రీ, శ్రీకాంత్ గౌడ్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధ పదవిలో ఉన్న స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేయడం తగదన్నారు. తాతా మధు వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా మాల సంఘాల నాయకులు సైతం తాతా మధుపై చర్యలు తీసుకుని, ఆయన శాసన మండలి సభ్యత్వాన్ని రద్దు చేయాలని కోరారు.




## 10 వేల కోట్ల పెండింగ్ ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి: పి డి ఎస్ యు

**విశ్వంభర, మలక్ పేట్ :** 10 వేల కోట్ల పెండింగ్ ఫీజు రియంబర్స్ మెంట్ వెంటనే విడుదల చేయాలి అని పి డి ఎస్ యు రాష్ట్ర అధ్యక్షుడు పి మహేష్ డిమాండ్ చేశారు. ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో పదివేల కోట్ల పెండింగ్ ఫీజు రియంబర్స్మెంట్స్ స్కాలర్షిప్ లు విడుదల చేయాలని దిల్ సుకు నగర్ స్ఫూర్తి డిగ్రీ కళాశాల నుండి బస్టాండ్ సెంటర్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పి మహేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తే పెండింగ్ ఫీజు రీయింబర్స్మెంట్ స్కాలర్షిప్ లను వెంటనే ఇస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత హామీలు విస్మరిచ్చిందన్నారు. అధికారంలోకి వచ్చి మూడు సంవత్సరాలు గడుస్తున్నా కూడా నేటికీ వాటిని విడుదల చేయడంలో తీవ్రమైన నిర్లక్ష్యాన్ని వహిస్తుందన్నారు. దీనివల్ల పేద బడుగు బలహీన వర్గాల విద్యార్థులు ఉన్నత విద్యను కోల్పోతున్నారన్నారు. రేవంత్ రెడ్డి ప్రభుత్వం గుడులకు, మందిరాలకు, చర్చిలకు, ముసీనది ప్రాజెక్టులకు ఫోర్త్ సిటీ పేరుతో వేలకోట్ల రూపాయలను ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తూ విద్యార్థులకు ఉపయోగపడే ఫీజు రియంబర్స్మెంట్ మాత్రం విడుదల చేయడంలో ప్రభుత్వానికి చేతులు రావడంలేదని అన్నారు. గ్రేటర్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శి కె.శ్రీనివాస్, గ్రేటర్ హైదరాబాద్ ఉపాధ్యక్షుడు గడ్డం గౌతం, నాయకులు హరీష్, సంతోష్ రాజేష్ శివ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

## మానవత్వం చాటుకున్న చేపూరి



**విశ్వంభర, హైదరాబాద్ :** అనారోగ్యం కారణంగా గాంధీ ఆసుపత్రిలో రంగారెడ్డి జిల్లా, కొంగర కలాన్ గ్రామానికి చెందిన కే బాబు కు అత్యవసరంగా రక్తం అవసరం పడగా వనస్థలిపురానికి చెందిన సామాజిక కార్యకర్త, మదర్ థెరిస్సా చారిటబుల్ సొసైటీ నిర్వాహకులు చేపూరి శంకర్ కు విషయం తెలుసుకొని వెంటనే విద్యానగర్ బ్లడ్ బ్యాంక్ రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో ఉచితంగా ఏర్పాటు చేశారు. వారికి కావాల్సిన రక్తాన్ని పూర్తిగా మరొకరి ద్వారా కూడ భాదితుడికి అందిస్తాం అని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా చేపూరి శంకర్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ రక్తదానం చేసి రక్తం అవసరం ఉన్న వాళ్ళ ప్రాణాలను కాపాడాలని అన్నారు.

## ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాహేద్ అరెస్ట్



**విశ్వంభర, సరూర్ నగర్ :** ఎర్రవల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ వద్ద కాంగ్రెస్ పార్టీ వెయ్యి డబ్బుల కార్యక్రమంను పిలుపు నిచ్చిన నేపథ్యంలో నిరసన తెలియజేయడానికి వెళుతున్న ఆర్కే పురం డివిజన్ బిఆర్ఎస్ ఉపాధ్యక్షులు మొహమ్మద్ జాహీద్ ను ముందస్తుగా మార్క్యాక్ పోలీస్ లు అరెస్ట్ చేసి స్టేషన్కు తరలించారు. అరెస్ట్ అయిన వారిలో ఎండి జహీర్ ఖాన్ ,గుండుమల్ల పాండు గౌడ్, భాస్కర్, ఎన్ ఎన్ రాజు లు ఉన్నారు.

## ఎమ్మెల్యే పై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు



**విశ్వంభర, తిప్పర్తి :** షాద్ నగర్ ఎమ్మెల్యే కే. శంకరయ్య మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు తిప్పర్తి పోలీస్ స్టేషన్లో తిప్పర్తి మండలం బి ఆర్ ఎస్ పార్టీ అధ్యక్షుడు రవీందర్ రెడ్డి ఆధ్వర్యంలో ఎస్సై కు ఫిర్యాదు అందజేశారు. ఈ సందర్భంగా రవీందర్ రెడ్డి మాట్లాడుతూ ఎమ్మెల్యే శంకరయ్య వెంటనే క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను బిఆర్ఎస్ పార్టీ శాసనసభలో ప్రశ్నిస్తుందని ఉద్దేశంతో ఇలాంటి నీచ రాజకీయాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తెరలేపాడని అన్నారు. ఈ కార్యక్రమంలో పి ఏ సి ఎస్ వైస్ చైర్మన్ కందుల రేణుకా లక్ష్మయ్య,ఇండ్లూర్ ఉపసర్పంచ్ గడ్డమిది గురవయ్య, గుండెబోయిన రామచంద్రు, గుండెబోయిన నాగరాజు, జాకటి ఆనంద్, ఊదరి శ్రీకాంత్, పేరం లింగయ్య, పొలాగోని సతీష్,దుప్పలపల్లి సైదులు తదితరులు పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ నగర్ సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు




**విశ్వంభర, సరూర్ నగర్ :** రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గ ఎన్టీఆర్ నగర్లో ఉన్న ప్రజల సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలని సోషల్ జస్టిస్ పార్టీ అధ్యక్షులు చామకూర రాజు డిమాండ్ చేశారు. సోషల్ జస్టిస్ పార్టీ ఆధ్వర్యంలో మంగళవారం ఎన్టీఆర్ నగర్లో బస్తీ దర్బార్ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమంలో స్థానికులు ఎన్టీఆర్ నగర్లో ఉన్న ఇండ్ల పట్టాల సమస్య, అస్తవ్యస్తమైన డ్రైనేజీ, వీధిలైట్ల నిర్వహణ, పారిశుద్ధ నిర్వహణ లోపం వంటి బస్తీలో సమస్యలు ఉన్నాయని అన్నారు. ఈ సందర్భంగా చామకూర రాజు మాట్లాడుతూ ఎన్టీఆర్ నగర్ బస్తి ఓట్లతో మంత్రులైన వారు కార్పొరేటర్ అయిన వారు కనీస సమస్యలు పరిష్కరించకపోవడం సిగ్గుచేటు అని అన్నారు. మున్సిపల్ అధికారులు వాటర్ వర్క్స్ అధికారులు తక్షణమే స్పందించి సమస్యలు పరిష్కరించాలని వారు కోరారు ఈ కార్యక్రమంలో కె.వి గౌడ్ , ప్రధాన కార్యదర్శి బాలాపూర్ బాలస్వామి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి ఎం సతీష్, కార్యదర్శి దివ్యాంగుల విభాగం అధ్యక్షులు సైదులు యాదవ్, అధికార ప్రతినిధి చిత్తలూరు వేణు గౌడ్, మేడ్చల్ అసెంబ్లీ నియోజకవర్గ అధ్యక్షులు వడ్డెర రఘుపతి తదితరులు పాల్గొన్నారు.

## యువ వికాస్ నిధులు విడుదల చేయాలి



**విశ్వంభర, ముషీరాబాద్ :** రాజీవ్ యువ వికాస్ పథకం కింద ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ నిరుద్యోగ యువతకు నిధులు వెంటనే విడుదల చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య, మాజీ మంత్రి మోత్కుపల్లి నరసింహులు డిమాండ్ చేశారు. మంగళవారం హైదరాబాదు ఇందిరాపార్కు ధర్నాచౌక్లో తెలంగాణ మాదిగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన ధర్నాలో వారు మాట్లాడారు. పథకానికి రూ.6 వేల కోట్లు కేటాయించి 4 లక్షల మందికి స్వయం ఉపాధి కోసం ఆర్థిక సాయం అందిస్తామని ప్రభుత్వం ప్రకటించినా నిధులు విడుదల చేయలేదన్నారు. అర్హుల జాబితా సిద్ధమైనందున వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. ప్రభుత్వం స్పందించకపోతే దశలవారీగా ఉద్యమం చేపడతామని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గడ్డ యాదయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో: దూదిమెట్ల బాలరాజు యాదవ్, కొంపల్లి నరేష్ మాదిగ, కడియం రాంబాబు, చుక్క శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# ఫిలిప్పీన్స్‌కు బియ్యం ఎగుమతులు పెంచాలి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** తెలంగాణ నుంచి బియ్యం ఎగుమతులను పెంచడంతోపాటు తెలంగాణ-ఫిలిప్పీన్స్ మధ్య వాణిజ్యాన్ని మరింత విస్తరించాలని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి కోరారు. మంత్రి ఉత్తమ్ మంగళవారం న్యూఢిల్లీలో ఫిలిప్పీన్స్ వ్యవసాయ శాఖ కార్యదర్శి, ఆ దేశ కేబినెట్ సభ్యుడు ఫ్రాన్సిస్కో పి.టు లారెల్ జూనియర్‌తో సమావేశమయ్యారు. భారతదేశంలో అత్యధికంగా వరి పండించే రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటి అని వివరించారు. భారీ పరిమాణంలో నాణ్యమైన బియ్యాన్ని సరఫరా చేయగల ఉత్పత్తి సామర్థ్యం, ఆధునిక రైస్ మిల్లింగ్ వ్యవస్థ, అవసరమైన అనుభవం తెలంగాణకు ఉన్నాయని తెలిపారు. తెలంగాణ నుంచి బియ్యం దిగుమతి చేసుకోవాలనే ప్రతిపాదనపై కార్యదర్శి లారెల్ సానుకూలంగా స్పందించారు. తెలంగాణ నుంచి మరింత పెద్ద పరిమాణంలో బియ్యాన్ని కొనుగోలు చేసే అవకాశాలను పరిశీలిస్తామని ఆయన హామీ ఇచ్చారు. సంబంధిత ప్రభుత్వ సంస్థలు, గుర్తింపు పొందిన దిగుమతిదారులు, ఎగుమతిదారులు, రైస్ మిల్లర్ల భాగస్వామ్యంతో ఈ ప్రతిపాదనను ముందుకు తీసుకెళ్లే విధానంపై చర్చించారు. ఫిలిప్పీన్స్‌కు దిగుమతి చేసుకునే బియ్యం అవసరం గణనీయంగా ఉండటం, అంతర్జాతీయంగా బియ్యం సరఫరా చేసే దేశాల సంఖ్యను విస్తరించేందుకు ఆ దేశం ప్రయత్నిస్తుండటం నేపథ్యంలో ఈ చర్చలకు ప్రత్యేక ప్రాధాన్యం ఏర్పడింది. పోటీ ధరలు, విశ్వసనీయమైన నాణ్యత, నిర్ణీత సమయంలో సరఫరా చేయగల సామర్థ్యంతో తెలంగాణ దీర్ఘకాలిక భాగస్వామిగా నిలవగలదని ఉత్తమ్ పేర్కొన్నారు. బియ్యం రకాలు, ధరలు, నాణ్యతా ప్రమాణాలు, కొనుగోలు విధానాలు, రవాణా, ధ్రువీకరణ ప్రక్రియలు, శానిటరీ మరియు ఫైటోశానిటరీ నిబంధనలపై కూడా ఇరువురు చర్చించారు. ఈ అంశాలను సంబంధిత అధికారులు, పరిశ్రమ ప్రతినిధులు పరిశీలించి, వాణిజ్య అవకాశాలను కార్యరూపంలోకి తీసుకురావడానికి స్పష్టమైన కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని నిర్ణయించారు. ఉత్తమ్, కార్యదర్శి లారెల్ తమ తమ ప్రాంతాలను సందర్శించాల్సిందిగా పరస్పరం ఆహ్వానించుకున్నారు. 2026 డిసెంబర్‌లో నిర్వహించనున్న తెలంగాణ రైజింగ్ సమ్మిట్‌లో పాల్గొనేందుకు హైదరాబాద్ రావాల్సిందిగా కార్యదర్శి లారెల్‌కు ప్రత్యేకంగా ఆహ్వానించారు.

### స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా

## వెయ్యి డప్పులతో కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి యత్నం

### పోలీసులకు నాయకులకు మధ్య తోపులాట.. గాయపడ్డ పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్



**విశ్వంభర, సిద్దిపేట జిల్లా ప్రజ్ఞాపూర్ :** అసెంబ్లీ వద్ద బిఆర్ఎస్ పార్టీ నిరసన నేపథ్యంలో ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా వెయ్యి డప్పులతో కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి నాయకులు, కార్యకర్తలు ప్రయత్నించారు. తెలంగాణ రాష్ట్ర పద్మశాలి కోఆపరేటివ్ కార్పొరేషన్ చైర్మన్ గూడూరు శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే నరసారెడ్డిని కాంగ్రెస్ పార్టీ కి చెందిన నాయకులు కార్యకర్తలను పోలీసులు అరెస్టు చేశారు, ఈ క్రమంలో పోలీసులకు, నాయకులు-కార్యకర్తలకు మధ్య తోపులాట చోటుచేసుకుంది. ఈ తోపులాటలో గూడూరు శ్రీనివాస్ గాయపడి అస్వస్థతకు గురి కాగా పోలీసులు ఆయనను అదుపులోకి తీసుకుని కుకునూరుపల్లి పోలీస్ స్టేషన్ కి తరలించారు. అనంతరం అస్వస్థత కారణంగా ప్రజ్ఞాపూర్‌లోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స తీసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో కాంగ్రెస్ పార్టీ విలువలతో కూడుకున్న రాజకీయం చేసిందని గత బిఆర్ఎస్ ప్రభుత్వం వచ్చిన నుండి విలువలను తుంగలో తొక్కి నీచ రాజకీయాలకు పాల్పడుతున్నారు అని గూడూరు శ్రీనివాస్ మండిపడ్డారు. ఇకనైనా బిఆర్ఎస్ నాయకులు తమ తీరును మార్చుకుని బిఆర్ఎస్ ఎమ్మెల్సీ చేసిన వ్యాఖ్యలకు బేషరతుగా స్పీకర్ కు క్షమాపణలు చెప్పి తమ నాయకులు కార్యకర్తలు చేసిన పనిని కేసీఆర్, హరీష్ రావులు ఖండించాలని వారు కోరారు.

## విద్యుత్ ఉద్యమ అమరుడు సత్తెనపల్లి రామకృష్ణ 26 వర్ధంతి




**విశ్వంభర, ముషీరాబాద్ :** జమిస్తాన్పూర్ ముషీరాబాద్ చేతి వృత్తిదారుల రాష్ట్ర కార్యాలయంలో తెలంగాణ రజక వృత్తిదారుల సంఘం ఆధ్వర్యంలో సత్తెనపల్లి రామకృష్ణ 26వ వర్ధంతి జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిఐటియు రాష్ట్ర ఉపాధ్యక్షులు ఆర్ సుధా భాస్కర్ మాట్లాడుతూ విద్యుత్ ఉద్యమం జరిగి 26 ఏళ్ల అయినా కూడా ఆ పోరాట ఘటాలను నేటికీ మర్చిపోలేకుండా ఉన్నామని ఆ పోరాట ఫలితాలే విద్యుత్తు రేట్లు పెంచకుండా పాలకులు భయపడుతున్నారని తెలిపారు. విద్యుత్తు ప్రైవేటీకరణ కాకుండా మనందరం పోరాడాలని వారు పిలుపునిచ్చారు. విద్యుత్తు స్మార్ట్ మీటర్ల పేరుతోటి రైతులని పేదలని దగా చేయాలని చూస్తుందన్నారు. చేతి వృత్తిదారుల సమన్వయ కమిటీ రాష్ట్ర కన్వీనర్ ఎం.వి రమణ మాట్లాడుతూ సెప్టెంబర్ 8 వృత్తిదారుల దీక్షా దినంగా ఆ అమరులకు నివాళులు అర్పించే కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా చేపడుతున్నమని తెలిపారు. చేతి వృత్తిదారులందరూ విద్యుత్ తోటే తమ ఆధునిక వృత్తి పనులు సాగిస్తున్నారని విద్యుత్తు రాయితీలు విద్యుత్తు ఉద్యమ ఫలితమేనని తెలిపారు. ఉచిత విద్యుత్తు వివిధ వృత్తిదారులు పొందుతున్నారని విద్యుత్తు ప్రవేటికరణ కాకుండా వాటిని కాపాడుకునే బాధ్యత మనందరి పైన ఉన్నదని తెలిపారు. ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పైళ్ళ ఆశయ్య మాట్లాడుతూ రజక, క్షౌర వృత్తిదారుల అందరికీ ఉచిత విద్యుత్తు ప్రభుత్వ విస్తుందని వాటి బిల్లులు చెల్లించకుండా కాలయాపన చేస్తుందని విమర్శించారు. ఉచిత విద్యుత్తు పాత బకాయిలు ప్రభుత్వం వెంటనే చెల్లించాలని, కొత్త కనెక్షన్లకు మరో అవకాశం ఇవ్వాలని, 250యూనిట్ల నుండి 1,000 యూనిట్లు వరకు పెంచి డ్రై క్లీన్ లకు ల కు ధోబి గాట్లకు, వాషింగ్ ప్లాంట్లకు సెలూన్ షాపులకు, వివిధ వృత్తిదారులకు అందించాలని ఈ సందర్భంగా డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గొర్రెల, మేకల పెంపకార్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి ఉడుత రవీందర్, క్షౌరవృత్తిదారుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చేన్నారామ్ మల్లేష్, రజక వృత్తిదారుల సంఘం రాష్ట్ర కమిటీ సభ్యులు కేశరాజు యాదగిరి, గ్రేటర్ హైదరాబాద్ సెంట్రల్ సిటీ నాయకులు లంక సోమయ్య, గోపి, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

## మహిళా పోలీసుల పట్ల అసభ్య ప్రవర్తన దురదృష్టకరం

### మహిళా పోలీసులను పరామర్శించిన మంత్రి సీతక్క



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** అసెంబ్లీ గేట్ వద్ద సోమవారం జరిగిన ఘటనలో గాయపడిన మహిళా పోలీసులను మంత్రి సీతక్క అసెంబ్లీ ప్రాంగణంలో మంగళవారం పరామర్శించారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలను మహిళా పోలీసు అధికారులు సీతక్కకు వివరించారు. విధి నిర్వహణలో ఉన్న తమ పట్ల కొందరు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు అసభ్యంగా ప్రవర్తించారని మహిళా పోలీసులు ఆవేదన వ్యక్తం చేశారు. తమను అసభ్యకరంగా తాకారని, ఘటనకు సంబంధించిన ఫోటోలు, వీడియో విజువల్స్‌ను మంత్రి సీతక్కకు చూపిస్తూ మహిళా పోలీసులు ఫిర్యాదు చేశారు. తమకు కేటాయించిన విధులను నిర్వహిస్తున్న సమయంలో కొందరు నేతలు టీషర్టులు విసిరేసి తమ మీదికి దూసుకొచ్చారని, విధి నిర్వహణలో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నామని వివరించారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అంతు చూస్తామని కొందరు బెదిరింపులకు పాల్పడ్డారని మహిళా పోలీసులు మంత్రి సీతక్క దృష్టికి తీసుకొచ్చారు. బీఆర్ఎస్ ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలు తమ చుట్టూ చేరి.. ఒత్తిడికి గురి చేశారని, వాళ్ల ప్రవర్తన కారణంగా ఇబ్బందులు పడ్డామని ఆవేదన వ్యక్తం చేశారు. చొక్కాలు తొలగించి అసభ్యంగా తమ వైపునకు దూసుకొచ్చారని, వారి ప్రవర్తనతో తలదించుకోవాల్సి వచ్చిందన్నారు. మీరు ధైర్యంగా ఉండండి. విధి నిర్వహణలో ఉన్న మహిళా పోలీసులకు ప్రభుత్వం అండగా ఉంటుంది. మీ డ్యూటీని నిబద్ధతతో చేయండి. ఎవరి బెదిరింపులకు భయపడాల్సిన అవసరం లేదు. చట్టం తన పని తాను చేసుకుంటుంది. మీ పట్ల అనుచితంగా వ్యవహరించిన వారిపై చర్యలు తీసుకుంటాం' అని మంత్రి సీతక్క భరోసా ఇచ్చారు. మహిళా ఉద్యోగులు, మహిళా పోలీసులు తమ విధులను నిర్భయంగా నిర్వహించే వాతావరణం కల్పించడం ప్రభుత్వ బాధ్యత అని, వారి ఆత్మగౌరవానికి భంగం కలిగించే ఏ చర్యనైనా ఉపేక్షించదని సీతక్క స్పష్టం చేశారు.

## నిర్లక్ష్యంగా ఆహార వ్యర్థాల తరలింపు

**విశ్వంభర, కూకట్‌పల్లి :** ప్రైవేటు హాస్టళ్లు, హోటళ్ల నుంచి సేకరించిన ఆహార వ్యర్థాలను ఎటువంటి కనీస జాగ్రత్తలు తీసుకోకుండా తరలిస్తున్నారు కొందరు. మాదాపూర్, అయ్యప్ప సొసైటీ, కేపీహెచ్‌బీ కాలనీ పరిధిలోని ప్రైవేటు హాస్టళ్లు, హోటళ్ల నుంచి మిగిలిన ఆహార వ్యర్థాలను ఓ వ్యక్తి మహీంద్రా బొలెరో ట్రాలీలో తరలిస్తూ కనిపించాడు. కొంపల్లిలోని బర్ల కొట్టంలో పశువులకు ఆహారంగా ఈ ఆహార వ్యర్థాలను వినియోగిస్తామని సమాధానం ఇచ్చాడు. జీహెచ్‌ఎంసీ అధికారుల నిర్లక్ష్యం, పర్యవేక్షణ లోపంతో ఎటువంటి కనీస జాగ్రత్తలు, కవర్ కప్పుకోకుండా ఆహార వ్యర్థాలను తరలిస్తున్నారు. వ్యర్థాల నుంచి వచ్చే దుర్వాసన, రోడ్డు పొడవునా వ్యర్థాల నుంచి కారుతున్న నీటితో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు.

## నెల రోజులుగా తాగునీటి సమస్య

**విశ్వంభర, పలిమెల :** జయశంకర్ భూపాలపల్లి జిల్లా పలిమెల మండలంలోని అప్పాజీపేట గ్రామ ప్రజలు తాము నెల రోజులుగా తాగునీటి సమస్యతో ఇబ్బందులు పడుతున్నామని, ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా అధికారులు పట్టించుకోవడం లేదని అప్పాజీపేట గ్రామ మహిళలు వాపోయారు. ప్రతి రోజు పంట పొలాల్లో, చెరువులు, కుంటల్లోకి వెళ్లి ఎడ్లబండ్లతో, డ్రమ్ములు తీసుకొని, మరికొంతమంది మహిళలు పొలాల్లోకి బిందెలు, బకెట్లు పట్టుకొని ఉదయం, సాయంత్రం తాగునీరు, స్నానాలకు నీటిని తీసుకురావాల్సి వస్తుందని పేర్కొన్నారు. ఈ పరిస్థితి నెల రోజులుగా కొనసాగుతున్నా పంచాయతీ అధికారులకు తెలిపినా పట్టించుకోవడం లేదని, మంచినీటి సమస్యను పూర్తిగా పరిష్కరించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ గ్రామానికి మంచినీటి సమస్య కొన్ని సంవత్సరాలుగా ఎదురవుతోందని తెలిపారు. అంతంతమాత్రంగా గ్రామపంచాయతీ సిబ్బందితో నామమాత్రంగా పనులు చేయించి, మళ్లీ వదిలేస్తున్నారని ఆరోపించారు. గత కొన్ని సంవత్సరాల నుంచి ఇదే పరిస్థితిని ఎదుర్కొంటున్నామని, తాము తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని వాపోయారు. తాగునీటి కోసం రాత్రి 12 గంటల సమయంలో బిందెలు పట్టుకొని వ్యవసాయ పొలాల్లోకి వెళ్లాల్సి వస్తోందన్నారు. అధికారులు ఇప్పటికైనా స్పందించాలని సమ్మక్క, లక్ష్మి, రుద్రమ్మ విజ్ఞప్తి చేశారు.

## ఫీజు బకాయిల విడుదలపై జోక్యం చేసుకోవాలి..

### గవర్నర్‌కు బీజేపీ నేతల విజ్ఞప్తి



**విశ్వంభర, తెలంగాణ బ్యూరో :** రాష్ట్రంలో రూ.15,000 కోట్ల ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయించేలా ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరుతూ.. బీజేపీ ప్రతినిధి బృందం లోక్‌భవన్‌లో గవర్నర్ శివ ప్రతాప్ శుక్లాను మంగళవారం కలిసి వినతిపత్రం అందజేసింది. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు నేతృత్వంలో ప్రధాన కార్యదర్శులు గౌతమ్ రావు, వీరేందర్ గౌడ్, వేముల అశోక్ తదితరులు గవర్నర్‌ను కలిశారు. గవర్నర్‌తో భేటీ అనంతరం రాంచందర్ రావు మీడియాతో మాట్లాడారు. బీఆర్ఎస్ పాలన నుంచి కాంగ్రెస్ ప్రభుత్వం వరకు దాదాపు 40 లక్షల మంది విద్యార్థులు ఫీజు రీయంబర్స్‌మెంట్ బకాయిల కోసం ఎదురుచూస్తున్నారని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యాశాఖను తనవద్దే ఉంచుకొని నిర్వీర్యం చేస్తున్నారని విమర్శించారు. విద్యా వ్యవస్థను కాపాడేందుకు బకాయిలను విడుదల చేసేలా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని, తగిన సలహాలు ఇవ్వాలని గవర్నర్‌ను కోరినట్లు చెప్పారు. దీనిపై సానుకూలంగా స్పందించిన గవర్నర్.. ముఖ్యమంత్రితో మాట్లాడి నిర్ణయం తీసుకునేలా సలహా ఇస్తానని హామీ ఇచ్చారని రాంచందర్ రావు వెల్లడించారు. విద్యార్థుల హక్కుల కోసం శాంతియుతంగా నిరసనలు చేస్తుంటే ప్రభుత్వం లాఠీఛార్జీలు, ముందస్తు అరెస్టులు, అక్రమ కేసులు బనాయిస్తోందని పేర్కొన్నారు. బీజేపీ, బీజేవైఎం నాయకులు, కార్యకర్తలపై పెట్టిన అక్రమ కేసులను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### మహిళా ఎమ్మెల్యేలపై దురుసుగా ప్రవర్తించిన

## అధికారులపై చర్యలు తీసుకోవాలి

### యూత్ అధ్యక్షుడు నక్క శరత్



విశ్వంభర, సరూర్ నగర్ : అసెంబ్లీ సమావేశాలకు బయలుదేరినటువంటి బిఆర్ఎస్ పార్టీ ఎమ్మెల్యేల పై ముఖ్యంగా మహిళ నాయకురాలు అయినా మహేశ్వరం నియోజకవర్గ ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి పై పోలీసులు దురుసుగా ప్రవర్తించిన అధికారులపై వెంటనే చర్యలు తీసుకోవాలని బిమ్ ఆర్మీ స్టేట్ యూత్ అధ్యక్షులు నక్క శరత్ కుమార్ చరణ్ డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ పోలీస్ వ్యవస్థకే మచ్చ తెచ్చే విధంగా ప్రవర్తించిన వారిపై తక్షణమే చర్యలు తీసుకొని ఉద్యోగం నుండి తీసివేయాలని అన్నారు. భారత రాజ్యాంగం విలువలను కూడా వారు లెక్కచేయకుండా ప్రవర్తించారు బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ , హరీష్ రావు , ఎమ్మెల్యేల అందరిని పోలీసులు వారు గోళ్ళతో గీరడం ఇలాంటి ఒక చర్యలకు వారు పాల్పడ్డారు. సంఘటన యావత్ తెలంగాణ మొత్తానికి బ్లాక్ డే గా అని అన్నారు .చేతకాని కాంగ్రెస్ ప్రభుత్వం అసెంబ్లీలో ఎదుర్కొనే దమ్ము లేక మరి ఇలాంటి ఒక చర్యకు పాల్పడడం సిగ్గుచేటు. ఖబర్దార్ రేవంత్ రెడ్డి అని హెచ్చరించారు. కార్యక్రమంలో టిఆర్ఎస్వి నాయకులు ఎలిమినేటి ప్రశాంత్, సిపి సాయి, రాజు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

రిపోర్టర్లు కావలెను
V3 NEWS
ప్రజా "విశ్వంభర" తెలుగు దిన పత్రిక
ప్రముఖ టీవీ ఛానల్, తెలుగు దినపత్రికకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలలో జిల్లాలు, మండలాల వారిగా రిపోర్టర్లు, కెమెరామెన్స్, వీడియో ఎడిటర్స్, న్యూస్ పేపర్ డిజైనర్స్, గ్రాఫిక్ డిజైనర్, సబ్-ఎడిటర్లు, యాంకర్స్, PCR ఆపరేటర్స్, మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ పని చేయుటకు అనుభవం, ఆసక్తి గలవారు కావలెను.
సంప్రదించవలసిన చిరునామా
ఫ్లాట్ నెం. 204, 2వ అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నెం. 1560 ఎదురుగా, చైతన్యపురి x రోడ్స్, దిల్‌సుఖ్‌నగర్, హైదరాబాద్ - 500 060, తెలంగాణ.
సెల్: 9441222429, 8885402108

# "తెలంగాణ విప్లవ తేజం కాళోజీ"

## నేడు తెలంగాణ భాషా దినోత్సవంగా జరుపుకునే కాళోజీ జయంతి


"ఏ భాష నీది ఏమి వేషమురా,
ఈ భాష ఈ వేషమెవరి కోసమురా,
ఆంగ్లమందున మాటలనగానే
ఇంత కుల్కెదవెందుకు రా,
తెలుగు వాడివై తెలుగు రాదనుచు,
సిగ్గులేక ఇంక చెప్పుటెందుకురా
అన్య భాషలు నేర్చి ఆంధ్రమ్ము రాదంచు, సకిలించు ఆంధ్రుడా చావ వెందుకురా,"!...పర భాషలపై మోజుతో మాతృ భాషను విస్మరించే వారిని కాళోజీ కంటే గొప్పగా హెచ్చరించిన వారెవరూ లేరనేది వాస్తవం. అందుకే ఆయన జయంతి 'తెలంగాణ భాషా దినోత్సవం' అయింది.ఎక్కడో మరాఠాల కుటుంబంలో పుట్టి, వరంగల్‌కు వచ్చి స్థిరపడి 'నాది బడి పలుకుల భాష కాదు.. పలుకు బడుల భాష.. నా మాతృభాష తెలుగు' అని ఎలుగెత్తిన పోరాట యోధుడు. భయం అనేది ఎరుగని కలం వీరుడు కాళోజీ. ఆయన తుపాకీ గుండ్లకు ఎదురు నిలిచాడు. ఎన్నో సార్లు నిజాం ప్రభుత్వం కాళోజీని వరంగల్లు నుంచి బహిష్కరించింది.

"నా గురించి చెప్పు కోవాలంటే ఎక్కడ అన్యాయం జరిగినా ప్రతిఘటిస్తు వచ్చిన, అన్ని ఉద్యమాల్లో ధైర్యంగా పాల్గొన్న, ఎక్కడ అక్రమం జరిగినా దాన్ని ధిక్కరిస్తూ గేయమో, కథో రాసిన. నా గేయాలలో తొంభై ఐదు శాతం ఉద్యమాలపై రాసినవే. అవన్నీ గేయ రూపంలో ఉన్న స్టేటుమెంట్లే."

అలాంటి కలం వీరుడిని జ్ఞాపకం చేసుకుని నివాళులు అర్పించాల్సిన అవసరం అనివార్యంగా ఉంది.

రఘువీర్ నారాయణ్ లక్ష్మీకాంత్ శ్రీనివాసరాం రాజా కాళోజీ (సెప్టెంబరు 9, 1914 నవంబరు 13, 2002) "కాళోజీ నారాయణ రావు లేదా కాళోజీ లేదా కాళన్న" గా సుపరిచితులు. ఆయన తెలంగాణ ప్రజల ప్రతీ ఉద్యమం యొక్క ప్రతిధ్వనిగా కొనియాడ బడతాడు. ఆయన రాజకీయ సాంఘిక చైతన్యాల సమాహారం. కవిత్వం రాసినా, హక్కులడిగినా, ఉద్యమం నడిపినా, ప్రజా వాణికి ప్రతిధ్వనిగా నిలిచాయన. మొత్తంగా తెలంగాణ జీవిత చలన శీలి కాళోజీ. ఆజన్మాంతం తెలంగాణ ప్రజల అన్యాయాల గురించే తపించిన మహనీయుడు, వైతాళికుడు కాళోజీ. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకి వ్యతిరేకంగా ఆయన తన కలం ఎత్తాడు. ఆయన స్వాతంత్ర్య సమర యోధుడు, తెలంగాణా ఉద్యమ కారుడు. ఆయన 1992లో భారతదేశ అత్యున్నత పురస్కారం పద్మ విభూషణ్ పొందాడు. ఆయన జన్మదినాన్ని తెలంగాణ ప్రభుత్వం తెలంగాణ భాషా దినోత్సవంగా చేసి గౌరవించింది. వరంగల్ లో నెలకొన్న వైద్య విద్యాలయానికి ఆయన పేరు పెట్టబడింది.

'అన్యాయాన్నెదిరిస్తే నా గొడవకు సంతృప్తి... అన్యాయం అంతరిస్తే నా గొడవకు ముక్తిప్రాప్తి. అన్యాయాన్నెదిరించిన వాడే నాకారాధ్యుడు' అని సగర్వంగా ప్రకటించి ఉద్యమమే ఊపిరిగా జీవించిన ప్రజాకవి కాళోజీ నారాయణరావు. ఆయన 1914, సెప్టెంబరు 9 న (కర్ణాటక) రాష్ట్రం, బీజాపూర్ జిల్లా లోని రట్టిహళ్లి గ్రామంలో జన్మించాడు. తల్లి రమా బాయమ్మ, కన్నడిగుల ఆడ పడుచు. తండ్రి కాళోజీ రంగారావు మహారాష్ట్రీయుడు. కాళోజీ తెలుగు, ఉర్దూ, హిందీ, మరాఠీ, కన్నడ, ఇంగ్లీషు భాషల్లో రచయితగా ప్రఖ్యాతి గాంచాడు. రాజకీయ వ్యంగ్య కవిత్వం వ్రాయడంలో కాళోజీ దిట్ట. 'నా గొడవ' పేరిట సమకాలీన సామాజిక సమస్యలపై నిర్మొహ మాటంగా, నిక్కచ్చిగా, కటువుగా స్పందిస్తూ పాలకులపై అక్షరాయుధాలను సంధించి ప్రజాకవిగా కీర్తిగడించాడు. తెలంగాణ ప్రజల ఆర్తి, ఆవేదన, ఆగ్రహం ఆయన గేయాల్లో రూపు కడతాయి. నిజాం దమన నీతికి, నిరంకుశత్వానికి, అరాచక పాలనకు వ్యతిరేకంగా కలం, గళం ఎత్తిన ఈ శతాబ్దపు మేటి కవి కాళన్న. బీజాపూర్ నుంచి వరంగల్ జిల్లాకు తరలివచ్చిన కాళోజీ కుటుంబం మడికొండలో స్థిరపడింది. ప్రాథమిక విద్యానంతరం హైదరాబాదు పాతబస్తీలోని చౌమహల్ న్యాయ పాఠశాలలో కొంతకాలం చదివిన కాళోజీ, అటు తరువాత సిటీ కాలేజీలోనూ, హన్మకొండ లోని కాలేజియేట్ ఉన్నత పాఠశాల లోనూ చదువు కొనసాగించి మెట్రిక్యులేషను పూర్తిచేశాడు. 1939 లో హైదరాబాదు లో హైకోర్టుకు అనుబంధంగా ఉన్న న్యాయ కళాశాల నుంచి న్యాయ శాస్త్రంలో పట్టా పొందాడు. 1930 నుంచే కాళోజీ గ్రంథాలయ ఉద్యమంలో చురుగ్గా పాల్గొన్నాడు. తెలంగాణలోని ప్రతి గ్రామంలో ఒక గ్రంథాలయం ఉండాలన్నది కాళోజీ ఆకాంక్ష. సత్యాగ్రహోద్యమంలో పాల్గొని 25



సంవత్సరాల వయసులో జైలుశిక్ష అనుభవించాడు. నిజామాంధ్ర మహాసభ, హైదరాబాదు స్టేట్ కాంగ్రెసుతో కాళోజీ అనుబంధం విడదీయ రానిది. 1940 లో రుక్మిణీబాయితో వివాహం జరిగింది. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి, జమలాపురం కేశవరావు, బూర్గుల రామకృష్ణా రావు, పి.వి. నరసింహారావు వంటి వారితో కలిసి కాళోజీ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నాడు. విద్యార్థి దశలోనే నిజాం ప్రభుత్వ నిషేధాజ్ఞలను ఉల్లంఘించి వరంగల్లులో గణపతి ఉత్సవాలు నిర్వహించాడు. తెలంగాణలో అక్షరజ్యోతిని వ్యాపింప జేయాలన్న తపనతో ఆంధ్ర సారస్వత పరిషత్తును స్థాపించిన ప్రముఖుల్లో కాళోజీ ఒకడు. రజాకార్ల దౌర్జన్యాన్ని ప్రతిఘటిస్తూ 1945 లో పరిషత్తు ద్వితీయ మహా సభలను దిగ్విజయంగా నిర్వహించడంలో కాళోజీ ప్రదర్శించిన చొరవ, ధైర్య సాహసాలను ఆయన అభిమానులు ఇప్పటికీ గుర్తు చేసు కుంటారు. వరంగల్ కోటలో జాతీయ పతాకాన్ని ఆవిష్కరించడానికి ప్రయత్నించి నందుకు ఆయనకు నగర బహిష్కరణ శిక్ష విధించారు. స్వరాజ్య సమరంలో పాల్గొని ఉస్మానియా విశ్వవిద్యాలయం విద్యార్థులు బహిష్కరణకు గురైనప్పుడు, వారిని నాగపూర్ విశ్వ విద్యాలయంలో చేర్పించి ఆదుకోవడంలో కాళోజీ పాత్ర అనన్యం. 1953 లో తెలంగాణ రచయితల సంఘం ఉపాధ్యక్షుడుగా ఎన్నికయ్యాడు. 1958 లో ఉపాధ్యాయ నియోజకవర్గం నుంచి శాసన మండలి సభ్యునిగా ఎన్నికై, 1958 నుండి 60 వరకు పనిచేసారు. రెండేళ్లు ఏ పార్టీకి చెందని స్వతంత్ర సభ్యుడిగా ఉన్నాడు. ఆయన "ఆంధ్ర సారస్వత పరిషత్" వ్యవస్థాపక సభ్యుడు మరియు ఆంధ్ర ప్రదేశ్ సాహిత్య అకాడెమీలో సభ్యుడు. ఆయన తెలంగాణ రచయితల సంఘం అధ్యకునిగా, 195761 కాలంలో గ్లోసరీ కమిటీ సభ్యునిగా ఉన్నారు. 1977లో సత్తుపల్లి (ఖమ్మం జిల్లా) నుండి స్వతంత్ర అభ్యర్థిగా నాటి ముఖ్యమంత్రి జలగం వెంగళరావు పై పోటీ చేశాడు, కానీ ఓడి పోయాడు. కాకతీయ విశ్వ విద్యాలయం గౌరవ డాక్టరేట్ ప్రదానం చేయగా, భారత ప్రభుత్వం పద్మ విభూషణ్ అవార్డుతో సత్కరించింది. 'హింస తప్పు, రాజ్యహింస మరీ తప్పు' అంటూ "సామాన్యుడే నా దేవుడు" అని ప్రకటించిన కాళోజీ 2002 నవంబరు 13 న తుదిశ్వాస విడిచాడు. ఆయన మరణా నంతరం ఆయన పార్థివ శరీరాన్ని కాకతీయ మెడికల్ కళాశాలకు అంద జేసారు.1992లో పద్మ విభూషణ్ భారత రెండవ అత్యున్నత పురస్కారం;

1972 లో తామ్రపత్ర పురస్కారం;

1968లో "జీవన గీత" రచనకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంచే అనువాద పురస్కారం; బూర్గుల రామకృష్ణారావు మెమోరియల్ మొదటి పురస్కారం;ఆంధ్ర ప్రదేశ్ ప్రభుత్వం చే 1981లో సత్కారం; "ప్రజాకవి" బిరుదు; ఆంధ్ర ప్రదేశ్ లో అనేక సాహితీ సంఘాలచే సన్మానాలు; రామినేని ఫౌండేషన్ అవార్డు; గాడిచర్ల ఫౌండేషన్ అవార్డు; కాకతీయ విశ్వ విద్యాలయంవరంగల్ వారు 1992 లో డాక్టరేట్; 1996లో సహృదయ సాహితీ విశాఖ వారి గురజాడ అవార్డు; 1996లో కళసాగర్ మద్రాస్ వారి విశిష్ట పురస్కారం పొందారు. ఆయన మరాఠీ, ఇంగ్లీషు, ఉర్దూ భాషల్లో పండితుడు. ఎన్నో ఇతర భాషా గ్రంథాలను తెలుగులో అనువదించాడు. 1943 లోనే ఆయన కథల్ని "కాళోజీ కథలు" పేరుతో అప్పట్లో హైదరాబాదులో ఆంధ్ర పబ్లిషింగ్ కంపెనీకి చెందిన అణా గ్రంథమాల సంస్థ తన పద్నాలుగో ప్రచురణగా ప్రచురించింది. ఆంధ్ర జనసంఘం, ఆంధ్ర సారస్వత పరిషత్తు, ఆంధ్ర మహాసభ, తెలంగాణ రచయితల సంఘం సంస్థల నిర్మాణలలో కాళోజి భాగం ఉంది. పాములపర్తి నరసింహారావు లాంటి ఎందరికో ఆయన సాహిత్యంలో, రాజకీయాల్లో మార్గదర్శనం చేశాడు. విశాలాంధ్ర సమస్యలు గమనించి ఆయన 1969లో ప్రత్యేక తెలంగాణ ఉద్యమంలో కలిశాడు.

అన్ని సందర్భాలలో అసలుసిసలైన తెలంగాణ వాదిగా జీవించాడు. పర భాషా జ్ఞానాన్ని సంపాదించుకోవడం అవసరమే. కానీ, ఆ సాకుతో అమ్మ లాంటి మన భాషను నిర్లక్ష్యం చేయడం ఎంత తప్పు. నేటి తరం. తెలుగు పదాలనే మర్చిపోతోంది. ఈ పరిస్థితి పోవాలి. మన తేట తెలుగు భాషకు పూర్వ వైభవం రావాలి అని పరితపించాడు. తెలంగాణ పలుకుబడితో ప్రజల మాట, వ్యధలను ఆయన వ్యక్తం చేసిన తీరు అమోఘం. అందరికీ ఆదర్శ ప్రాయం. కాళోజీ జయంతి సెప్టెంబర్ 9 ని "తెలుగు మాండలిక భాషా దినోత్సవం" గా జరుపు కోవడం సమంజసం.



- రామకిష్టయ్య సంగనభట్ల
9440595494

# అధినేత,మై లార్డ్ ఏమిటి?

ఇదేమి జర్నలిజం? ఇదెక్కడి న్యాయవాదం? అధినేతలు, లార్డ్స్ ఎలాంటి సమాజాలు, వ్యవస్థల్లో ఉంటారు? రాచరికాలు,ఫ్యూడల్ (సామాజిక సంపద ఉత్పత్తిలో వీసమెత్తు పాత్ర కూడా లేకుండా ఆ సంపదపై సంపూర్ణ అదుపు అధికారం కలిగిన పూర్వపు భూస్వామ్య వ్యవస్థ)వ్యవస్థల్లో కదా. ప్రజలు తమ మంచి చెడ్డలను చూసుకునే ప్రతినిధులను తామే ఎన్నుకునే ఆధునిక రాజ్య వ్యవస్థలో అధినేత అనే సంబోధన ఏమిటి? ఈ సంబోధనలో బాంచన్ దొరా నీ కాల్మొక్తా అనే ధ్వని వినిపించడం లేదా? న్యాయస్థానాల్లో మై లార్డ్ సంబోధన ఏమిటి? ఎందుకీ ఈ లొంగుబాటు? ప్రాపకం కోసమా? ప్రాపకం పొంది ఏదో ప్రయోజనం ఆశించి ఇలా సంబోధిస్తున్నారా? ఇలాంటి సంబోధన ఇబ్బందికరంగా లేదా? ఆత్మగౌరవం గౌరవం దెబ్బ తినడం లేదా? ఎందుకు ఇలా సాగిలబాటు? ఆధునిక,నాగరిక ప్రజాస్వామ్య రాజ్య వ్యవస్థగా భావించే వ్యవస్థకు నాల్గవ స్తంభంగా పరిగణించే వ్యవస్థలో జర్నలిస్టులు నాయకులను ఎలా సంబోధించి ఏ సందేశం ఇస్తున్నారు? పచ్చి ఫ్యూడల్ వాసనలున్న ఈ సంబోధన పత్రికలు, న్యూస్ చానెళ్లలో తరచూ వినిపిస్తున్నాయేమిటి? అన్యాయాన్ని నిరూపించి నేరస్తులకు శిక్షలు వేయించే న్యాయవాదులు జడ్జిలను మై లార్డ్ అని సంబోధించడం ఏమిటి? ఎందుకు? ఆ పదాలకు సామాజిక ఆమోదం కల్పించే యత్నమా? వెనుకటి రాచరికాల్లో ఈ పదం ఘనంగా చెల్లుబాటయ్యేది.

కానీ ఇప్పుడు మనం ఉన్నది రాచరిక వ్యవస్థ కాదు కదా. రాజులు,చక్రవర్తులు, రాజ్యాలు,సామ్రాజ్యాలు ఎప్పుడో అంతరించి పోయాయి కదా.ఇలాంటి ఫ్యూడల్ పదాలకు విస్తృత ప్రచారం కల్పించడం ద్వారా మళ్ళీ రాచరిక వ్యవస్థ స్థాపన యత్నం, వ్యూహం దాగి ఉన్నదా ఏమిటి? ఇది ప్రజా పాలక రాజ్య వ్యవస్థ కదా. ఉదార రాజ్యం కదా. ఈ వ్యవస్థలో ఒకరు ఎక్కువ మరొకరు తక్కువ కాదు కదా. ప్రజలు తమ కోసం రాసుకొని అమలు చేసుకుంటున్న రాజ్యాంగంలో ఇలాంటి ఫ్యూడల్ పదాలకు చోటు లేదు కదా.ఇక్కడ అందరూ సమానులే కదా.

ఇలాంటి ప్రజాతంత్ర వ్యవస్థలో రాజులు, చక్రవర్తులు,అధినేతలు ఉండే అవకాశం ఎంతమాత్రం లేదు,ఉండే అవకాశం ఉండకూడదు కదా.అలాంటి అవకాశాలకు చోటు ఇవ్వకుండా జర్నలిజం,న్యాయ వ్యవస్థలు పని చేయాలి కదా. ప్రజాస్వామ్య వ్యవస్థ వాచ్ డాగ్(కాపలా కుక్క) నుంచి ఈ పిలుపులు, సంభోధనలు ఏమిటి? ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రి లాంటి పదవులు,రాజకీయ పార్టీల అధ్యక్షులు,చైర్మన్ లాంటి పదవుల్లో ఎవరు ఉండాలి? అనేది ప్రజల అభీష్టం,సమ్మతితో నిర్ణయించబడాలి కదా. అది కూడా ఎన్నికలు అనే ఆధునిక ప్రక్రియ ద్వారా కదా.ప్రజలు తమ అభీష్టం వ్యక్తం చేసిన వారే ఆయా గద్దెల్లో కూర్చోవాలి కదా.

అది కూడా ఒక నిర్ణీత కాలపరిమితి మేరకు మాత్రమే కదా. తరువాతి కాలంలో ఆ పదవిలోకి వేరొకరు వచ్చే తప్పనిసరి విధానాన్ని ప్రజలు అమలులోకి తెచ్చుకున్నారు కదా. ఆయా పదవుల్లోకి చేరుకున్న వ్యక్తులు ఈ రాజ్యాంగ వ్యవస్థకు తద్వారా ప్రజలకు సేవకులు మాత్రమే కదా. అది కూడా ఒక నిర్ణీత కాల వ్యవధికి మాత్రమే కదా.మరి ఇలాంటి వ్యవస్థలో ఇలాంటి బానిస వ్యవస్థలోని పిలుపులు, సంభోధనలు ఏమిటి?ఈ వ్యవస్థపై అవగాహన కలిగిన జర్నలిజం నుంచి ఇలాంటి సంబోధనలు ఏ మేరకు ఎలా సమంజసం? ప్రజాస్వామ్యంలోని విలువలు, హక్కులను వివరించడం ద్వారా ప్రజలను చైతన్యవంతులను చేయవలసిన జర్నలిజం వృత్తిలో ఈ సంబోధన ఎలా సమర్థనీయం? అలాంటి వ్యవస్థ ఈ అన్ని విషయాలపై పూర్తి అవగాహన కలిగి ఉండవలసిన జర్నలిజం వ్యవస్థకు ఈ జబ్బు ఏమిటి? పార్టీ అధ్యక్షులు ప్రధాన మంత్రి ముఖ్యమంత్రి లాంటి పదవుల్లోని వ్యక్తులను "అధినేతలు"గా సంబోధించడం సబబు కాదు కదా. రాచరికపు క్రూర ధ్వనిని వినిపించే, ఆధిపత్య భావన కనిపించే,ఫ్యూడల్ దుర్వాసనలు వెదజల్లే, ఈ పదాలు తెలుగు మీడియాలో తరచూ కనిపిస్తూ, వినిపిస్తూ ఉన్నాయి.ప్రజాస్వామ్యాన్ని కాపాడే నాల్గవ స్తంభంగా పిలవబడే జర్నలిజం వ్యవస్థ ఈ పదం వినియోగించడంలోని ఆంతర్యం ఏమిటి? అవగాహన లేమి అని అనుకోవాలా ? లొంగుబాటు అని భావించాలా? సదరు "అధినేతల" ప్రాపకం పొందే ప్రయత్నం అని భావించాలా ? రాజ్య వ్యవస్థల పదవుల్లో ఉన్న ఇలాంటి వ్యక్తుల ప్రాపకం పొందేందుకు, ప్రయోజనాలు పొందేందుకు, వ్యాపారులు, పైరవీకారులు, లాబీయిస్టులు ఇలాంటి పదం వాడి మెప్పు పొంది ప్రసన్నులను చేసుకునే ప్రయత్నాలు చేస్తూ ఉండవచ్చును.అలాంటి వారు అన్ని రకాల వ్యవస్థల్లో ఉంటారు. కానీ...జర్నలిజం అలా ఉండకూడదు,అలాంటి పనులను చేయకూడదు కదా.సదరు అధినేతల ఆశ్రితులుగా మారే ప్రయత్నంలో భాగంగా ఇలా సంభోదిస్తున్నారని అనుకోవాలా? ప్రధాన మంత్రి, ముఖ్యమంత్రులు లాంటి ఉన్నత పదవుల్లో ఉన్న వ్యక్తులు,రాజకీయ పార్టీల అధ్యక్షుల పేర్లను ప్రస్తావించే సందర్భాల్లో అధినేతలు అనే ఈ అభ్యంతరకరమైన పదాన్ని తెలుగు మీడియా తరచూ ప్రస్తావిస్తున్నది.



- గందె గోవర్ధన్,
ఫోన్ :
9347056621

## వ్యాసాలు, కవితలకు ఆహ్వానం

విశ్వంభర ఎడిటోరియల్ పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను, కవితలను ఆహ్వానిస్తున్నాం. ఈ కింది చిరునామాకు పోస్టులో లేదా ఈ-మెయిల్ ద్వారా పంపించగలరు. మీ వ్యాసం 1000 పదాలకు మించకుండా ఉండాలి. తెలుగు యునీకోడ్‌లో టైప్ చేసి పంపిన వాటికి ప్రాధాన్యం ఉంటుంది. రచయితలు విశ్వంభరకు మాత్రమే పంపుతున్నామని హామీపత్రం జత చేయాలి.

**చిరునామా:**

V3 న్యూస్, విశ్వంభర తెలుగు దినప్రతిక కార్యాలయం, ప్లాట్ నంబర్ 204, రెండో అంతస్తు, బాదం కాంప్లెక్స్, మెట్రో పిల్లర్ నంబర్ 1560 ఎదురుగా, చైతన్యపురి ఎక్స్ రోడ్డు, హైదరాబాద్500060

editpagevishwambhara@gmail.com

ఇతర వివరాలకు సెల్ నం: 9441222429 సంప్రదించగలరు.

# మావో నుంచి భారత కమ్యూనిస్టులు ఏమి నేర్చుకోవాలి?

చైనా విప్లవ నాయకుడు , ప్రపంచ శ్రామిక వర్గ విప్లవ నేత కామ్రేడ్ మావో జెడాంగ్ 1976 సెప్టెంబర్ 9న ఆయన మరణించినప్పటికీ, చైనా విప్లవ అనుభవాలు, మావో రచనలు, ఆయన నాయకత్వంలోని విజయాలు-పరాజయాలు నేటికీ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమానికి అధ్యయన అంశాలుగానే ఉన్నాయి. మావోను స్మరించడం అంటే ఆయన చెప్పిన ప్రతి మాటను ప్రశ్నించకుండా అంగీకరించడం కాదు. అదే విధంగా ఆయన కాలంలోని కొన్ని సమస్యలను ఆధారంగా చేసుకొని ఆయన మొత్తం చారిత్రక పాత్రను కొట్టిపారేయడం కూడా సరైంది కాదు. మార్క్సిజం వ్యక్తిపూజను కోరదు. చారిత్రక వ్యక్తుల పాత్రను వారి కాలంలోని నిర్దిష్ట సామాజిక, ఆర్థిక, రాజకీయ పరిస్థితుల్లో అంచనా వేయాలని కోరుతుంది.

**చైనా నిర్దిష్ట పరిస్థితులు**

మావో రాజకీయంగా ఎదిగిన కాలంలోని చైనా తీవ్రమైన సామాజిక, ఆర్థిక, రాజకీయ సంక్షోభంలో ఉన్న దేశం. దీర్ఘకాలిక భూస్వామ్య సంబంధాలు, సామ్రాజ్యవాద జోక్యం, విదేశీ శక్తుల ప్రత్యేక హక్కులు, రాజకీయ విభజనలు, వెనుకబడిన ఉత్పత్తి సంబంధాలు, విస్తారమైన రైతాంగ జనాభా చైనా సమాజపు ప్రధాన లక్షణాలు. జపాన్ దురాక్రమణ చైనా జాతీయ స్వాతంత్ర్య సమస్యను మరింత తీవ్రతరం చేసింది. మరోవైపు బ్రిటన్, అమెరికా, ఫ్రాన్స్ తదితర సామ్రాజ్యవాద శక్తులు చైనాలో ఆర్థిక, రాజకీయ ప్రభావాన్ని కొనసాగించాయి. ఈ పరిస్థితుల నేపథ్యంలో చైనా సమాజాన్ని మావో అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజంగా విశ్లేషించాడు. చైనా పరిస్థితులను రష్యా పరిస్థితులతో యాంత్రికంగా సమానం చేయడం వల్ల చైనా కమ్యూనిస్టు ఉద్యమం ప్రారంభ దశలో తీవ్రమైన నష్టాలను ఎదుర్కొంది. పట్టణ కేంద్రంగా తిరుగుబాట్లు, అతివాద ఎత్తుగడలు, నిర్దిష్ట పరిస్థితులకు సరిపోని వ్యూహాలు ఉద్యమాన్ని తీవ్రంగా దెబ్బతీశాయి. వేలాది కమ్యూనిస్టు కార్యకర్తలు, ప్రజలు హత్యకు గురయ్యారు. ఈ అనుభవాల నుంచి పాఠాలు తీసుకోవడం మావో రాజకీయ జీవితంలో ఒక ముఖ్యమైన మలుపు.

**నూతన ప్రజాస్వామిక విప్లవం — దీర్ఘకాలిక ప్రజాయుద్ధం**

చైనా పరిస్థితులను అధ్యయనం చేసిన మావో, మార్క్సిజాన్ని చైనా నిర్దిష్ట పరిస్థితులకు అన్వయించడానికి ప్రయత్నించాడు. నూతన ప్రజాస్వామిక విప్లవం, అర్ధవలస-అర్ధభూస్వామ్య సమాజ విశ్లేషణ, దీర్ఘకాలిక ప్రజాయుద్ధం, రైతాంగాన్ని విప్లవోద్యమంలో ప్రధాన సామాజిక శక్తిగా సమీకరించడం వంటి అంశాలపై ఆయన విస్తృతంగా రచనలు చేశాడు. పట్టణ కార్మికవర్గం నాయకత్వాన్ని తిరస్కరించకుండా, చైనా వంటి విస్తారమైన రైతాంగ దేశంలో విప్లవోద్యమం ఎలా నిర్మించాలి అనే ప్రశ్నకు ఆయన ఆచరణలో సమాధానం వెతికాడు. గ్రామీణ ప్రాంతాల్లో ఆధార ప్రాంతాల నిర్మాణం, గెరిల్లా పోరాటం, ప్రజలతో సంబంధాలు, రాజకీయ-సైనిక పోరాటాల సమన్వయం వంటి అంశాలకు ప్రాధాన్యత ఇచ్చాడు. ఈ విధానం చైనా విప్లవానికి ప్రత్యేకమైన వ్యూహాత్మక రూపాన్ని ఇచ్చింది. దీర్ఘకాలిక ప్రజాయుద్ధం ద్వారా 1949 అక్టోబర్‌లో చైనా నూతన ప్రజాస్వామిక విప్లవం విజయవంతమైంది.

**విప్లవ విజయం — ఒక వ్యక్తి కృషి కాదు**

చైనా విప్లవ విజయాన్ని మావో నాయకత్వం లేకుండా అర్థం చేసుకోవడం సాధ్యం కాదు. అయితే ఆ విజయాన్ని మావో ఒక్కరి ప్రతిభకు మాత్రమే ఆపాదించడం కూడా మార్క్సిస్టు చారిత్రక దృష్టి కాదు. చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం, ప్రాంతీయ పార్టీ నాయకత్వాలు, వేలాది మంది కేడర్, ప్రజా సైనికులు, రైతులు, కార్మికులు, ప్రజా సంఘాల కార్యకర్తలు, సాధారణ ప్రజలు——వీరి దీర్ఘకాలిక త్యాగం, పోరాటం, కృషి చైనా విప్లవ విజయానికి పునాది. మావో ఈ విస్తృత ప్రజా పోరాటానికి ప్రధాన నాయకుడిగా, వ్యూహకర్తగా, సైద్ధాంతిక మార్గదర్శకుడిగా కీలక పాత్ర పోషించాడు. నాయకుడు చరిత్రకు వెలుపల నిలబడి చరిత్రను సృష్టించడు. ఒక నాయకుడి పాత్ర ఎంత ముఖ్యమైనదైనా, అది ఒక పార్టీ, కేడర్, ప్రజా ఉద్యమం, సామాజిక పరిస్థితులతో ముడిపడి ఉంటుంది. అందువల్ల మావో పాత్రను తగ్గించడం ఎంత తప్పో, చైనా విప్లవ విజయాన్ని మావో వ్యక్తిగత ప్రతిభకు మాత్రమే ఆపాదించడం కూడా అంతే తప్పు.

**మావో రచనల ప్రాధాన్యత**

మావో రచనలను మొత్తం ఒకే కోణంలో చూడటం సరైంది కాదు. ఆయన రచనల్లో ఒకవైపు మార్క్సిజాన్ని వివరించి, అభివృద్ధి చేసి, ప్రపంచంలోని కమ్యూనిస్టు పార్టీలు అధ్యయనం చేసి నేర్చుకోవలసిన సైద్ధాంతిక, రాజకీయ అంశాలు ఉన్నాయి. మరోవైపు చైనా విప్లవం ఎదుర్కొన్న ప్రత్యేక పరిస్థితులు, అక్కడి వర్గ సంబంధాలు, సాయుధ పోరాట పద్ధతులు, గ్రామీణ ఆధార ప్రాంతాల నిర్మాణం వంటి చైనా నిర్దిష్ట పరిస్థితులకు సంబంధించిన అంశాలు ఉన్నాయి. ఈ రెండింటి మధ్య తేడాను గుర్తించడం చాలా ముఖ్యం. మావో రచనల్లోని సాధారణ మార్క్సిస్టు అవగాహనలను, పద్ధతులను ప్రపంచంలోని వివిధ దేశాల కమ్యూనిస్టు ఉద్యమాలు అధ్యయనం చేయవచ్చు. కానీ చైనా నిర్దిష్ట పరిస్థితుల్లో రూపొందిన ప్రతి వ్యూహాన్ని ఇతర దేశాలకు యాంత్రికంగా వర్తింపజేయడం మార్క్సిస్టు పద్ధతి కాదు. మావో రచనలు తత్వశాస్త్రం, వర్గపోరాటం, రైతాంగ సమస్య, పార్టీ నిర్మాణం, ప్రజా పంథా, గెరిల్లా యుద్ధం, విప్లవ వ్యూహం, సోషలిస్టు నిర్మాణం, సామ్రాజ్యవాదం, సాంస్కృతిక రంగం వంటి అనేక అంశాలను స్పృశిస్తాయి. "ఆచరణపై", "వైరుధ్యాలపై", "ప్రజల మధ్య వైరుధ్యాలను సరిగా పరిష్కరించుకోవడం గురించి", "నూతన ప్రజాస్వామ్యం గురించి", "దీర్ఘకాలిక ప్రజాయుద్ధం గురించి" వంటి రచనలు ముఖ్యమైనవి. వాటిలో ఎక్కువ భాగం తెలుగులో "మావో రచనలు" పేరుతో పది సంపుటాలుగా అందుబాటులో ఉన్నాయి.

**క్రుష్చేవ్ శాంతియుత సిద్ధాంతాలపై సైద్ధాంతిక పోరాటం**

స్టాలిన్ అనంతరం సోవియట్ నాయకత్వంలో క్రుష్చేవ్ ప్రతిపాదించిన "శాంతియుత పరివర్తన, శాంతియుత సహజీవనం, శాంతియుత పోటీ" వంటి సిద్ధాంతాలు ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో తీవ్రమైన సైద్ధాంతిక చర్చకు దారితీశాయి. ఈ నేపథ్యంలో చైనా కమ్యూనిస్టు పార్టీ, సోవియట్ కమ్యూనిస్టు పార్టీ మధ్య విభేదాలు తీవ్రమవుతున్నప్పటికీ, ఈ చర్చ ఆ రెండు పార్టీలకే పరిమితం కాలేదు. ప్రపంచంలోని అనేక కమ్యూనిస్టు, కార్మిక పార్టీలలో కూడా ఈ ప్రశ్నలపై చర్చలు, అభిప్రాయ భేదాలు, రాజకీయ వైఖరి నిర్ణయాలు చోటుచేసుకున్నాయి. 1957, 1960 మాస్కో సమావేశాలు ఈ అంతర్జాతీయ చర్చకు ముఖ్యమైన వేదికలుగా నిలిచాయి. ఈ చర్చలో మావో నాయకత్వంలోని చైనా కమ్యూనిస్టు పార్టీ కేంద్ర నాయకత్వం, దాని సైద్ధాంతిక-రాజకీయ నాయకత్వం కీలక పాత్ర పోషించింది. అదే సమయంలో ప్రపంచంలోని వివిధ కమ్యూనిస్టు పార్టీల నాయకత్వాలు, కార్యకర్తలు కూడా తమ తమ అనుభవాల ఆధారంగా ఈ చర్చలో పాల్గొన్నారు. అందువల్ల గ్రేట్ డిబేట్‌ను ఒక్క మావో వ్యక్తిగత పోరాటంగా కాకుండా, ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమంలో జరిగిన విస్తృత సైద్ధాంతిక చర్చగా చూడాలి. సామ్రాజ్యవాదంతో సంబంధాలు, వర్గపోరాటం, సోషలిస్టు నిర్మాణం, పార్టీ స్వభావం వంటి ప్రశ్నలపై జరిగిన ఈ చర్చ ప్రపంచ కమ్యూనిస్టు ఉద్యమం ముందుకు అనేక ముఖ్యమైన ప్రశ్నలను తెచ్చింది.

**మావో నాయకత్వం — నిర్మాణం, విజయాలు, సమస్యలు**

1935 జున్యి సమావేశం తర్వాత మావో చైనా కమ్యూనిస్టు పార్టీ నాయకత్వంలో ప్రధాన స్థానాన్ని పొందాడు. 1943 నుంచి మరణించే వరకు చైనా కమ్యూనిస్టు పార్టీ చైర్మన్‌గా కొనసాగాడు. పార్టీ, ప్రజా సైన్యం, ప్రజా సంఘాలు, ప్రభుత్వం వంటి వివిధ రంగాల్లో కీలక నాయకత్వ బాధ్యతలు నిర్వహించాడు. 1949 విప్లవ విజయం తర్వాత అత్యంత వెనుకబడిన ఆర్థిక పరిస్థితి నుంచి దేశాన్ని పునర్నిర్మించడం, పారిశ్రామికీకరణ, వ్యవసాయ మార్పులు, విద్య, ఆరోగ్యం, ప్రజల జీవన పరిస్థితుల మెరుగుదల, సామాజిక నిర్మాణంలో మార్పులు వంటి అనేక క్లిష్టమైన సమస్యలను కొత్త చైనా ఎదుర్కొంది. మావో నాయకత్వంలో చైనా తన కాళ్లపై తాను నిలబడే స్వతంత్ర దేశంగా, సోషలిస్టు నిర్మాణ దిశగా ముందుకు సాగడానికి ప్రయత్నించింది. ఈ ప్రయాణంలో అనేక ముఖ్యమైన విజయాలు సాధించడంతో పాటు, కొన్ని తీవ్రమైన సమస్యలు, విధాన పరమైన లోపాలు కూడా ఎదురయ్యాయి. గ్రేట్ లీప్ ఫార్వర్డ్ కాలంలోని సమస్యలు, ఆహార సంక్షోభం, సాంస్కృతిక విప్లవ కాలంలోని పరిణామాలు వంటి అంశాలు కూడా ఈ అనుభవంలో భాగమే. వాటిని ఈ సందర్భంగా విస్తృతంగా చర్చించడం ఈ వ్యాస పరిధిలో సాధ్యం కాదు. అయితే వాటి నుంచి ఒక ముఖ్యమైన పాఠాన్ని మాత్రం గుర్తించాలి. విజయాలకు నాయకత్వం ఎంత బాధ్యత వహిస్తుందో, విధానపరమైన తప్పిదాలకు కూడా నాయకత్వం బాధ్యత వహించాల్సిందే. అయితే ఒక దేశం సాధించిన ప్రతి విజయం ఒక్క నాయకుడి వల్లనూ, ప్రతి పరాజయం ఒక్క నాయకుడి వల్లనూ సంభవించదు. కేంద్ర నాయకత్వం, వివిధ స్థాయిల పార్టీ నాయకత్వాలు, కేడర్, ప్రజలు, ఆ కాలంలోని సామాజిక-ఆర్థిక పరిస్థితులు, అంతర్గత-అంతర్జాతీయ పరిణామాలు——ఇవన్నీ కలిపే చారిత్రక ఫలితాలను నిర్ణయిస్తాయి. అందువల్ల మావో నాయకత్వాన్ని అంచనా వేయడంలో కూడా వ్యక్తిగత కీర్తి లేదా వ్యక్తిగత నింద అనే రెండు అంచులను దాటి సామూహిక నాయకత్వం, చారిత్రక పరిస్థితులు, విధాన నిర్ణయాలు, వాటి ఫలితాలు అనే ప్రమాణాలతో పరిశీలించాలి.

**భారతదేశానికి చైనా విప్లవ మార్గం వర్తిస్తుందా?**

చైనా విప్లవం అనుసరించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గం చైనా నిర్దిష్ట చారిత్రక పరిస్థితుల నుంచి ఉద్భవించింది. అర్ధవలస-అర్ధభూస్వామ్య సామాజిక నిర్మాణం, విస్తారమైన రైతాంగ జనాభా, భూస్వామ్య సంబంధాలు, సామ్రాజ్యవాద దురాక్రమణ, దేశంలోని రాజకీయ-సైనిక పరిస్థితులు ఆ మార్గం రూపుదిద్దుకోవడంలో కీలక పాత్ర పోషించాయి. అందువల్ల చైనా విప్లవ విజయాన్ని చూసి అదే మార్గాన్ని భారతదేశానికి యాంత్రికంగా అన్వయించడం సరైంది కాదు. భారతదేశం నేటి పరిస్థితులు చైనా నాటి పరిస్థితులతో సమానం కాదు. స్వాతంత్ర్యం తర్వాత భారతదేశంలో పెట్టుబడిదారీ అభివృద్ధి విస్తరించింది. నేటి భారత సమాజంలోని వర్గ సంబంధాలు, ఉత్పత్తి సంబంధాలు, రాజ్య నిర్మాణం, రాజకీయ వ్యవస్థ, కుల సామాజిక నిర్మాణం వంటి అంశాలను నిర్దిష్టంగా అధ్యయనం చేయాల్సి ఉంటుంది. కాబట్టి భారతదేశంలో రాజకీయ వ్యూహాన్ని నిర్ణయించేటప్పుడు చైనా అనుభవాన్ని ఒక ముఖ్యమైన చారిత్రక రిఫరెన్స్‌గా అధ్యయనం చేయవచ్చు. కానీ నేటి పెట్టుబడిదారీ భారతదేశ పరిస్థితుల్లో చైనా కాలంలో అనుసరించిన దీర్ఘకాలిక ప్రజాయుద్ధ మార్గాన్ని యాంత్రికంగా స్వీకరించడం భారతదేశ నిర్దిష్ట వాస్తవికతకు సరిపోదు. ఇదే మావో నుంచి నేర్చుకోవాల్సిన అసలు పాఠానికి కూడా అనుగుణంగా ఉంటుంది. మావో చైనా పరిస్థితులకు రష్యా అనుభవాన్ని యాంత్రికంగా అన్వయించకుండా చైనా వాస్తవికతను అధ్యయనం చేశాడు. చైనా మార్గాన్ని కాపీ చేయడం కాదు.చైనా తన పరిస్థితులను ఎలా అధ్యయనం చేసి, తన మార్గాన్ని ఎలా రూపొందించుకుందో అధ్యయనం చేయాలి.

**భారత కమ్యూనిస్టులకు మావో అనుభవం ఇచ్చే పాఠం**

భారతదేశంలో కమ్యూనిస్టు ఉద్యమానికి వంద సంవత్సరాల చరిత్ర ఉంది. ఈ కాలంలో అనేక కమ్యూనిస్టు పార్టీలు, వివిధ వామపక్ష ధోరణులు, నక్సలైట్-మావోయిస్టు ఉద్యమాలు తమ తమ మార్గాల్లో ప్రజా పోరాటాలను నిర్మించాయి. అనేక త్యాగాలు, పోరాటాలు, ప్రజా ఉద్యమాలు కూడా జరిగాయి. అయితే ఇంత సుదీర్ఘ అనుభవం ఉన్నప్పటికీ, భారతదేశ నిర్దిష్ట పరిస్థితులకు తగిన రాజకీయ వ్యూహం, మార్గాన్ని నిర్ణయించే విషయంలో భారత కమ్యూనిస్టు ఉద్యమం ఇప్పటికీ అనేక సమస్యలను ఎదుర్కొంటున్నది అనే వాస్తవాన్ని కూడా నిష్పక్షపాతంగా పరిశీలించాల్సి ఉంది. చైనా కమ్యూనిస్టు పార్టీ అనుభవం మనకు ఒక ముఖ్యమైన పాఠాన్ని ఇస్తుంది. మార్క్సిజాన్ని సంప్రదాయవాదంగా, పిడివాదంగా, యాంత్రికంగా స్వీకరించడం ద్వారా విప్లవ మార్గాన్ని కనుగొనలేం. మార్క్సిజాన్ని జీవించి ఉన్న సమాజాన్ని అర్థం చేసుకునే శాస్త్రీయ పద్ధతిగా స్వీకరించాలి. మావోను అనుసరించడమంటే చైనా మార్గాన్ని అనుసరించడం కాదు. చైనా పరిస్థితులను మావో ఎలా అధ్యయనం చేశాడో, తప్పుల నుంచి ఎలా నేర్చుకున్నాడో, మార్క్సిజాన్ని తన దేశ నిర్దిష్ట పరిస్థితులకు ఎలా అన్వయించాడో నేర్చుకోవడం. మావోను స్మరించడంలో మనకు ముఖ్యమైన పాఠం మాత్రం స్పష్టంగా ఉంది. విజయాల నుంచి నేర్చుకోవాలి. పరాజయాల నుంచి కూడా నేర్చుకోవాలి. ఇతరుల అనుభవాలను రిఫరెన్స్‌గా తీసుకోవాలి. గుడ్డిగా అనుకరించకూడదు. మార్క్సిజమే ప్రపంచంలోని అన్ని దేశాలకు మార్గదర్శకం. కానీ మార్క్సిజం సజీవంగా ఉండేది నిర్దిష్ట పరిస్థితులకు నిర్దిష్టంగా అన్వయించినప్పుడే. కామ్రేడ్ మావో చైనా విప్లవ అనుభవం మనకు అందించే ప్రధాన పాఠం ఇదే.



- జంపన్న
డెమొక్రటిక్ సోషలిస్ట్

# దళిత వ్యతిరేక పార్టీ బీఆర్ఎస్

**స్పీకర్ గడ్డం ప్రసాద్‌పై అనుచిత వ్యాఖ్యలను ఖండించిన డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య**



**విశ్వంభర, సూర్యాపేట:** దళితుల పట్ల బీఆర్ఎస్ పార్టీకి ఎప్పుడూ చిన్నచూపేనని డీసీసీ అధ్యక్షుడు గుడిపాటి నరసయ్య ఆరోపించారు. మంగళవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేసీఆర్‌కు దళితులంటే చిన్నచూపు అని ఆరోపించారు. బిఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వస్తే దళితుడిని ముఖ్యమంత్రిని చేస్తానని హామీ ఇచ్చి, తానే ముఖ్యమంత్రి అయ్యారని విమర్శించారు. దళితులకు మూడు ఎకరాల భూమి ఇస్తామని హామీ ఇచ్చి, ఇప్పటివరకు ఒక్క దళిత కుటుంబానికీ హామీ మేరకు భూమి ఇవ్వలేదని అన్నారు. దళితబంధు పథకం పేరుతో భారీగా అవినీతి జరిగిందని ఆరోపిస్తూ, అర్హులైన దళితులకు న్యాయంగా రూ.10 లక్షల సాయం అందలేదని విమర్శించారు. కేసీఆర్ ఎమ్మెల్యేగా ఉన్నప్పటి నుంచి ఇప్పటివరకు ప్రజాధనాన్ని తీసుకుంటున్నారని, ఆ మొత్తాన్ని వెంటనే తిరిగి చెల్లించాలని డిమాండ్ చేశారు. దళిత సామాజిక వర్గానికి చెందిన స్పీకర్ గడ్డం ప్రసాద్‌ను అవమానించడం అంటే యావత్ దళిత సమాజాన్ని అవమానించినట్లేనని అన్నారు. నేను దళితుడి అయిన నన్ను డీసీసీ అధ్యక్షుడిగా నియమించిన ఘనత కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని పేర్కొన్నారు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీష్ రెడ్డి స్పృహ తప్పినట్టుగా వ్యవహరించారని విమర్శించారు. కాళేశ్వరం ప్రాజెక్టు పేరుతో కోట్లాది రూపాయలు దోచుకున్నారని ఆరోపించారు. ఒకప్పుడు సాధారణ స్థితిలో ఉన్న జగదీష్ రెడ్డి నేడు వేల కోట్ల రూపాయల ఆస్తులు ఎలా సంపాదించారని ప్రశ్నించారు. కుల, మతాలకు అతీతంగా నాలుగు లక్షల ఇందిరమ్మ ఇళ్లను అందించిన ఘనత కాంగ్రెస్ ప్రభుత్వానికే దక్కుతుందని అన్నారు. గోదావరి జలాలను తీసుకువచ్చిన ఘనత దివంగత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డికే దక్కుతుందని, అయితే ఆ ఘనతను బీఆర్ఎస్ ప్రభుత్వం తమదిగా చెప్పుకుంటోందని విమర్శించారు. కేసీఆర్ అసెంబ్లీకి హాజరై అన్ని అంశాలపై చర్చించాలని, ఎమ్మెల్యే పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు వెలుగు వెంకన్న, మున్సిపల్ వైస్ చైర్మన్ షఫీ ఉల్లా, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కుమ్మరికుంట్ల వేణుగోపాల్, మండల పార్టీ అధ్యక్షుడు వీరన్న నాయక్, సేవాదళ్ జిల్లా అధ్యక్షుడు ఆలేటి మాణిక్యం, కౌన్సిలర్లు కొండపల్లి దిలీప్ రెడ్డి, నాగుల వాసు, చెంచాల మణిలత శ్రీనివాస్, జ్యోతి కరుణాకర్, చినుముల సునీల్ రెడ్డి, సంద్రపాటి విజయ్ కుమార్, కుంభం రాజేందర్, కొనతం రాజేష్ రెడ్డి, శేఖర్ రెడ్డి, కోడి నాగరాజు, బానోతు సైదులు, కాంగ్రెస్ నాయకులు రెబల్ శీను, గడ్డం వెంకన్న, రుద్రంగి రవి, సాజీదు (నీడ్స్), డీఆర్ తదితరులు పాల్గొన్నారు.



## ఘనంగా బంగారు మైసమ్మ బోనాల జాతర

**విశ్వంభర, హైదరాబాద్ :** తెలంగాణ ఎన్జీవోస్ సంఘం హైదరాబాద్ జిల్లా అసోసియేషన్ అధ్యక్షులు, టీఎన్జీవోస్ పాఠశాల విద్యాశాఖ హైదరాబాద్ సెంట్రల్ ఫోరం అధ్యక్షులు కె.ఆర్. రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.డి. షఫ్రుద్దీన్ ఆధ్వర్యంలో బంగారు మైసమ్మ తల్లి బోనాల జాతరను భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉద్యోగులు, అధికారులు, సిబ్బంది, వారి కుటుంబ సభ్యులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమానికి తెలంగాణ ఎన్జీవోస్ సంఘం కేంద్ర సంఘం ప్రధాన కార్యదర్శి డా. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్, కేంద్ర సంఘం సహాయ అధ్యక్షులు సత్యనారాయణ గౌడ్, కస్తూరి వెంకటేశ్వర్లు, టీఎన్జీవోస్ హైదరాబాద్ జిల్లా కార్యదర్శి కె. శ్రీనివాస్, ఉపాధ్యక్షులు కాలిబ్, శంకర్, పబ్లిసిటీ సెక్రెటరీ వైదిక్ శాస్త్ర, పి ఆర్ ఓ జహంగీర్, ఏపీఆర్ఓ మహీద్, రామకృష్ణ, మహమ్మద్, టీజీఏసీ సిటీ చైర్మన్ శ్రీకాంత్, టీజీఏసీ T కన్వీనర్ ఎం.బి. కృష్ణ యాదవ్, టీఎన్జీవోస్ సెంట్రల్ యూనియన్ వైస్ ప్రెసిడెంట్ కొండల్ రెడ్డి, చంద తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డా. ఎస్.ఎం. హుస్సేని ముజీబ్ మాట్లాడుతూ, బోనాల పండుగ తెలంగాణ ప్రజల ఆత్మీయతకు, సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలుస్తుందని అన్నారు. తరతరాలుగా కొనసాగుతున్న తెలంగాణ సంప్రదాయాలను పరిరక్షించడంతో పాటు వాటి విశిష్టతను భావితరాలకు అందించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పేర్కొన్నారు.

## ఈ నెల 10 లోపు పంట నమోదు చేసుకోవాలి

**- ఏఎంసీ డైరెక్టర్ కొట్టం రాము**



**విశ్వంభర, ఇనుగుర్తి :** మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలోని సన్న వరి సాగు చేపట్టిన రైతులు సెప్టెంబర్ 10లోగా పంట నమోదు చేసుకొని ప్రభుత్వం అందిస్తున్న క్వింటాల్‌కు రూ.500 బోనస్‌ను సద్వినియోగం చేసుకోవాలని కేసముద్రం మార్కెట్ యార్డ్ కమిటీ ఇనుగుర్తి డైరెక్టర్ కొట్టం రాము రైతులకు సూచించారు. ఈ మేరకు ఆయన ఇనుగుర్తిలో మాట్లాడుతూ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆధ్వర్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ఆర్ఎన్ఆర్ 15048 (తెలంగాణ సోనా), బిపిటి 5204 (సాంబా మసూరి), కేఎన్ఎం 1638, హెచ్ఎంటి సోనా, జై శ్రీరామ్, డబ్ల్యూజిఎల్ 44, కేఎన్ఎం 7715 రకాల సన్న వరి సాగు చేసిన రైతులు సంబంధిత బోనస్ పొందవచ్చు అన్నారు. ఈ నెల 10లోపు పంట నమోదు చేసుకుంటేనే బోనస్‌కు అర్హులవుతారు. డీలర్ వద్ద విత్తనాలు కొనుగోలు చేసిన రైతులు సంబంధిత డీలర్ వద్ద, సొంత లేదా ఇతర రైతుల నుంచి విత్తనాలు తీసుకున్న రైతులు తమ గ్రామ ఏఈఓ వద్ద నమోదు చేసుకోవాలని సూచించారు.

## ప్రభుత్వ భూములకూ నష్టపరిహారం పొందారంటూ భూనిర్వాసితుడి ఆరోపణలు

**విశ్వంభర, అక్కన్నపేట :** గౌరవెల్లి ప్రాజెక్టు భూసేకరణలో ప్రభుత్వ భూములను వ్యక్తిగత భూములుగా చూపించి నష్టపరిహారం పొందిన వ్యవహారంపై సమగ్ర విచారణ చేపట్టాలని గుడాటిపల్లి గ్రామానికి చెందిన సంపత్ కుమార్ అనే భూనిర్వాసితుడు విలేకర్ల సమావేశంలో ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ ప్రజావాణిలో, ఆర్డీవో, తహసీల్దార్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ప్రాజెక్టు నిర్మాణంలో తన రెండెకరాల ఐదు గుంటల భూమి కోల్పోయానని, మరో 100 ఎకరాల ప్రభుత్వ భూమిని 15 నుండి 20 ఏళ్లుగా సాగు చేసుకుంటున్నానని, అయితే ప్రాజెక్టు పనులతో సంబంధం ఉన్న సుంకరి ప్రదీప్ అలియాస్ చిరంజీవి, వారి కుటుంబ సభ్యులు ప్రభుత్వ భూములను పేర్లపై నమోదు చేయించి పరిహారం పొందారని ఆరోపించారు. సర్వే నంబర్ 480లో 22 గుంటలకు రూ.3,82,250, సుంకరి రవి పేరిట 6 గుంటలకు రూ.1,04,250, సుంకరి సమ్మయ్య పేరిట 6 గుంటలకు రూ.1,04,250 నష్టపరిహారం చెల్లించినట్లు పేర్కొన్నారు. అలాగే ప్రభుత్వ భూమిగా పేర్కొంటున్న సర్వే నంబర్ 491లో సుంకరి రాధ పేరిట 22 గుంటలకు రూ.3,82,250, సుంకరి బాలమ్మ పేరిట 21 గుంటలకు రూ.3,64,875, సుంకరి విజయ పేరిట 20 గుంటలకు రూ.3,47,500తో పాటు మరో 5 గుంటలకు రూ.86,875, బాలమ్మ పేరిట మరో 5 గుంటలకు రూ.86,875 నష్టపరిహారం చెల్లించినట్లు ఆరోపించారు. ఈ భూములను జేసీబీలతో చదును చేసి పామాయిల్ తోటలు ఏర్పాటు చేయడంతో పాటు డ్రిప్ సేద్యం, విద్యుత్ కనెక్షన్లు పొందారని తెలిపారు. దీనికి సంబంధించిన ఫోటోలు, వీడియోలు తన వద్ద ఉన్నాయని పేర్కొన్నారు. అక్రమాలపై ప్రశ్నించినందుకు తనపై తప్పుడు కేసులు నమోదు చేసి బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత సర్వే నంబర్లపై వెంటనే రీసర్వే నిర్వహించి వాస్తవాలను వెలికితీయాలని, అక్రమంగా పొందిన నష్టపరిహారాన్ని రికవరీ చేసి బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ప్రభుత్వ భూములను స్వాధీనం చేసుకుని అర్హులైన భూమిలేని పేద కుటుంబాలకు పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

## వానల కోసం వరద పాశం..

**గోవర్ధనగిరిలో ఏళ్లుగా కొనసాగుతున్న వరద పాశం**



**విశ్వంభర , అక్కన్నపేట :** వర్షాలు సమృద్ధిగా కురిసి పంటలు పండాలని, రైతుల కష్టాలు తొలగి గ్రామంలో సుఖసంతోషాలు వెల్లివిరియాలని కోరుతూ అక్కన్నపేట మండలం గోవర్ధనగిరి సంజీవరాయిని గుట్టపై గ్రామస్థులు వరద పాశం పూజ నిర్వహించారు. ఈ పూజను గ్రామానికి చెందిన యాదవ, కురుమ కులస్తులు కలిసి సంప్రదాయబద్ధంగా నిర్వహించగా, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని బతుకమ్మ ఆడుతూ ప్రకృతి దేవతను ప్రార్థించారు. గత కొన్ని ఏళ్లుగా ఏటా యాదవ, కురుమ కులస్తులు గుట్టపైకి చేరుకుని బియ్యం, పాలతో నైవేద్యం వండి ఆంజనేయస్వామికి సమర్పిస్తున్నట్లు గ్రామస్థులు తెలిపారు. అనంతరం నైవేద్యంలో కొంత భాగాన్ని పిల్లలకు పెట్టి, గుండంలోని నీటిని తీసుకెళ్లి పంట పొలాలు, పశువులపై చల్లితే మంచి జరుగుతుందని విశ్వసిస్తామని పేర్కొన్నారు. ఈ ఆచారం ద్వారా వర్షాలు సమృద్ధిగా కురిసి చెరువులు, కుంటలు నిండి పంటలు బాగా పండాలని కోరుకున్నారు. ఈ తారకరంలో గ్రామస్తులు, ఇది సంఘాల కుల పెద్దలు, మహిళలు, చిన్నారులు తదితరులు పాల్గొన్నారు.

## మహంకాళి ఆలయ హుండీ లెక్కింపు

**విశ్వంభర, ముషీరాబాద్ :** హైదరాబాదు ముషీరాబాద్‌లోని మహంకాళి దేవాలయ హుండీ లెక్కింపులో రూ.98 వేల ఆదాయం లభించినట్లు దేవాదాయ శాఖ అధికారులు తెలిపారు. మంగళవారం ఇన్‌స్పెక్టర్ ఆండాలు, ఈవో మహేందర్‌కుమార్ పర్యవేక్షణలో హుండీని లెక్కించారు. అనంతరం అమ్మవారి ఒడిబియ్యంతో అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన అర్చకులు వై.చంద్రమౌళి, పట్నం నాగభూషణంగౌడ్, బాలరాజుయాదవ్, జెనిగె శ్రీనివాస్‌యాదవ్ తదితరులు పాల్గొన్నారు.



## సెప్టెంబర్ 10న మహా ధర్నాకు భారీగా తరలిరావాలి

**○ ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి**



**విశ్వంభర ,అక్కన్నపేట :** ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారం కోసం రెండు జేఏసీలు ఐక్యంగా ఉద్యమానికి సిద్ధమయ్యాయని రిటైర్డ్ ఒకేషనల్ టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. తెలంగాణ ఉద్యమ స్ఫూర్తితో ఉద్యోగ, ఉపాధ్యాయుల హక్కుల సాధనకు ఐక్య పోరాటమే మార్గమని జేఏసీ నాయకులు మారం జగదీశ్వర్, దామోదర్ రెడ్డి, లచ్చి రెడ్డి పిలుపునిచ్చారని పేర్కొన్నారు. సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించనున్న మహా ధర్నాను విజయవంతం చేసేందుకు ఉద్యోగ, ఉపాధ్యాయులు కుటుంబ సభ్యులతో కలిసి భారీ సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇంతకాలం జేఏసీల వైఖరిపై అసంతృప్తితో ఉన్న కింది స్థాయి ఉద్యోగ, ఉపాధ్యాయుల అభిప్రాయాలను గౌరవిస్తూ సమస్యల పరిష్కారం కోసం అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ జేఏసీల నాయకులు ఒకే వేదికపైకి రావడం శుభపరిణామమన్నారు. ఉద్యోగ, ఉపాధ్యాయుల న్యాయమైన డిమాండ్ల సాధనకు సోషల్ మీడియా ప్రచారానికే పరిమితం కాకుండా ప్రత్యక్ష ఉద్యమంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. "ఒక్కరైతే ఒంటరి.. ఒక్కటైతే ఉప్పెన" అనే నినాదంతో సెప్టెంబర్ 10న హైదరాబాద్‌లో నిర్వహించే మహా ధర్నాకు లక్షలాదిగా తరలివచ్చి ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు. జేఏసీ నాయకులు ఐక్యంగా పిలుపునిచ్చిన నేపథ్యంలో ఇక ఉద్యోగ, ఉపాధ్యాయుల ప్రత్యక్ష భాగస్వామ్యమే కీలకమని అన్నారు. "ఇప్పుడు కాకపోతే ఇంకెప్పుడు?" అనే నినాదంతో హక్కుల సాధన కోసం ప్రతి ఉద్యోగి, ఉపాధ్యాయుడు సంయుక్త పోరాటంలో భాగస్వామి కావాలని ఎడబోయిన శ్రీనివాస్ రెడ్డి కోరారు.

**మహిళ నేతలపై జరిగిన అమానుష చర్యకు**

## సీఎం బేసరత్తుగా క్షమాపణ చెప్పాల్సిందే

**ఎబిఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో ధర్నా**




**విశ్వంభర , హుస్నాబాద్ :** టిఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై జరిగిన దాడిని ఖండిస్తూ మంగళవారం రోజున స్థానిక అంబేద్కర్ చౌరస్తాలో సిద్దిపేట జిల్లా హుస్నాబాద్ పట్టణంలో బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా మాజీ ఎమ్మెల్యే వోడితల సతీష్ కుమార్ హాజరయ్యారు. అంబేద్కర్ చౌరస్తా నుండి మల్లెచెట్టు చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన మోసపూరిత హామీలు దేవుళ్ళపై ప్రమాణం చేసి ప్రజలకు హామీలిచ్చి అధికారంలోకి వచ్చిన ఆరు గ్యారంటీలు అమలు చేయాలని కోరుతూ బిఆర్ఎస్ పార్టీ వారం రోజులపాటు నిరసనలకు పిలుపునిచ్చిందన్నారు. 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలు అమలు చేయాలని, వెయ్యి రోజుల పాలనలో కాంగ్రెస్ రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఏ ఒక్క హామీ అమలు చేయకుండా ఫెయిల్ అయ్యిందని నిరసన తెలుపడానికి అసెంబ్లీకి బిఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్ల టీ షర్టులతో అసెంబ్లీకి వస్తున్న ఎమ్మెల్యేలను అడ్డుకున్నారని దాడి చేశారని మహిళా ఎమ్మెల్యేలపై అని చూడకుండా అనుచితంగా ప్రవర్తించారని ఆరోపించారు. అసెంబ్లీ పరిధిలో ఏదైనా ఉంటే స్పీకర్ చూసుకుంటారని ప్రభుత్వానికి అక్కడ ఏం సంబంధం అని ప్రశ్నించారు. మహిళా నేతలపై జరిగిన దాడికి సీఎం రేవంత్ రెడ్డి క్షమాపణ చెప్పాల్సిందేనని, కాంగ్రెస్ సర్కారు దుశ్వాసన పర్వం తెలంగాణ సమాజం సమించే సహించదన్నారు. మోసపూరిత హామీలతో గద్దెనెక్కిన ప్రభుత్వం మహిళా ఎమ్మెల్యేలపై దాడి చేయించడం అమానుష చర్యని అన్నారు. ఆసరా పింఛన్లు పెంచలేదని, విద్యార్థులకు స్కూటీలు, కౌలు రైతులకు పదిహేను వేలు, కల్యాణ లక్ష్మి తులం బంగారం, యూత్ డిక్లరేషన్ లో భాగంగా జాబ్ కార్డులు ఏ ఒక్కడి అమలు కాలేదన్నారు. కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలు అమలు అయ్యేవరకు టిఆర్ఎస్ పార్టీ పోరాడుతూనే ఉంటుందని మొదలుపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు ప్రజాప్రతినిధులు, మహిళలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై దాడి అమానుషం



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలు, ప్రజా ప్రతినిధులపై పోలీసులు దాడి చేయడం అమానుషమని పెద్ద శంకరంపేట ఎంపీపీ జంగం శ్రీనివాస్ తీవ్రంగా ఖండించారు. మంగళవారం పెద్ద శంకరంపేటలో మాజీ ఎంపీపీ జగన్ శ్రీనివాస్ నివాసంలో నిర్వహించిన బీఆర్ఎస్ మండల నాయకుల విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అసెంబ్లీ గేటు వద్ద జరిగిన ఘటనకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే ప్రజాప్రతినిధులపై దాడులు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం వెయ్యి రోజుల పాలనలో ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను నెరవేర్చడంలో విఫలమైందని విమర్శించారు. ప్రస్తుత ప్రభుత్వ పాలనలో విద్యార్థులు, ఉద్యోగులు, వివిధ వర్గాల ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం రోడ్లపైకి వచ్చి ఆందోళనలు చేయాల్సిన పరిస్థితి ఏర్పడిందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలపై బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ సమావేశంలో మాజీ వైస్ ఎంపీపీ లక్ష్మీ రమేష్, బీఆర్ఎస్ నాయకులు సురేష్‌గౌడ్, సుభాష్, మాణిక్‌రెడ్డి, బి.దత్తు, వెంకట్‌రెడ్డి, విట్టల్‌గౌడ్, యాదుల్‌తో పాటు పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఉపాధ్యాయులు సమాజంతో మమేకం కావాలి




**విశ్వంభర, బాగ్‌లింగంపల్లి :** ఉపాధ్యాయులు సమాజంతో మమేకమై విద్యాభివృద్ధికి కృషి చేయాలని ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ బాలకిష్టారెడ్డి సూచించారు. మారుతున్న పరిస్థితులకు అనుగుణంగా కొత్త ఆలోచనలతో నైపుణ్యాలను పెంచుకోవాలని అన్నారు. హైదరాబాదు బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మంగళవారం తెలంగాణ ప్రైవేట్ టీచర్స్ లెక్చరర్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో రాష్ట్ర విద్యా సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రైవేట్ ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని సూచించారు. కోట్లాది మంది విద్యార్థుల భవిష్యత్తును తీర్చిదిద్దే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు ఏ. విజయ్‌కుమార్ మాట్లాడుతూ విద్యార్థుల్లో శాస్త్రీయ, ప్రజాస్వామ్య ఆలోచనా విధానాన్ని పెంపొందించాలని అన్నారు. విద్యారంగానికి ప్రభుత్వాలు నిధుల కేటాయింపులు పెంచాలని కోరారు. డాక్టర్ పద్మ కమలాకర్ మాట్లాడుతూ విద్యార్థుల మానసిక స్థితిని అర్థం చేసుకుని బోధించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ నాయకులు కె. విజయ్, పుట్టపాగ విజయ్, నర్సింహారావు, చందు, సురేందర్ పాల్గొన్నారు.

## తైక్వాండో క్రీడాకారుడు సహదేవ్‌కు అరుదైన గౌరవం

**విశ్వంభర, రాంనగర్ :** గిన్నిస్ బుక్ రికార్డు గ్రహీత, హైదరాబాదు ముషీరాబాద్ బాపూజీనగర్‌కు చెందిన తైక్వాండో క్రీడాకారుడు కొండా సహదేవ్‌కు 'కొండా లక్ష్మణ్ బాపూజీ కళారత్న -202627' పురస్కారం అందించారు. నేతన్న స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సహదేవ్ మాట్లాడుతూ అంతర్జాతీయ పోటీల్లో సాధించిన ప్రతిభకు గుర్తింపుగా పురస్కారం దక్కడం ఆనందంగా ఉందన్నారు. భవిష్యత్తులో మరిన్ని పతకాలు సాధించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే వన్నాల శ్రీరాములు, అఖిల భారత పద్మశాలి సంఘం అధ్యక్షుడు కె. స్వామి, రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.



## క్రీడలతో శారీరక దృఢత్వం పెరుగుతుంది

**మండల స్థాయి క్రీడా పోటీలు ప్రారంభించిన ఎంపీడీవో**



**విశ్వంభర, పెద్ద శంకరంపేట :** క్రీడల వల్ల విద్యార్థుల్లో శారీరక దృఢత్వం పెరుగుతుందని పెద్ద శంకరంపేట ఎంపీడీవో క్రాంతికుమార్ అన్నారు. మంగళవారం పెద్ద శంకరంపేటలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో మండల స్థాయి ఎస్ జి ఎఫ్ క్రీడా పోటీలను క్రీడా జ్యోతి వెలిగించి ఎంపీడీవో క్రాంతి కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటు ఆటల్లోనూ రాణించాలన్నారు. క్రీడల వల్ల విద్యార్థుల్లో క్రమశిక్షణ పట్టుదల. జట్టుగా కలిసి పనిచేసే తత్వం. నాయకత్వ లక్షణాలను పెంపొందిస్తాయని వివరించారు. క్రీడాకారులను గ్రామీణ స్థాయి నుండి ప్రోత్సహించాలన్నారు. ఈ కార్యక్రమంలో రిటైర్డ్ మండల విద్యాధికారి వెంకటేశం. ప్రధానోపాధ్యాయులు రాజప్ప శోభారాణి శశికళ శ్రీలత ఎం ఐ ఎస్ సి సంపత్ రెడ్డి. ఆయా పాఠశాలల ఉపాధ్యాయులు విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## కాజ్‌వే మంజూరుపై హర్షం వ్యక్తం చేసిన హుస్నాబాద్ నియోజకవర్గ ప్రజలు

**విశ్వంభర, హుస్నాబాద్ :** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలంలోని గుగ్గిళ్ల- హుస్నాబాద్ నియోజకవర్గం లోనీ వింజపల్లి రహదారిపై కాజ్‌వే నిర్మాణానికి రూ.1.75 కోట్ల నిధులు మంజూరయ్యాయి. ఈ మేరకు పంచాయతీరాజ్ & గ్రామీణాభివృద్ధి శాఖ (రోడ్లు) ద్వారా పరిపాలనా అనుమతులు జారీ చేసింది. సిఆర్ఆర్ (ప్లాన్) 202627 గ్రాంట్ కింద ఈ నిధులను మంజూరు చేశారు. ఈ సందర్భంగా గుగ్గిళ్ల వింజపల్లి మధ్య రాకపోకలకు కాజ్‌వే నిర్మాణం ఎంతోకాలంగా ఇక్కడి ప్రజలు కోరుకుంటున్నారు. ముఖ్యంగా వర్షాకాలంలో వాహనదారులు, గ్రామీణ ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందులు తొలగనున్నాయి. కాజ్‌వే నిర్మాణంతో రెండు గ్రామాల మధ్య రవాణా మరింత సులభతరం కానుంది. నియోజకవర్గ ప్రజల అవసరాలను గుర్తించి ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధుల మంజూరుకు కృషి చేసిన మంత్రి పొన్నం ప్రభాకర్ కి గుగ్గిళ్ల, వింజపల్లి గ్రామాల ప్రజలు, వాహనదారులు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ప్రజా అవసరాలకు ప్రాధాన్యతనిస్తూ హుస్నాబాద్ నియోజకవర్గంలో మౌలిక వసతుల అభివృద్ధికి మంత్రి పొన్నం ప్రభాకర్ కృషి చేస్తున్నారని ప్రజలు హర్షం వ్యక్తం చేశారు.

## గంజాయి కేసులో ఇద్దరు యువకుల అరెస్ట్



**విశ్వంభర, సూర్యాపేట:** ఆత్మకూరు (ఎస్) పోలీస్ స్టేషన్ పరిధిలోని రామన్నగూడెం గ్రామంలో 104 గ్రాముల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకుని ఇద్దరు యువకులను అరెస్ట్ చేశారు. అదే గ్రామానికి చెందిన అల్లిపురి అఖిల్ (23), మట్టపల్లి గంగరాజు (22)లను విశ్వసనీయ సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించి అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి గంజాయితో పాటు రెండు మొబైల్ ఫోన్లు, ఒక మోటార్ సైకిల్‌ను స్వాధీనం చేసుకున్నారు. నిందితులపై ఎన్‌డీపీఎస్ చట్టం కింద కేసు నమోదు చేసి కోర్టులో హాజరుపరిచి రిమాండ్‌కు తరలించినట్లు సూర్యాపేట రూరల్ సీఐ రాజశేఖర్ తెలిపారు. ఆత్మకూరు (ఎస్) ఎస్సై ఐలయ్య, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు. యువత గంజాయి, ఇతర మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని సీఐ సూచించారు. మత్తు పదార్థాల అక్రమ రవాణా, విక్రయాలపై నిరంతరం నిఘా కొనసాగుతుందని, నిబంధనలు ఉల్లంఘించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

## నేడు ఆదివరాహ స్వామి దేవస్థానం హుండీ లెక్కింపు



**విశ్వంభర, కమాన్ పూర్ :** పెద్దపల్లి జిల్లా, కమాన్‌పూర్ మండల కేంద్రంలో ప్రసిద్ధి చెందిన శ్రీ ఆదివరాహ స్వామి ఆలయంలో భక్తులు సమర్పించిన కానుకల హుండీ ఆదాయాన్ని ఈ నెల 9వ తేదీన (బుధవారం) ఉదయం 10:00 గంటలకు స్వామివారి కళ్యాణమంటపంలో లెక్కింపు కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ ముస్త్యాల దామోదర్, దేవస్థాన కార్యనిర్వహణాధికారి (ఈవో) కొసన కాంతరెడ్డి లు తెలిపారు. ఇటీవల అత్యంత వైభవంగా జరిగిన శ్రీ ఆదివార స్వామి వారి జయంతి ఉత్సవాల సందర్భంగా ఉమ్మడి కరీంనగర్ జిల్లాతో పాటు నలుమూలల నుంచి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఉత్సవాలతో పాటు రోజూవారీగా దర్శనానికి వచ్చే భక్తులు తమ మొక్కుబడులలో భాగంగా హుండీలో వేసిన కానుకలు, ఆదాయాన్ని అధికారికంగా లెక్కించేందుకు ఈ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తున్నారు. హుండీ లెక్కింపు ప్రక్రియ పారదర్శకంగా, పక్కాగా సాగేందుకు గాను వివిధ శాఖల అధికారులకు ముందస్తు సమాచారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు.

## ముందస్తు అరెస్టులు

**విశ్వంభర, ఎల్బీనగర్ :** తెలంగాణ అసెంబ్లీ సమావేశాల సందర్భంగా "బిఆర్ఎస్ పార్టీ" ఎమ్మెల్యేలపై అసెంబ్లీలో "రేవంత్ రెడ్డి ప్రభుత్వం చేస్తున్న దాష్టికని నిరసిస్తూ "కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000రోజులలో ముగిసినప్పటికి ఇచ్చిన హామీలను నెరవేర్చాలని "బిఆర్ఎస్ పార్టీ" ఆధ్వర్యంలో డిమాండ్ చేస్తు "అసెంబ్లీని ముట్టడిస్తారని సమాచారం మేరకు గడ్డిఅన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ "డాక్టర్ వీరమళ్ళ రామ్ నరసింహ గౌడ్, ఆర్కే పురం డివిజన్ బి ఆర్ ఎస్ ఆద్య తెల్లవారుజామున ముందస్తు అరెస్ట్ చేశారు.






# స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా కాంగ్రెస్ నాయకుల నిరసన



విశ్వంభర, పరిగి: బిఆర్ఎస్ ఎమ్మెల్సీ తాత మధు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ పరిగి పట్టణంలో అంబేద్కర్ విగ్రహం వద్ద పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు రామకృష్ణారెడ్డి, పరిగి మండల కాంగ్రెస్ అధ్యక్షులు వెంకట్ రాములు ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు మాట్లాడుతూ.. తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఉన్నత పదవిలో ఉన్న దళిత నాయకుడు గడ్డం ప్రసాద్ కుమార్ పై బి ఆర్ ఎస్ ఎమ్మెల్సీ చేసిన అనుచిత వ్యాఖ్యలు, దౌర్జన్యపూరిత ప్రవర్తనను తీవ్రంగా ఖండిస్తున్నామని అన్నారు. ప్రజాస్వామ్య విలువలకు, రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధమని, బిఆర్ఎస్ నాయకులు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, పిఎసిఎస్ వైస్ చైర్మన్ బద్రిగారి రాజపుల్లారెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సయ్యద్ అయ్యూబ్, మున్సిపల్ వైస్ చైర్మన్ హనుమంతు, డీసీసీ ప్రధాన కార్యదర్శి నస్కల్ అశోక్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు పాలాది శ్రీనివాస్ గుప్తా, ఎర్రగడ్డ పల్లి కృష్ణ, కౌన్సిలర్ ఎజాజ్, కో ఆప్షన్స్ సభ్యులు అనేశీ ఆంజనేయులు, కాంగ్రెస్ నాయకులు చిన్న నరసింహులు, చంద్రయ్య, సత్యనారాయణ, నస్కల్ శ్రీధర్, అన్వర్, వెంకటేష్, జగన్, నాగవర్ధన్, హరిచందర్, శ్రీనివాస్ రెడ్డి, రాధాకృష్ణారెడ్డి, రవి కాంత్ రెడ్డి, మహిపాల్, నవాజ్, మహేష్, రహీం పటేల్, ముస్తఫా, సుధాకర్ రెడ్డి, మీర్జా, అనిల్, గణేష్, పాల్గొన్నారు.

# సభాపతిని దూషించడం పై కాంగ్రెస్ నిరసన

**కెసిఆర్, కేటీఆర్, హరీష్ రావు క్షమాపణ చెప్పాలి**

**తాతా మధు నవీన్ రెడ్డిలను సస్పెన్షన్ చేయాలి**



విశ్వంభర, నెల్లికుదురు: శాసన సభ స్పీకర్ గడ్డం ప్రసాద్ ను దూషించడంపై కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు ఎదల్ల యాదవ రెడ్డి ఆధ్వర్యంలో మండల కేంద్రం వెల్లికుదురులోని అంబేద్కర్ విగ్రహం వద్ద మంగళవారం పార్టీ నాయకులు కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పార్టీ మండల అధ్యక్షులు యాదవ రెడ్డి మాట్లాడుతూ కెసిఆర్,కేటీఆర్,హరీష్ రావు భే షరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. ఎమ్మెల్సీ తాతా మధు పై చర్యలు తీసుకోవాలన్నారు. ఈకర్ ప్రసాద్ ని దూషించిన తాతా మధు నవీన్ రెడ్డిలను ఎమ్మెల్సీ పదవులు నుంచి వెంటనే సస్పెండ్ చేయాలని మాజీ జెడ్పిటిసి కాంగ్రెస్ సీనియర్ నాయకులు హెచ్చు వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. గౌరవప్రదమైన స్పీకర్ స్థానంలో ఉన్న సభాపతిని చెప్పరాని దుర్భాషలాడడం అత్యంత హేయమన్నారు. హరీష్ రావు వంటిపై చొక్కా తీసి మహిళా పోలీసుల ముందే వంటిపై చొక్కా తీసి విసిరివేయడం. కేటీఆర్ తో సహా ఎమ్మెల్యేలు పోలీసులపై దౌర్జన్యం చేయడం దారుణమన్నారు. సంఘటన అంతటికి కేసీఆర్ కేటీఆర్ హరీష్ రావు వెంటనే శాసనసభకు వచ్చి క్షమాపణ చెప్పాలన్నారు. కెసిఆర్ ప్రభుత్వంలో శాసనసభలో కాంగ్రెస్ తో సహా ప్రతిపక్ష ఎమ్మెల్యేలను మాట్లాడనిచ్చేవారు కాదన్నారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచి పులి వెంకన్న, ఉపసర్పంచి రాళ్లపల్లి వెంకన్న, జిలకర సాంబమృతి, కాంగ్రెస్ నాయకులు కోటగిరి సుదర్శన్ గౌడ్, శ్రీ పాల్ రెడ్డి,బొల్లి కొండ నాగరాజ, పత్తిపాక తిరుపతాచారి,మద్ది రాజేష్,తూళ్ళ ప్రణయ్,పెరుమాండ్ల జగన్,అరుణ్ కుమార్, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

# చింతపల్లి ప్రాజెక్టు పరిహారం ఎకరాకు రూ.30 లక్షలు ఇవ్వాలి

**మల్లారెడ్డిపల్లి-నసర్లపల్లి-చింతపల్లి రైతుల నూతన కమిటీ ఏర్పాటు**



విశ్వంభర, చింతపల్లి: చింతపల్లి ప్రాజెక్టు నిర్మాణంలో భాగంగా భూములు కోల్పోతున్న రైతుల సమస్యల పరిష్కారం కోసం మల్లారెడ్డిపల్లి, నసర్లపల్లి, చింతపల్లి గ్రామాలకు చెందిన రైతులు ఏకమయ్యారు. రైతుల హక్కులు, నష్టపరిహారం, భూ సేకరణ తదితర అంశాలపై సమష్టిగా పోరాడేందుకు నూతన కమిటీని ఏర్పాటు చేశారు. బైకని రాములు, నట్వ గిరిధర్, వడ్లకొండ రాము సారథ్యంలో ఏర్పాటు చేసిన నూతన కమిటీకి అధ్యక్షుడిగా ఆకుల శ్రీనివాస్, ఉపాధ్యక్షులుగా జబ్బు లింగం, ఎల్లెంకి అశోక్‌లను రైతులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా రైతుల సమావేశంలో కీలక తీర్మానం చేశారు. చింతపల్లి ప్రాజెక్టు కోసం భూములు కోల్పోతున్న ప్రతి రైతుకు ఎకరాకు రూ. 30 లక్షల నష్టపరిహారం అందించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. భూములు కోల్పోయే రైతుల కుటుంబాల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం న్యాయమైన పరిహారం అందించాలని కోరారు. భూములు కోల్పోతున్న రైతులందరికీ సమాన ప్రాతిపదికన నష్టపరిహారం అందించాలని కమిటీ సభ్యులు డిమాండ్ చేశారు. పరిహారం విషయంలో ఎలాంటి వివక్షకు తావులేకుండా భూ సేకరణ ప్రక్రియను పారదర్శకంగా నిర్వహించాలని కోరారు. రైతుల అభ్యంతరాలు, సమస్యలను అధికారులు పరిగణనలోకి తీసుకుని న్యాయం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతుల సమస్యల పరిష్కారం కోసం గ్రామాల వారీగా రైతులను సమన్వయం చేసి, ఐక్యంగా ముందుకు సాగుతామని నూతన కమిటీ సభ్యులు తెలిపారు. ప్రభుత్వం స్పందించి ఎకరాకు రూ. 30 లక్షల నష్టపరిహారం ప్రకటించి, భూములు కోల్పోతున్న రైతులందరికీ న్యాయం చేయాలని వారు డిమాండ్ చేశారు.

## రూ.10 వేల లంచం తీసుకుంటూ ఇంజినీర్ పట్టివేత

విశ్వంభర, ముషీరాబాద్ : కాంట్రాక్టర్ నుంచి రూ. 10 వేల లంచం తీసుకుంటూ హైదరాబాదులోని ముషీరాబాద్ నాణ్యత నియంత్రణ విభాగం డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సాయిరామ్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డారు. రెండో కాంట్రాక్టు పనికి నాణ్యత నియంత్రణ ధ్రువీకరణ పత్రం జారీ చేసేందుకు లంచం డిమాండ్ చేసినట్లు అధికారులు తెలిపారు. మంగళవారం సాయిరామ్ లంచం స్వీకరిస్తుండగా ఏసీబీ సిటీ రేంజ్-1 అధికారులు పట్టుకున్నారు. ఆయన వద్ద నుంచి నగదును స్వాధీనం చేసుకున్నారు. నిందితుడిని నాంపల్లిలోని ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు అధికారులు తెలిపారు. లంచం డిమాండ్ చేస్తే ఏసీబీ టోల్‌ఫ్రీ నంబర్ 1064కు ఫిర్యాదు చేయాలని సూచించారు.




# గణేష్ నవరాత్రుల్లో హద్దులు దాటితే చర్యలు తప్పవు

: నాంపల్లి సీఐ దూదిరాజు హెచ్చరిక



విశ్వంభర, చింతపల్లి: గణేష్ నవరాత్రి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలని, శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా ఎవరైనా హద్దులు దాటితే కఠిన చర్యలు తప్పవని నాంపల్లి సీఐ దూదిరాజు హెచ్చరించారు. గణేష్ ఉత్సవాల సందర్భంగా ఎలాంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని సూచించారు. చింతపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలో ఎస్ఐ రాంమూర్తి ఆధ్వర్యంలో నిర్వహించిన శాంతి సమావేశంలో గణేష్ మండపాల నిర్వాహకులు, ప్రజాప్రతినిధులు, వివిధ వర్గాల నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పోలీసులు ఉత్సవాల నిర్వహణకు సంబంధించి పలు సూచనలు చేశారు. గణేష్ విగ్రహాల ప్రతిష్ఠాపన అనంతరం ప్రభుత్వం, పోలీసు శాఖ సూచించిన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని అధికారులు తెలిపారు. 11 రోజుల్లోపే గణేష్ నిమజ్జనం కార్యక్రమాన్ని పూర్తి చేయాలని నిర్వాహకులకు సూచించారు. నిమజ్జనం సందర్భంగా ర్యాలీలు, ఊరేగింపుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో వ్యవహరించాలని కోరారు. గణేష్ మండపాల ఏర్పాటుకు సంబంధిత శాఖల నుంచి అవసరమైన అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని పోలీసులు స్పష్టం చేశారు. అనుమతులు లేకుండా మండపాలు ఏర్పాటు చేస్తే అనుమతి ఇవ్వబోమని హెచ్చరించారు. మండపాల వద్ద డీజేలు, మైక్‌లు, విద్యుత్ వినియోగం తదితర అంశాల్లో నిబంధనలు పాటించాలని సూచించారు. ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో, ఇతరులకు ఇబ్బంది కలగకుండా నిర్వహించాలని సీఐ దూదిరాజు కోరారు. సామాజిక మాధ్యమాల్లో వివాదాస్పద పోస్టులు పెట్టడం, వదంతులు వ్యాప్తి చేయడం వంటి చర్యలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. శాంతిభద్రతల పరిరక్షణలో ప్రజలు పోలీసులకు సహకరించాలని అధికారులు కోరారు.

పట్టణ ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో

## బుల్లెట్ ట్రైన్ సాధన కోసం ఒకరోజు నిరాహార దీక్ష



విశ్వంభర, సూర్యాపేట: బుల్లెట్ ట్రైన్ రైల్వే సాధన కోసం జరుగుతున్న రిలే నిరాహార దీక్షలకు మద్దతుగా సూర్యాపేట పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు బెలిదె శ్రీనివాసులు ఆధ్వర్యంలో స్థానిక రైతు బజార్ వద్ద ఏర్పాటుచేసిన దీక్షా శిబిరంలో ఆర్యవైశ్య సంఘం నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. సాయంత్రం 5 గంటలకు జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు వెంపటి వెంకటేశ్వర రావు ముఖ్య అతిధిగా పాల్గొని బెలిదె శ్రీనివాసులు కు నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపజేశారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ పారిశ్రామికవేత్త , సుధాకర్ పివిసి కంపెనీ ఎండి మీలా మహదేవ్ మద్దతు పలికి దీక్ష లో పాల్గొన్న వారికి పూలదండ లు వేసి సత్కరించారు. ఈ కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు పెద్దిరెడ్డి రాజా, గండూరి ప్రకాష్, జుట్టుకొండ సత్యనారాయణ,కర్నాటి కిషన్, ధర్మార్జున్ , వూర రామ్మూర్తి యాదవ్, రాపర్తి శ్రీనివాస్ గౌడ్, మొరిశెట్టి కోటేశ్వరరావు, సీనియర్ జర్నలిస్ట్ భూపతి రాములు, మిర్యాల వెంకటేశ్వర్లు , చల్లమల్ల,సట్టు నాగయ్య నరసింహ లు సంఘీభావం ప్రకటించారు. దీక్ష లో ఆర్యవైశ్య సంఘం నాయకులు ఉప్పల సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి బిక్కుమల్ల కృష్ణ, కోశాధికారి వుప్పల శ్రవణ్ కుమార్, బ్రహ్మాండ్లపల్లి మురళిధర్, చల్లా లక్ష్మయ్య, తోట శ్యామ్ ప్రసాద్, మంచాల రంగయ్య, కర్నాటి రవి, చల్లా లక్ష్మికాంత్, రాచకొండ శ్రీనివాస్, ఈగ దయాకర్ గుప్త, మిట్టపల్లి రమేష్, తాళ్లపెల్లి రామయ్య, సోమ వెంకటేశ్వర్లు, సుమన్ వెంకన్న, గుడిపాటి రమేష్, సోమ ప్రవీణ్, బెలిదె అంజయ్య, బెజగం ఫణి, మహిళా సంఘం అధ్యక్షురాలు మిట్టపల్లి శ్రీదేవి, వర్కింగ్ ప్రెసిడెంట్ బెలిదె రాధ, తల్లాడ మోహన్, బొల్లం సురేష్, భోనగిరి కృష్ణ, తల్లాడ సోమయ్య, జూలకంటి నాగరాజు, సోమ సోమేశ్వర్,నవిలిపురి నరేందర్, మహంకాళి సోమయ్య, మహిళాసంఘం నాయకులు దేవరశెట్టి ఉమారాణి, లకుమారపు పద్మజ, అక్కినపల్లి సంతోషి, ఓరుగంటి లావణ్య, యర్కచర్ల శోభారాణిలు పాల్గొన్నారు. జిల్లా రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షులు వెంపటి మధు ఆద్వర్యంలో పలువురు మిల్లర్ లు దీక్ష కు సంఘీభావం ప్రకటించారు.

## ఘనంగా ప్రపంచ ఫిజియోథెరపీ డే



విశ్వంభర, హనుమకొండ: ప్రపంచ ఫిజియోథెరపీ డే సందర్భంగా హనుమకొండలోని వడ్డేపల్లి జవహర్ కాలనీ సర్కిల్ రోడ్డులో ఉన్న ఆక్టివ్ బ్యాలెన్స్ ఫిజియోథెరపీ క్లినిక్‌లో మంగళవారం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీనియర్ ఫిజియోథెరపిస్ట్ డాక్టర్ వి. క్రాంతికుమార్ ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు, రోగులు, ఫిజియోథెరపీ వైద్యులకు శుభాకాంక్షలు తెలిపారు. క్లినిక్‌లో అత్యాధునిక రోబోటిక్ స్పైనల్ డిస్క్ డీకంప్రెషన్, రేడియల్ షాక్ థెరపీ, క్లాస్-4 లేజర్, ఎల్ఎఫ్‌టీ, అల్ట్రాసౌండ్ వంటి ఆధునిక ఫిజియోథెరపీ సేవలు అందుబాటులో ఉన్నాయని తెలిపారు. మెడ, భుజం, నడుము నొప్పులతో పాటు శస్త్రచికిత్స అనంతరం వచ్చే కీళ్లు, కండరాల సమస్యలకు కూడా చికిత్స అందిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో క్లినిక్ సిబ్బంది, రోగులు పాల్గొన్నారు.

## లాబీల్లో మీడియాపై ఆంక్షలు ఉండవు

: స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్



విశ్వంభర, హైదరాబాదు : శాసనసభ లాబీల్లో మీడియా ప్రతినిధులపై ఎలాంటి ఆంక్షలు ఉండబోవని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ స్పష్టం చేశారు. గతంలో మాదిరిగానే మీడియాకు అనుమతి ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ మేరకు టీడబ్ల్యూజేఎఫ్, హెచ్‌యూజే ప్రతినిధులు శాసనసభ స్పీకర్‌ను కలిసి సంఘీభావం తెలిపారు. లాబీల్లో మీడియాను అనుమతించరనే ప్రచారం జరుగుతున్న విషయాన్ని ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మీడియా ప్రతినిధులు ఎదుర్కొంటున్న సమస్యలను వివరించారు. స్పీకర్ స్పందిస్తూ మీడియాకు ఎదురవుతున్న చిన్నచిన్న సమస్యలను కూడా పరిష్కరిస్తామని తెలిపారు. గతంలో ఉన్న విధానాన్నే కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

## పేదింటి ఆడబిడ్డ కు కళ్యాణ లక్ష్మీ చెక్కు అందజేత



విశ్వంభర, హైదర్ నగర్ :హైదర్ నగర్ డివిజన్ పరిధిలో రామ్ నరేష్ నగర్ కాలనీకి చెందిన గుజ్జ నరేందర్ కుమార్తె కు రూ. 1,00116 ల రూపాయల కల్యాణ లక్ష్మి చెక్కును వారి కుటుంబ సభ్యులకు అందజేసిన శేర్లింగం పల్లి ఎమ్మెల్యే ప్యాక్స్ చైర్మన్ అరికెపూడి గాంధీ, స్థానిక కాంగ్రెస్ నేత పోతుల రాజేందర్ పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మాణానికి కృషి చేస్తా



విశ్వంభర, హైదరాబాద్ : చింతల్ లో ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మించాలని చింతల్ ఆర్యవైశ్య సంఘం నాయకులు కుత్బుల్లాపూర్ మాజీ ఎమ్మెల్యే కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ కూన శ్రీశైలం గౌడ్ గారిని షాపూర్ నగర్ లో తన నివాసంలో ఆర్యవైశ్య సంఘం సభ్యులు కలిసి వినతి పత్రం సమర్పించడం జరిగింది. ఈ సందర్భంగా కూన శ్రీశైలం గౌడ్ మాట్లాడుతూ అతి త్వరలో చింతల్లో ఆర్యవైశ్య కమ్యూనిటీ హాల్ నిర్మించడానికి మంత్రితో మాట్లాడి నిధులు సమకూరుస్తానని హామీ ఇవ్వడం జరిగింది. ఈ సమావేశంలో పాల్గొన్న మేడ్చల్ మల్కాజ్గిరి జిల్లా ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు పార్సి ప్రకాష్ గుప్తా, వర్కింగ్ ప్రెసిడెంట్ శ్రీనివాస్ గుప్తా వన శ్రీనివాస్ గుప్తా విజయ్ కుమార్ గుప్తా ప్రభు రాజ్ గుప్తా మురళి సత్యప్రసాద్ నారాయణ నల్ల రాజయ్య బద్దయ్య సంధ్య శ్రావణి మౌనిక తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## భూ సర్వే పారదర్శకంగా జరగాలి : కలెక్టర్ స్నేహ శబరీష్



విశ్వంభర, మహబూబాబాద్: మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం ఉప్పరపల్లి గ్రామ పరిధిలోని చెరువుముందు తండాలో కొనసాగుతున్న సమగ్ర భూ సర్వే ప్రక్రియను జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా సర్వే బృందాలు నిర్వహిస్తున్న రోవర్ల వినియోగం, హద్దుల గుర్తింపు, డిజిటల్ మ్యాపింగ్ ప్రక్రియను ఆమె నిశితంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ సరిహద్దు వివాదాలకు తావులేకుండా భూ యజమానుల సమక్షంలోనే ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలన్నారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ రికార్డులను పక్కాగా, పారదర్శకంగా నమోదు చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ వివేక్, సర్వేయర్లు, జి.పి ఓ నర్మద, గ్రామ పంచాయతీ సిబ్బంది మరియు స్థానిక రైతులు పాల్గొన్నారు.

## ముదిరాజ్ లను బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి మార్చాలి


విశ్వంభర, మహేశ్వరం : సామాజికంగా, ఆర్థికంగా విద్యాపరంగా ముదిరాజ్ కులస్తులు వెనుకబడిన కారణంగా ప్రభుత్వం మేనిఫెస్టోలో పెట్టిన విధంగా బీసీ,డీ నుంచి బీసీ 'ఏ లోనికి మార్చాలని ముదిరాజ్ సంఘం పోరాట సమితి రాష్ట్ర కార్యదర్శి గద గూటి మహేందర్ ముదిరాజ్ తెలిపారు. మహేశ్వరం మండల కేంద్రంలో మాట్లాడుతూ, ముదిరాజ్ లను తమకు రావాల్సిన స్థాయిలో విద్య, ఉద్యోగాలు, రాజకీయ ప్రాతినిధ్యం లభించడం లేదని తెలిపారు. గత ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీ వాగ్దానం చేసిన విధంగా ముదిరాజ్ లను ప్రస్తుతం ఉన్న బీసీ డీ నుంచి బీసీ ఏ లోకి చేర్చాలని ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు, ముదిరాజ్ సమాజం సామాజిక, విద్యా, ఆర్థిక పరిస్థితులపై సమగ్ర అధ్యయనం నిర్వహించి, జనాభా, ఉద్యోగాలు, విద్య, ఆర్థిక స్థితి, ప్రాతినిధ్యం వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని న్యాయమైన నిర్ణయం తీసుకోవాలని కోరారు. రాష్ట్రంలో అత్యధిక జనాభా కలిగి ఉన్న ముదిరాజ్ కులస్తులు అన్ని రంగాల్లో రాణించాలని ఆయన పేర్కొన్నారు. విద్య ,ఉపాధి, ఉద్యోగ అవకాశాలలో ముదిరాజ్ కులస్తులకు ప్రాధాన్యంకల్పించాలన్నారురాష్ట్రంలో మూడో అతిపెద్ద సామాజికవర్గంగా, బీసీల్లో రెండో పెద్ద కులంగా నిర్ధారించినట్లు తెలిపారు. ముదిరాజ్ సామాజికవర్గం విద్య, ఉపాధి, రాజకీయ ప్రాతినిధ్య రంగాల్లో వెనుకబడి ఉన్నదని, మరింత పురోగతి సాధించాల్సిన అవసరమున్నదని బీసీ 'డీ నుంచి 'ఏ లోకి మారిస్తే భావితరాలకు న్యాయం జరుగుతుందని, జనాభాకు అనుగుణంగా విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో ప్రాతినిధ్యం కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. బీసీ కమిషన్ ద్వారా సమగ్ర అధ్యయనం నిర్వహించి, రాజ్యాంగబద్ధమైన విధానంలో ముదిరాజ్ సమాజానికి న్యాయం చేయాలని మహేందర్ ముదిరాజ్ కోరారు, ఇది ఎవరికీ వ్యతిరేకమైన డిమాండ్ కాదని ముదిరాజ్ సమాజానికి సామాజిక న్యాయం, సమాన అవకాశాలు, తగిన ప్రాతినిధ్యం కోసం చేస్తున్న న్యాయమైన పోరాటం అని తెలిపారు.

## దడవాయిలకు కనీస వేతనాలు చెల్లించాలి



విశ్వంభర, రవీంద్రభారతి : వ్యవసాయ మార్కెటింగ్ శాఖలో కీలకంగా పనిచేస్తున్న దడవాయి కార్మికులకు కనీస వేతనాలతోపాటు పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎస్ఐ, ఆరోగ్య బీమా వంటి సౌకర్యాలు కల్పించేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి తెస్తామని ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ఎంపీ డా. జి. సంజీవరెడ్డి అన్నారు. కార్మికులు ఐక్యంగా పోరాడితేనే సమస్యలు పరిష్కారమవుతాయని పేర్కొన్నారు. హైదరాబాదులోని రవీంద్రభారతిలో మంగళవారం తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ మార్కెటింగ్ దడవాయిల యూనియన్ (ఐఎన్‌టీయూసీ) రాష్ట్ర సదస్సు నిర్వహించింది. ఈ సందర్భంగా సంజీవరెడ్డి మాట్లాడుతూ దడవాయిల సమస్యలను ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానన్నారు. వారికి గౌరవం, గుర్తింపుతోపాటు సామాజిక, ఉద్యోగ భద్రత కల్పించాల్సిన అవసరం ఉందన్నారు. ఐఎన్‌టీయూసీ రాష్ట్ర ముఖ్య ఉపాధ్యక్షుడు మొగుళ్ల రాజిరెడ్డి మాట్లాడుతూ రైతులకు న్యాయమైన తూకం అందించే దడవాయిల డిమాండ్లు కూడా న్యాయమైనవేనన్నారు. మెరుగైన పని పరిస్థితులు, తగిన వేతనాలు, సంక్షేమ సౌకర్యాలు కల్పించాలని కోరారు. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వై. నాగన్నగౌడ్ మాట్లాడుతూ చట్ట ప్రకారం దడవాయిలకు కనీస వేతనాలు, పీఎఫ్, గ్రాట్యుటీ, ఈఎస్ఐ అమలు చేయవచ్చన్నారు. సదస్సుకు రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి సుమారు 1,500 మంది దడవాయి కార్మికులు హాజరయ్యారు. కార్యక్రమంలో యూనియన్ అధ్యక్షుడు ఎస్. సురేందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి ఎన్. రవికుమార్, నాయకులు బి. వీరన్న, సంజీవ్‌కుమార్, సుదర్శన్, దేవేందర్ తదితరులు పాల్గొన్నారు.

## స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలపై బోడుప్పల్‌లో కాంగ్రెస్ నిరసన



విశ్వంభ, బోడుప్పల్: తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ బోడుప్పల్‌లో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. స్పీకర్ పదవికి గౌరవం తగ్గించేలా అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదంటూ కాంగ్రెస్ నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు.బోడుప్పల్11వ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు బొమ్మక్ కళ్యాణ్ కుమార్ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా డిసిసి అధ్యక్షులు తోటకూర వజ్రష్ యాదవ్,మాజీ మేయర్ అజయ్ యాదవ్, మాజీ అధ్యక్షులు పోగుల నరసింహారెడ్డి, బి బ్లాక్ ప్రధాన కార్యదర్శి కొత్త కిషోర్ గౌడ్ హాజరై అంబేద్కర్ విగ్రహం వద్ద, తాత మధు దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు, ఇన్‌చార్జ్ తోటకూర వజ్రేష్ యాదవ్ మాట్లాడుతూ.. శాసనసభ స్పీకర్ రాజ్యాంగబద్ధమైన కీలక పదవిలో ఉన్నారని, ఆ పదవిని కించపరిచే విధంగా వ్యాఖ్యలు చేయడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమని అన్నారు. తాతా మధు ప్రజలకు, స్పీకర్‌కు బహిరంగంగా క్షమాపణ చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. అనంతరం కాంగ్రెస్ నేతలు బిఆర్ఎస్ పార్టీ కార్యాలయం వద్ద కెసిఆర్ దిష్టిబొమ్మను దహనం చేయడం కొంత ఆందోళనకి గురిచేసింది. పోలీసులు పరిస్థితిని అదుపులోకి తీసుకొని ఎలాంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా అడ్డుకున్నారు. ఈ నిరసనలో బోడుప్పల్ కాంగ్రెస్ మాజీ కార్పొరేటర్లు, కాంటెస్ట్ కార్పొరేటర్లు, పార్టీ సీనియర్ నాయకులు, యూత్ కాంగ్రెస్ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా అధ్యక్షుడు బొమ్మక్ అజయ్, మేడ్చల్ అసెంబ్లీ అధ్యక్షుడు తోటకూర రాహుల్ యాదవ్, పలువురు యువ నాయకులు,మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు సమత యాదవ్, సరిత రెడ్డి మైనారిటీ విభాగం నాయకులు, మహిళా కార్యకర్తలు, సీనియర్ నాయకులు, యువజన నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొని నిరసన తెలిపారు.

# జలదోపిడీని అడ్డుకునేందుకు పార్టీలకు అతీతంగా పోరాడాలి

**12న నాగర్‌కర్నూల్‌లో జలసాధన సత్యాగ్రహ దీక్షను విజయవంతం చేయాలి**

**ఉమ్మడి పాలమూరు జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ**




విశ్వంభర, నాగర్ కర్నూల్: సీఎం సొంత జిల్లాలోనే పాలమూరు రైతాంగానికి జరుగుతున్న సాగునీటి అన్యాయాన్ని అడ్డుకోలేక పోతున్నామని ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ నాయకులు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు.ప్రభుత్వాలు మారుతున్నా పాలమూరు జలాల విషయంలో వివక్ష మాత్రం కొనసాగుతోందని ఆరోపించారు. పాలమూరు--రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ద్వారా ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాకు దక్కాల్సిన నీటిని డిండి ప్రాజెక్టు పేరుతో నల్లగొండ వైపు తరలించే ప్రయత్నాలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలో ఉమ్మడి మహబూబ్నగర్ జిల్లా పెండింగ్ ప్రాజెక్టుల సాధన జేఏసీ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశంనిర్వహించడం జరిగింది ఈ సందర్భంగా జేఏసీ చైర్మన్ రాజేందర్‌రెడ్డి,కో-కన్వీనర్ రాఘవాచారి,కో-చైర్మన్ శ్యాం ప్రసాద రెడ్డి కో కన్వీనర్,చిన్న కిష్టన్న తదితరులు మాట్లాడారు. గత ప్రభుత్వ హయాంలోనూ పాలమూరు సాగునీటి సమస్యకు న్యాయం జరగలేదని,ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కూడా పరిస్థితిలో ఆశించిన మార్పు కనిపించడం లేదని జేఏసీ నాయకులు విమర్శించారు.కృష్ణానది ఉమ్మడి మహబూబ్ నగర్ ప్రాంతంలో సుమారు 300 కిలోమీటర్లు ప్రవహిస్తున్నప్పటికీ, ఈ ప్రాంత రైతాంగం సాగునీటి కోసం దశాబ్దాలుగా ఎదురుచూస్తోందన్నారు. ఒకవైపు పాలమూరు ప్రాంతంలోని సాగునీటి ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాక రైతులు ఇబ్బందులు పడుతుంటే.. మరోవైపు తమ ప్రాంతానికి దక్కాల్సిన నీటిని ఇతర ప్రాంతాలకు తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని ఆరోపించారు. పాలమూరు రైతుల హక్కులను కాపాడాల్సిన ప్రభుత్వమే నీటి తరలింపును అనుమతిస్తే భవిష్యత్తులో అది జిల్లాకు శాశ్వత నష్టంగా మారే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాలం నుంచి పాలమూరు ప్రాంతం సాగునీటి విషయంలో అన్యాయానికి గురవుతోందని జేఏసీ నాయకులు ఆరోపించారు. చంద్రబాబు నాయుడు, వై.ఎస్. రాజశేఖరరెడ్డి ప్రభుత్వాల హయాంలోనూ పాలమూరు జలాల విషయంలో వివక్ష కొనసాగిందని విమర్శించారు.ప్రభుత్వాలు, పార్టీలు మారుతున్నా పాలమూరు రైతుల పరిస్థితిలో మాత్రం మార్పు రావడం లేదన్నారు. నదులు తమ ప్రాంతంలో ప్రవహిస్తున్నా తమ పొలాలకు సాగునీరు అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు.ఇప్పుడు తమకు దక్కాల్సిన నీటిని కూడా డిండి పేరుతో తరలించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, ఇది ఇంకెంతకాలం కొనసాగుతుందని ప్రభుత్వాలను ప్రశ్నించారు. పెండింగ్ ప్రాజెక్టులను పూర్తి చేయాలి,కల్వకుర్తి, నెట్టెంపాడు, భీమా, కోయిల్‌సాగర్ తదితర ప్రాజెక్టులను పూర్తిస్థాయిలో అందుబాటులోకి తీసుకురావాలని జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకంలోని కీలక పనులను వేగవంతం చేసి,ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రైతాంగానికి సాగునీరు అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు.ముఖ్యంగా పాలమూరు రైతులకు దక్కాల్సిన నీటిని డిండి ప్రాజెక్టు పేరుతో తరలించే చర్యలను తక్షణమే నిలిపివేయాలని స్పష్టం చేశారు.పాలమూరు జలాలపై జరుగుతున్న అన్యాయాన్ని ఇక మౌనంగా చూస్తూ ఊరుకోం.జలదోపిడీని అడ్డుకునే వరకు పోరాటం కొనసాగిస్తాం అని జేఏసీ నాయకులు స్పష్టం చేశారు. ఆ జిల్లా రాజకీయ నాయకులకు లేని భయం మన మహబూబ్ నగర్ రాజకీయ నాయకులకు ఎందుకని ప్రశ్నించారు అందుకే ఈ ప్రాంత రాజకీయ నాయకుల అందరూ పార్టీలకు అతీతంగా పోరాటం లో పాల్గొనాలని సూచించారు.

**12న జలసాధన సత్యాగ్రహ దీక్ష**

పాలమూరు సాగునీటి హక్కుల సాధన కోసం ఈ నెల 12న నాగర్‌కర్నూల్ గాంధీ పార్కులో ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జలసాధన సత్యాగ్రహ దీక్ష నిర్వహించనున్నట్లు జేఏసీ నాయకులు తెలిపారు. రైతులు,ప్రజలు, ప్రజాస్వామిక వాదులు, అన్ని రాజకీయ పార్టీల నాయకులు, కార్యకర్తలు పార్టీలకు అతీతంగా పెద్ద సంఖ్యలో పాల్గొని దీక్షను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పాలమూరు జలాల పరిరక్షణ కోసం అన్ని పార్టీలు,ప్రజా సంఘాలు ఏకతాటిపైకి రావాలని కోరారు. అనంతరం ఈనెల 12వ తేదీన నాగర్ కర్నూల్ జిల్లా కేంద్రంలోని గాంధీ పార్క్ వద్ద నిర్వహించే సత్యాగ్రహ దీక్షకు సంబంధించిన కరపత్రాలను విడుదల చేశారు.ఈ సమావేశంలో వామన్ కుమార్,గోవర్ధన్,మహేష్‌గౌడ్,జనసేన పార్టీకి చెందిన,ఎం.డి.ఆరిఫ్ అంజయ్యచారి,తెలంగాణ జన సమితికి చెందిన ఎం.డి.మేరాజ్, వినయ్‌కుమార్, బి.రమేష్,అబ్దుల్ రాఫ్, పులిందర్ రాజు, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## ఎస్ ఐ ఆర్ కు పత్రాలు సమర్పించిన పాత్లావత్ గట్యా నాయక్



విశ్వంభర, పరిగి: దోమ మండలం దిర్సంపల్లి రెవెన్యూ గ్రామ పంచాయితీ లో ఎస్ ఐ ఆర్ ప్రక్రియ ఎలా జరుగుతున్నాయో తెలుసుకొని దిర్సంపల్లి తండా గ్రామ పంచాయితీ కార్యదర్శి వినోద్ కీ ఎస్ ఐ ఆర్ నోటీసు కు సంబందించిన పత్రాలు జత చేసి ఇవ్వడం జరిగింది. ప్రజలకు ఇబ్బందులు కల్గించ అందుబాటులో ఉంది సేవా చెయ్యలని, మేధావులు, యూవకులు ప్రజలకు ఓటర్ మహాసియులకు వచ్చిన నోటీసులకు ఎలాంటి పత్రాలు జత పర్చి ఇవ్వాలో ప్రజలకు అర్థం ఐయ్యే రీతిలో నచ్చచెప్పి వారికీ సహాయపడాలని, అధికారులకు సహకరించాలని ఘాట్య నాయక్ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఎల్ హెచ్ పి ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, భారత్ ముక్తి మోర్చా రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గోవింద్ నాయక్ గ్రామ పెద్దలు యూసుఫ్, గంగా బాయి,మూడవత్ రవీందర్, రాజు నాయక్, హన్మి బాయి తదితరులు పాల్గొన్నారు.

## బారిష్టర్ డా. మరియం కామిల్‌కు ఘన సన్మానం



విశ్వంభర, బషీర్‌బాగ్: తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో లండన్ న్యాయస్థానంలో బారిష్టర్‌గా సేవలందిస్తున్న డా. మరియం కామిల్‌ను ఘనంగా సన్మానించారు. తెలంగాణ ఉన్నత విద్యా మండలి కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో మండలి చైర్మన్, న్యాయశాస్త్ర నిపుణుడు ప్రొఫెసర్ వి. బాలకృష్ణారెడ్డి ఆమెను శాలువా, పూలమాల, జ్ఞాపిక, ప్రశంసాపత్రంతో సత్కరించారు. ఈ సందర్భంగా బాలకృష్ణారెడ్డి మాట్లాడుతూ న్యాయ విద్యార్థులు నిరుపేదలకు చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు మానవ హక్కుల పరిరక్షణకు కృషి చేయాలని సూచించారు. ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ పూర్తి చేసిన డా. మరియం కామిల్ అనంతరం భారత సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తికి జ్యుడిషియల్ అసిస్టెంట్‌గా సేవలందించారు. ఆ తర్వాత ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయంలో న్యాయశాస్త్రంలో ఉన్నత విద్యను అభ్యసించి ప్రస్తుతం లండన్ కోర్టులో బారిష్టర్‌గా, ముఖ్యంగా మీడియా చట్టానికి సంబంధించిన కేసుల్లో పనిచేస్తున్నారు. కార్యక్రమంలో తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డా. రాజ్‌నారాయణ ముదిరాజ్, కార్యదర్శి డా. అక్తర్ అలీ, ప్రొఫెసర్ ధర్మపాల్, న్యాయవాదులు డా. యాసర్, వశీయుద్దీన్, డా. సాజిద్ అలీఖాన్, కోఆర్డినేటర్ జి. వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు. వివిధ న్యాయ కళాశాలల విద్యార్థులు డా. మరియం కామిల్‌తో లండన్ న్యాయ వ్యవస్థపై ప్రశ్నోత్తరాలు నిర్వహించారు.

## తాతా మధును సస్పెండ్ చేయాలని చౌడపూర్ లో నిరసన



విశ్వంబర, పరిగి: చౌడపూర్ మండల కేంద్రంలో తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై తాతా మధు చేసిన అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా చౌడాపూర్ మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు ఎం. చంద్రశేఖర్ మాట్లాడుతూ.. రాజ్యాంగబద్ధమైన పదవిలో ఉన్న అసెంబ్లీ స్పీకర్ పై అనుచిత వ్యాఖ్యలు చేయడం సరికాదని, ప్రజాస్వామ్య విలువలు, రాజ్యాంగ సంస్థల గౌరవాన్ని కాపాడాల్సిన బాధ్యత ప్రతి ప్రజా ప్రతినిధులపై ఉందని పేర్కొన్నారు. తాతా మధు చేసిన వ్యాఖ్యలపై పార్టీ అధిష్ఠానం తక్షణమే స్పందించి, ఆయనను ఎమ్మెల్సీ పదవి నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో పిఎసిఎస్ వైస్ చైర్మన్ అశోక్ కుమార్,మండల ప్రధాన కార్యదర్శి రాము,చౌడాపూర్ మండల సర్పంచ్ లు నర్సిహ్మ నాయక్, నవీన్ కుమార్.మధు రవి, చెన్నయ్య,తుకారాం, శ్రీను, కాంగ్రెస్ నాయకులు లాలు, నర్సిములు,ఇలియాస్, దామోదర్రెడ్డి, వెంకటయ్య, చెన్నయ్య. సలీమ్.రాములు. గోపాల్.కృష్ణ రెడ్డి. ఆంజనేయులు రమేష్, బుచ్చయ్య, మాణికుమార్, మల్లేష్ ,రాజు,యాదయ్య, తదితరులు పాల్గొన్నారు.

# మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్



విశ్వంభర, మహబూబాబాద్: మంగళవారం జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ కేసముద్రం మండలం లోని కోరుకొండపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ పాఠశాలలో విద్యార్థుల హాజరు, ఉపాధ్యాయుల హాజరు రిజిస్టర్, మధ్యాహ్న భోజన పథకం అమలు, మరుగుదొడ్లు, త్రాగునీటి సౌకర్యం, తరగతి గదుల పరిశుభ్రతను పరిశీలించారు. విద్యార్థులకు యూనిఫారాల పంపిణీని, పాఠ్యపుస్తకాలను సకాలంలో పంపిణీ చేయాలని అన్నారు. విద్యార్థులతో మాట్లాడి వారి చదువు సామర్థ్యాన్ని అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల్లో సృజనాత్మకత, విమర్శనాత్మక ఆలోచన పెంపొందించేందుకు మెలకువలతో విద్యాబోధన అవసరమని అన్నారు. పాఠ్యపుస్తకాల్లోని అంశాలను బట్టీ పట్టించడం కాకుండా, నిత్యజీవిత ఉదాహరణలతో, కథలు, ఆటలతో బోధించాలని అన్నారు. మధ్యాహ్న భోజనం నాణ్యతగా, పరిశుభ్రంగా ఉండాలని, ప్రతి విద్యార్థికి పోషకాహారం అందేలా చూడాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. పాఠశాలలో మౌలిక వసతుల కల్పనకు చర్యలు తీసుకోవాలని, విద్యా ప్రమాణాలు మెరుగు పరిచేందుకు ఉపాధ్యాయులు కృషి చేయాలని సూచించారు. హాజరు శాతం పెంచేందుకు తల్లిదండ్రులలో అవగాహన కల్పించాలని ఎంఈఓకి సూచించారు. మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలోని అంగన్ వాడీ కేంద్రాన్ని పరిశీలించి అంగన్ వాడీ కేంద్రంలో చిన్నారుల హాజరు, పోషకాహార నిల్వలు, నాణ్యత, మధ్యాహ్న భోజనం మరియు బాలామృతం పంపిణీ తీరు,పాఠశాల, అంగన్ వాడీ రికార్డుల నిర్వహణ, పరిశుభ్రత, త్రాగునీటి సౌకర్యాలపై అడిగి తెలుసుకున్నారు. ప్రాథమిక స్థాయి నుండే పిల్లలకు నాణ్యమైన విద్య, పౌష్టికాహారం అందాలని, అంగన్ వాడీ, ప్రాథమిక పాఠశాల సమన్వయంతో పనిచేయాలని సూచించారు. తక్కువ బరువు గల చిన్నారులను గుర్తించి ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని, పాఠశాల ఆవరణను ఎల్లప్పుడూ పరిశుభ్రంగా ఉంచాలని అధికారులను, సిబ్బందిని ఆదేశించారు. ఈ తనిఖీలో స్థానిక తహశీల్దార్ వివేక్, మండల విద్యాధికారి యాదగిరి, పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజన్న, ఉపాధ్యాయులు, అంగన్ వాడీ సిబ్బంది, తదిత రులు పాల్గొన్నారు.

## జనంపల్లిలో ఫారం పాండ్ పనుల పరిశీలన



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, జనంపల్లి గ్రామములో జరుగుతు న్న ఫారం పాండ్ పనులను మంగళవారం రోజు మండల ఎంపీడీఓ రాములు పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ వెంట ఏపీవో వెంకన్న, పంచాయతీ కార్యదర్శి అయ్యప్ప రెడ్డి, ఫీల్డ్ అసిస్టెంట్ నరేందర్, కూలీలు తదితరులు పాల్గొన్నారు.

## గణేష్ మండపాల నిర్వాహకులు ఆన్ లైన్ లో నమోదు చేసుకోవాలి



విశ్వంభర, ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండలంలో అన్ని గ్రామాలు, తండాలలో గణేష్ మండపాలను నిర్వహించే వారు ఆన్లైన్ లో తమ వివరాలను నమోదు చేసుకోవాలని ఎస్సై పి. నరేష్ మంగళవారం ఒక ప్రకటనలో నిర్వాహకులను కోరారు. సంబంధిత ప్రతిని పోలీస్ స్టేషన్లో సమర్పించాలని తెలిపారు. ప్రతి మండప నిర్వాహకులు అవసరమైన వెరిఫికేషన్ రికార్డు కోసం సంబంధిత పోలీస్ స్టేషన్లో వెరిఫికేషన్ లెటర్ ను అందజేయాలని పేర్కొన్నారు. పోలీసు శాఖ సూచనలను పాటించడంలో నిర్లక్ష్యం చేయవద్దని ఎస్సై తెలిపారు.

## హియరింగ్ ప్రక్రియ సులభతరం చేయాలి



విశ్వంభర, సూర్యాపేట: సర్ ప్రక్రియలో భాగంగా నోటీసులు అందుకున్న ఓటర్లు ఎలాంటి ధ్రువపత్రాలు సమర్పించాలో ముందే వారికి తెలియజేస్తే హియరింగ్ ప్రక్రియ సులభంగా పూర్తవుతుందని నల్గొండ జిల్లా ఎన్నికల ఓటరు జాబితా పరిశీలకురాలు, రాష్ట్ర ఉన్నత విద్య కమిషనర్ ఏ. శ్రీదేవసేన అన్నారు. మంగళవారం ఆమె సూర్యాపేట జిల్లా కేంద్రంలోని తిలక్ నగర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏర్పాటుచేసిన పోలింగ్ కేంద్రాలను ఆకస్మికతనిఖీ చేసి సర్ క్రియను పరిశీలించారు. పోలింగ్ కేంద్రంలో బిఎల్ఓ, బిఎల్ఎలతో మాట్లాడుతూ పోలింగ్ కేంద్రాల పరిధిలోని ఓటర్ల సంఖ్య, మ్యాపింగ్ కానీ ఓటర్లు, జాబితాలో తేడాలున్న ఓటర్లకు జారీ చేసిన నోటీసులు, హియరింగ్ వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ఓటరుకు నోటీసు ఎందుకు వెళ్లిందో, అందుకు ప్రతిగా వారు ఎలాంటి ధృవపత్రాలు సమర్పించాలో హియరింగ్ కి ముందే తెలియజేస్తే హియరింగ్ రోజు వాటిని తీసుకొని హాజరవుతారని అన్నారు. నోటీసుల ప్రక్రియ సవ్యంగా నిర్వహించేందుకు బిఎల్ఎలు ,బిఎల్వోలు ఇల్లిల్లు తిరగాలని ,అప్పుడే నోటీసులు జారీ చేసిన వారందరి సమస్యను సులభంగా పరిష్కరించవచ్చని తెలిపారు .నోటీసులు జారీ చేసిన అనంతరం బిఎల్వోలు నోటీసు అందుకున్న ఓటర్లు అడిగితే ఎలాంటి ధృవపత్రాలు కావాలో చెప్పగలిగే స్థాయిలో ఉండాలన్నారు. నోటీసులు జనరేట్ అయిన వారందరికి జారీ చేయాలని,అనవసరంగా దగ్గర పెట్టుకోవద్దని సూచించారు. కార్యక్రమంలో ఆర్డిఓ వేణు మాధవరావు, తహసిల్దార్ సాయి గౌడ్ సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం




విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం రోజు అంతర్జాతీయ అక్షరాస్యత దినోత్సవం కార్యక్రమాన్ని జాతీయ సేవా పథకం ఆధ్వర్యంలో నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఇంచార్జ్ ప్రిన్సిపల్ ఆచార్య ఆర్.రత్న మంజుల మాట్లాడుతూ, విద్య విజ్ఞానంతో పాటు వివేకాన్ని అందిస్తుందని, ప్రతి ఒక్కరూ చదువుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు. ఈ కార్యక్రమానికి ప్రధాన వక్తగా విచ్చేసిన తెలుగు శాఖ అధ్యక్షులు, ప్రముఖ సాహితీవేత్త డాక్టర్ తండు కృష్ణ కౌండిన్య మాట్లాడుతూ, ప్రపంచవ్యాప్తంగా ఇప్పటికీ చదువుకు నోచుకోని వారు చాలామంది ఉన్నారని, ప్రతి ఒక్కరికి చదువు అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందని అన్నారు.

విద్యా హక్కు చట్టం ప్రకారం చదువుకునే వయసు కలిగిన ప్రతి విద్యార్థి పాఠశాలలోనే ఉండాలని, అందుకు ప్రభుత్వాలు విద్యకు ఎక్కువ బడ్జెట్ కేటాయించి సంపూర్ణ అక్షరాస్యత సాధించేంతవరకు కృషి చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. దేశ అక్షరాస్యతతో పోల్చినప్పుడు తెలంగాణ అక్షరాస్యత తక్కువగా ఉన్నదని తెలంగాణ రాష్ట్రం విద్యా రంగానికి ఎక్కువ బడ్జెట్ కేటాయించి, అందరికీ విద్య అందేలాగా కృషి చేయాలని అన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులకు 'డిజిటల్ లిటరసీ' అంశంపై వ్యాసరచన, వక్తృత్వ పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో జాతీయ సేవా పథకం అధికారులు డాక్టర్ జె.చిన్నబాబు, డాక్టర్ జి.సునీత, అకడమిక్ కోఆర్డినేటర్ డాక్టర్ డి.కిషన్, ఐక్యుఏసి కో-ఆర్డినేటర్ డాక్టర్ ఎన్.లక్ష్మీ నీలిమతో పాటు అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## తాత మధు పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదుచేయాలి



విశ్వంభర, గౌలిపుర: స్పీకర్ ప్రసాద్ కుమార్ పై బి ఆర్ ఎస్ పార్టీ ఎమ్మెల్సీ అనుచిత వ్యాఖ్యలను నిరసిస్తూ భాగ్యనగర ఎస్సీ మోర్చా ప్రెసిడెంట్ కౌడి సురేందర్ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. రాజ్యాంగ పద్ధ పదవిలో ఉన్న దళిత స్పీకర్, వారి కుటుంబాన్ని ఇలా అవమానించడం అనేది కేవలం ఒక వ్యక్తిని అవమానించడం కాదు మీరు రాజ్యాంగాన్ని ప్రజాస్వామ్యాన్ని అవమానించడమే ఇలాంటి విష సంస్కృతిని అంతం చేయాలి అంటూ నిరసన తెలిపారు. తాత మధు పై వెంటనే ఎఫ్ఐఆర్ నమోదు చేయాలని, అసభ్య పదజాలం మహిళలను కించపరిచే విధంగా మాట్లాడినందుకు బీఎన్ఎస్ ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా చూడాలని, దయచేసి తగు న్యాయం చేయాలని కౌడి సురేందర్ తెలిపారు.

## శంకర్‌పల్లిలో ఘోర రోడ్డు ప్రమాదం.. యువకుడు మృతి



విశ్వంభర, శంకర్‌పల్లి: బద్ధం సురేందర్ రెడ్డి ఫంక్షన్ హాల్ సమీపంలో మంగళవారం మధ్యాహ్నం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో 19 ఏళ్ల యువకుడు మృతి చెందగా, మరో యువకుడికి తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం.. చిన్న శంకర్‌పల్లికి చెందిన నిశ్వంత్ (19) తన స్నేహితుడు కంటేష్‌తో కలిసి మంగళవారం మధ్యాహ్నం సుమారు 12 గంటల సమయంలో శంకర్‌పల్లి నుంచి బద్ధం సురేందర్ రెడ్డి గార్డెన్ వైపు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలో రోడ్డుపై ఆగి ఉన్న ఫార్చునర్ కారును బైక్ ఢీకొట్టింది. ప్రమాదంలో నిశ్వంత్‌కు తీవ్ర గాయాలు కావడంతో వెంటనే సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ నిశ్వంత్ మృతి చెందాడు. బైక్ వెనుక కూర్చున్న అతని స్నేహితుడు కంటేష్‌కు కూడా తీవ్ర గాయాలు కావడంతో చికిత్స అందిస్తున్నారు. ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# అనుమతుల్లేకుండా విచ్చలవిడిగా షెడ్ల నిర్మాణాలు



విశ్వంభర, బోడుప్పల్: బోడుప్పల్ సర్కిల్ పరిధిలో అనుమతులు లేకుండా షెడ్లు, ఇతర నిర్మాణాలు చేపడుతున్నా అధికారులు పట్టించు కోవడం లేదని బోడుప్పల్ సెటిలర్స్ ఫోరం చైర్మన్ ఎడ్ల శ్రీనివాస్‌రెడ్డి ఆరోపించారు. గాయిత్రిహిల్స్‌లో అనుమతి లేని షెడ్‌ను ఫోరం ప్రతినిధులతో కలిసి ఆయన క్షేత్రస్థాయిలో పరిశీలించారు. అక్రమ నిర్మాణాలపై ఫిర్యాదులు చేసినా టౌన్‌ప్లానింగ్ అధికారులు చర్యలు తీసుకోవడం లేదని మండిపడ్డారు. అనుమతులు లేకుండా నిర్మాణాలు చేపట్టడం వల్ల ప్రభుత్వానికి రావాల్సిన రుసుములు, పన్నుల ఆదాయానికి నష్టం వాటిల్లే అవకాశం ఉందన్నారు. బోడుప్పల్ పరిధిలో అనుమతిలేని నిర్మాణాలపై ప్రత్యేక తనిఖీలు నిర్వహించి, నిబంధనలు ఉల్లంఘించిన వాటిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్పందించకపోతే ఆందోళన ఉద్ధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఫోరం అధ్యక్షుడు కత్తి వెంకట్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి అమరలింగారెడ్డి, కోశాధికారి బజ్జూరి శ్రీనివాస్‌గుప్తా, సలహాదారు వెంకటస్వామి తదితరులు పాల్గొన్నారు.

## చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి




విశ్వంభర, ఆదిలాబాద్ : ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పింఛనర్లు, కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలపై ఈనెల 10న చేపట్టనున్న చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీజీ ఈజేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్ కోరారు. ఆదిలాబాద్‌లో జరిగిన ఉద్యోగుల సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఉద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమైందని అన్నారు. ఉద్యోగుల ఓట్లతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ చర్చల పేరుతో కాలయా పన చేస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి అనుమతి ఇవ్వక, అసెంబ్లీ సమావేశాలు ఉన్నాయంటూ సాకులు చెబుతుందని తెలిపారు. ఈ కార్యక్రమానికి ఉద్యోగులు పెద్ద సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని కోరారు.

# మాజీ ఎంపీ కవిత ఎమ్మెల్యే శంకర్ నాయక్ అరెస్ట్

## విడుదల చేయాలని బిఆర్ఎస్ శ్రేణులు ధర్నా



విశ్వంభర, నెల్లికుదురు: ఎర్రవెల్లి లోని కెసిఆర్ ఫామ్ హౌస్ కు తరలి వెళ్తున్న బీఆర్ఎస్ మాజీ ఎంపీ మాలోతు కవిత మాజీ ఎమ్మెల్యే బానోతు శంకర్ నాయక్ ను మంగళవారం నెల్లికుదురు లో సిఐ సత్యనారాయణ నెల్లికుదురు, ఇనుగుర్తి ఎస్ఐ లు గంగారపు కరుణాకర్ పి నరేష్ పోలీస్ సిబ్బందితో కలిసి అడ్డుకున్నారు. వారిని స్థానిక పోలీస్ స్టేషన్ కు తరలించారు. సమాచారం తెలుసుకున్న పార్టీ మండల ప్రధాన కార్యదర్శి వెన్నాకుల శ్రీను తో పాటు నాయకులు కార్యకర్తలు వెంటనే కవితను, శంకరనాయక్ ను విడుదల చేయాలని కోరుతూ తొర్రూరు మహబూబాబాద్ ప్రధాన రహదారిపై రాస్తారోకో ధర్నా నిర్వహించారు. దీంతో కొంతసేపు వాహనాలకు అంతరాయం కలిగింది. పోలీసులు జోక్యం చేసుకొని ఆందోళనను విరమింప చేశారు. స్థానిక పోలీస్ స్టేషన్లో కవిత, శంకర్ నాయక్ మాట్లాడుతూ కాంగ్రెస్ ఎమ్మెల్యే శంకర్ కేసీఆర్ చావుకోడడం,ఎర్రవెల్లి ఫామ్ హౌజ్ వద్ద చావు డప్పులు కొడతామని చెప్పడం, కాంగ్రెస్ గుండాలు పోలీసుల సహకారంతో ఫామ్ హౌస్ పై దాడికి వెళున్నారనే సమాచారం మేరకు మా నాయకుడు కేసీఆర్ ను కాపాడుకోవడానికి మేము వెళున్నాము. ఈ క్రమంలో పోలీసులు అడ్డుకోవడం దారుణమన్నారు.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్ వెయ్యి రోజుల విఫల పాలనపై నిరసన సూచకంగా సోమవారం నల్ల టీ షర్టు ధరించి వెళ్తుంటే పోలీసులు దౌర్జన్యంగా అడ్డుకున్నారని, మహిళా ఎమ్మెల్యేలపై పైశాచికంగా వ్యవహరించారన్నారు. దీనంతటికీ రేవంత్ రెడ్డి కారణమని విమర్శించారు.మేం అధికారంలోకి వచ్చాక ఎవరిని వదిలిపెట్టమన్నారు.అనంతరం కవిత శంకర్ నాయక్ లను వారి గృహాలకు పంపారు.

# గణేష్ మండప నిర్వాహకులకు ఎస్ఐ సూచనలు




విశ్వంభర, వలిగొండ: వినాయక చవితి ఉత్సవాలను ప్రశాంత వాతావరణంలో భక్తిశ్రద్ధలతో నిర్వహించాలని వలిగొండ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి సూచించారు. గణేష్ మండపాల ఏర్పాటుకు పోలీస్, విద్యుత్, గ్రామపంచాయతీ అధికారుల నుంచి ముందస్తు అనుమతులు తప్పనిసరిగా తీసుకోవాలని తెలిపారు. మండపాల వల్ల ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని, ధ్వని కాలుష్య నిబంధనలు పాటించాలని సూచించారు. ప్రతి మండపం వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడంతో పాటు రాత్రివేళ కనీసం ఇద్దరు, ముగ్గురు నిర్వాహకులు అందుబాటులో ఉండాలని చెప్పారు. శోభాయాత్రలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్టపరంగా కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ హెచ్చరించారు.

# ఇబ్రహీంపట్నంలో ఘనంగా ముత్యాలమ్మ బోనాలు



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం మున్సిపాలిటీ పరిధిలోని ముత్యాలమ్మ కాలనీలో ముత్యాలమ్మ బోనాల పండుగను భక్తులు అత్యంత భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఇటీవల మున్సిపాలిటీ నూతనంగా నిర్మించిన ముత్యాలమ్మ ఆలయ ప్రాంగణంలో ఈ వేడుకలు కన్నుల పండుగగా సాగాయి. మహిళలు సంప్రదాయబద్ధంగా బోనాలు ఎత్తుకొని అమ్మవారికి సమర్పించుకున్నారు.ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు సురమోని సత్యనారాయణ మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులు ఎల్లవేళలా ఇబ్రహీంపట్నం ప్రజలపై ఉండాలని కోరుకుంటూ బోనాలు సమర్పించుకున్నామని తెలిపారు. ముత్యాలమ్మ కోర్కెలు తీర్చే తల్లి అని, అమ్మవారిని మనసారా కోరుకుంటే కొంగు బంగారం అవుతుందని అన్నారు. అమ్మవారి కటాక్షం ప్రతి ఒక్కరిపై ఉండాలని, ప్రజలందరూ సుఖసంతోషాలతో ఉండాలని ఆకాంక్షించారు. కాలనీవాసులంతా ఐక్యంగా ఈ బోనాల పండుగను ఘనంగా నిర్వహించారని పేర్కొన్నారు.ఈ వేడుకలకు ఇబ్రహీంపట్నం పోలీస్ శాఖ తరపున ఏసీపీ కేపీవీ రాజు, సీఐ మహేందర్ రెడ్డి హాజరై అమ్మవారిని దర్శించుకున్నారు. వారితో పాటు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ మంగ జగదీష్ యాదవ్, బీఆర్ఎస్ నాయకులు జేర్కొని రాజు, కౌన్సిలర్ గూడూరి గిరి, మాజీ వార్డ్ మెంబర్లు పబ్బే శ్రీనివాస్, మాజీ మున్సిపల్ కౌన్సిలర్లు ఈగల రాములు, సురమోని బాబు, సురమోని నాగేష్, వీరా ప్రవీణ్, భాస్కర్ రెడ్డి, దీపక్ తదితరులు పాల్గొన్నారు. ఆలయ ప్రాంగణం మొత్తం భక్తులతో కిటకిటలాడింది. డప్పు చప్పుళ్లు, భక్తి గీతాలతో వాతావరణం ఆధ్యాత్మికంగా మారింది. కాలనీవాసులు, ఇబ్రహీంపట్నం పట్టణ ప్రజలు పెద్ద సంఖ్యలో హాజరై అమ్మవారికి బోనాలు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

# పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి పెద్దపీట

## సూర్యాపేట కొత్త మాస్టర్‌ప్లాన్‌కు ఆమోదం




విశ్వంభర, సూర్యాపేట: పట్టణ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ మొరిశెట్టి నివేదిత లక్ష్మాధి అన్నారు. మంగళవారం మున్సిపల్ కార్యాలయంలో జరిగిన జనరల్ బాడీ సమావేశానికి ఆమె అధ్యక్షత వహించారు. పట్టణ తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం కోసం దోసపహాడ్ ప్రాజెక్టు పునరుద్ధరణకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని నిర్ణయించారు. మిషన్ భగీరథ సరఫరాలో అంతరాయాలను సరిచేసి, అవసరమైన ప్రాంతాల్లో ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలని అధికారులకు సూచించారు. పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమానికి సంబంధించి కీలక నిర్ణయాలు తీసుకున్నారు. కార్మికులకు ఏటా అందించే సబ్బులు, దుస్తులు, కొబ్బరి నూనె తదితర సంక్షేమ సామగ్రి పంపిణీకి కౌన్సిల్ ఆమోదం తెలిపింది. అలాగే నాలుగేళ్ల తొమ్మిది నెలలుగా పెండింగ్‌లో ఉన్న 120 మంది కార్మికుల పీఎఫ్ మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయాలని నిర్ణయించారు. పట్టణ సమగ్ర అభివృద్ధి కోసం రూపొందించిన కొత్త మాస్టర్‌ప్లాన్‌కు కౌన్సిల్ ఆమోదం తెలిపింది. జాతీయ రహదారి-65 కింద ఉన్న 60 అడుగుల రోడ్డు నుంచి కలెక్టరేట్ వరకు అనుసంధాన రహదారి ఏర్పాటుకు రాష్ట్ర మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డిని కలిసి ప్రతిపాదనలు అందించాలని నిర్ణయించారు. అండర్‌గ్రౌండ్ డ్రైనేజీ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. సమావేశంలో కౌన్సిలర్లు పట్టణంలోని తాగునీరు, రోడ్లు, లీకేజీలు, ట్రాఫిక్ తదితర సమస్యలను ప్రస్తావించారు. ప్రజాప్రతినిధులు ఫోన్ ద్వారా తెలిపే సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని మున్సిపల్ కమిషనర్ హన్మంతరెడ్డి ఆదేశించారు. సమావేశంలో వైస్ చైర్‌పర్సన్ ఎండీ షఫీఉల్లా, ఫ్లోర్ లీడర్లు, కౌన్సిలర్లు, అధికారులు పాల్గొన్నారు.

# పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజలకు అండగా ఉంటా

## ప్రవీణ్ గౌడ్

విశ్వంభర, ఇబ్రహీంపట్నం: ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలోని కొంగర కలాన్ ఎస్సీ వార్డులో గత కొంతకాలంగా బోరు ఎండిపోవడంతో తాగునీటి కోసం ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ విషయం ఆదిభట్ల మాజీ మున్సిపల్ చైర్మన్ కొత్త ప్రవీణ్ గౌడ్ దృష్టికి రావడంతో స్పందించి, సొంత ఖర్చులతో నూతన బోరు వేయించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ గౌడ్ మాట్లాడుతూ "పదవిలో ఉన్నా.. లేకున్నా ప్రజలకు ఎల్లప్పుడూ అండగా ఉంటా" అని తెలిపారు. ప్రజా సమస్యలు తన దృష్టికి వస్తే తక్షణమే స్పందించి పరిష్కరించడం తన బాధ్యతగా భావిస్తానన్నారు. నూతన బోరు ఏర్పాటు చేయడంతో కాలనీ ప్రజలు హర్షం వ్యక్తం చేసి ప్రవీణ్ గౌడ్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ శేఖర్, లక్ష్మీపతి గౌడ్, చెన్నగల్ల నర్సింహ, హరి శంకర్, నర్సగల్ల జంగయ్య, రమేష్, దండిగ రాజు, చింటు యాదవ్, విజయ్ తో పాటు కాలనీ ప్రజలు పాల్గొన్నారు.

## బీఆర్ఎస్ పార్టీ దళిత వ్యతిరేకి

# ఎమ్మెల్సీ తాతా మధు దిష్టిబొమ్మ దగ్ధం



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధును తక్షణమే సస్పెండ్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ ఇబ్రహీంపట్నం అంబేద్కర్ చౌరస్తాలో కాంగ్రెస్ పార్టీ నిరసన తెలిపింది. తాతా మధు దిష్టిబొమ్మను దగ్ధం చేసి చావు డప్పు కొట్టారు. కాంగ్రెస్ రాష్ట్ర దళిత విభాగం పిలుపు మేరకు, ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి ఆదేశాలతో ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కొంకని విజయ్ మాదిగ ఆధ్వర్యంలో ఈ నిరసన జరిగింది. గడ్డి అన్నారం మార్కెట్ కమిటీ చైర్మన్ చిలుక మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ... "అధికారం కోల్పోయామనే అక్కసుతో దళితుల పట్ల బీఆర్ఎస్ సంస్కారహీనంగా ప్రవర్తిస్తోంది. ఇది బీఆర్ఎస్ దళిత వ్యతిరేక వైఖరికి నిదర్శనం" అని అన్నారు.రాజ్యాంగం కల్పించిన అత్యున్నత పవిత్ర పీఠంపై ఉన్న దళిత బిడ్డ, స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ పై దొరల గడీల బానిస ఎమ్మెల్సీ తాతా మధు ఇష్టానుసారంగా నోరుపారేసుకోవడం దుర్మార్గమన్నారు. స్పీకర్ తల్లిని అవమానించేలా మాట్లాడటం 4 కోట్ల ప్రజల ఆత్మగౌరవానికి జరిగిన అవమానమని, తెలంగాణ చరిత్రలో ఇది చీకటి రోజు అని పేర్కొన్నారు. భారతదేశ చరిత్రలో ఏ చట్టసభలోనూ ఇలాంటి హేయమైన సంఘటన జరగలేదన్నారు. సభా మర్యాదను కించపరిచిన సభ్యుడిని వెంటనే అనర్హుడిగా ప్రకటించాలని, ప్రతిపక్ష నేత కేసీఆర్ క్షమాపణ చెప్పి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షులు క్యారగారి శ్రీధర్, రాష్ట్ర నాయకులు కొత్తకురుమ శివకుమార్, రాచర్ల వెంకటేశ్వర్లు, మంకాల దాసు, కొంగర విష్ణువర్ధన్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు గౌస్ పాషా, సింగల్ విండో చైర్మన్ హన్మంత్ రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి మంగమ్మ, కౌన్సిలర్లు భాను బాబు, రాఘవేందర్, భార్గవి రాజు, రామ్ దాస్ నాయక్, మహేష్ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలి

## దొంతం చంద్రశేఖర్‌రెడ్డి



విశ్వంభర, చింతపల్లి: బీఆర్ఎస్ పార్టీ అధినేత, తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) ఫామ్‌హౌస్‌పై కాంగ్రెస్ నాయకులు దాడికి యత్నించిన ఘటనను ఖండిస్తూ చింతపల్లి మండల బీఆర్ఎస్ పార్టీ మాజీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి చింతపల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో రాజకీయ విభేదాలు సహజమేనని, అయితే రాజకీయ భేదాలను వ్యక్తిగత దాడులకు, నాయకుల నివాసాలపై దాడులకు దారితీయడం అప్రజాస్వామికమని అన్నారు. ఇలాంటి చర్యలను బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తుందని తెలిపారు. రాష్ట్రంలో రాజకీయ కక్ష సాధింపు చర్యలకు స్వస్తి పలికి శాంతిభద్రతలను పరిరక్షించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. కేసీఆర్ ఫామ్‌హౌస్ వద్ద జరిగిన ఘటనపై సమగ్ర విచారణ జరిపి, బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. అలాగే కేసీఆర్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసిన షాద్‌నగర్ ఎమ్మెల్యే కె.శంకరయ్యపై చర్యలు తీసుకోవాలని చంద్రశేఖర్‌రెడ్డి డిమాండ్ చేశారు. బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలపై దాడులు జరిగితే పార్టీ తరపున చట్టపరంగా పోరాడుతామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ ప్రచార కార్యదర్శి వింజమూరి రవి, ధేన్యతండ గ్రామ సర్పంచ్ రమావత్ కొండల్ నాయక్, సిమర్ల శ్రీను యాదవ్, దండేటికార్ ప్రసాద్, దాస్ నాయక్, వింజమూరి అబ్బయ్య, నల్ల శంకర్, చందర్ నాయక్, ధన్‌రాజ్, ఆరెకంటి జంగయ్య, వింజమూరి లక్ష్మయ్య, వింజమూరి కళ్యాణ్, నర్సింహా, వింజమూరి శంకర్‌తో పాటు పలువురు బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తుర్కపల్లిలో కేసీఆర్‌కు 'చావు డప్పు' పేరుతో ధర్నా



విశ్వంభర, భువనగిరి: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ పాలనను నిరసిస్తూ కాంగ్రెస్ ఆధ్వర్యంలో తుర్కపల్లి చౌరస్తాలో 'చావు డప్పు' పేరుతో ధర్నా నిర్వహించారు. ప్రభుత్వ విప్, ఆలేరు ఎమ్మెల్యే బీర్ల అయిలయ్య, నకిరేకల్ ఎమ్మెల్యే వేముల వీరేశం, భువనగిరి ఎమ్మెల్యే కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ శ్రేణులు రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. ధర్నా అనంతరం ఎమ్మెల్యేలు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా ర్యాలీగా ఎర్రవెల్లిలోని మాజీ సీఎం కేసీఆర్ ఫామ్‌హౌస్ ముట్టడికి బయలుదేరారు. కార్యక్రమంలో పెద్ద సంఖ్యలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి చేసిన వారిని వెంటనే అరెస్ట్ చేయాలి

## పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేత మంద సంజీవరెడ్డి ఆగ్రహం



విశ్వంభర, బోడుప్పల్: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుపల్ సర్కిల్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షుడు మంద సంజీవరెడ్డిని హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మీడియా ముఖంగా మాట్లాడుతూ ..తెలంగాణ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు దిష్టిబొమ్మను దహనం చేయడం, బోడుప్పల్ బీఆర్ఎస్ పార్టీ కార్యాలయం పై దాడి చేసిన కాంగ్రెస్ గుండాలపై తక్షణమే కఠిన చర్యలు తీసుకోవాలని అధ్యక్షుడు, మాజీ జెడ్పీటీసీ మంద సంజీవరెడ్డి మేడిపల్లి పోలీసులను డిమాండ్ చేశారు.తనను హౌస్ అరెస్టు చేసి పోలీసులు కాంగ్రెస్ ప్రభుత్వానికి సహకరిస్తున్నారని, తాము చేస్తున్న శాంతియుత నిరసన కూడా తెలపకుండా అడ్డుకోవడం, హౌస్ అరెస్టు చేయడం ఎంతవరకు కరెక్ట్ అని ప్రశ్నించారు. రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ నాయకులు శాంతియుతంగా నిరసనలు చేపడుతున్న సమయంలో పోలీసులు తమ పార్టీ నాయకులను హౌస్ అరెస్టులు చేసి నిర్బంధిస్తున్నారని ఆరోపించారు.అదే సమయంలో కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం చేయడం, బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి జరిగిన ఘటనల్లో పోలీసులు చూసి చూడనట్టుగా వ్యవహరించడం కాంగ్రెస్ నిరంకుశ పాలనకి నిదర్శనం అన్నారు. కాంగ్రెస్ నాయకులపై ఎందుకు చర్యలు తీసుకోవడం లేదు, బీఆర్ఎస్ కార్యాలయంపై దాడి, కేసీఆర్ దిష్టిబొమ్మ దహనానికి సంబంధించిన ఆధారాలు, సమాచారాన్ని మేడిపల్లి సీఐకి అందించినట్లు సంజీవరెడ్డి తెలిపారు. ఘటనల్లో పాల్గొన్న వారిని గుర్తించి చట్టప్రకారం వెంటనే చర్యలు తీసుకోవాలని పోలీసులను కోరారు. పోలీసులు రాజకీయ ఒత్తిళ్లకు అతీతంగా వ్యవహరించి, అందరికీ సమానంగా చట్టాన్ని అమలు చేయాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి మీసాల కృష్ణ, మాజీ మేయర్ సామల బుచ్చిరెడ్డి, సీనియర్ నాయకులు రామచంద్రారెడ్డి, కొత్త చక్రపాణి గౌడ్, బందారం శ్రీధర్ గౌడ్, కృష్ణ గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

# ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న కాంగ్రెస్

## పోలీసు బలంతో ప్రజల గొంతు నొక్కేస్తుంది

## 420 హామీలు అమలు చేసేలా చూడాలంటూ అంబేద్కర్ విగ్రహానికి బీఆర్ఎస్ శ్రేణుల వినతి




విశ్వంభర, సూర్యాపేట: తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయకుండా హామీల అమలును ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులను పోలీసు బలంతో నొక్కేయిస్తూ ప్రజాస్వామ్యాన్ని ఖూని చేస్తూ రాజ్యాంగ హక్కులను కాల రాస్తుందని మాజీ రాజ్యసభ సభ్యులు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షులు బడుగుల లింగయ్యయాదవ్, బీఆర్ఎస్ రాష్ట్ర కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, మాజీ జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ నిమ్మల శ్రీనివాస్, మాజీ మున్సిపల్ చైర్పర్సన్ పెరుమాళ్ళ అన్నపూర్ణ లు అన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల పాలనపై బీఆర్ఎస్ చేపట్టిన నిరసన కార్యక్రమాల్లో భాగంగా చివరి రోజు మంగలవారం సూర్యాపేట జిల్లా కేంద్రంలోని ఖమ్మం క్రాస్ రోడ్లోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. ప్రజలకు ఇచ్చిన హామీలు అమలు చేయమంటే సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం ఎదురుదాడికి దిగుతుందన్నారు.రాష్ట్రంలో రైతులు, విద్యార్థులు, మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలపై ప్రతిపక్షం ప్రశ్నిస్తే పోలీసులతో అణిచివేయడం కాంగ్రెస్ ప్రభుత్వ నిరంకుశ త్వానికి నిదర్శనమన్నారు. గత వారం రోజులుగా బీఆర్ఎస్ ప్రజా సమస్యలపై, కాంగ్రెస్ ఇచ్చి హామీలపై ప్రజాస్వామ్య పద్ధతిలో కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రశ్నిస్తుంటే అసెంబ్లీలో టీఆర్ఎస ఎమ్మెల్యేలపై ముఖ్యంగా మహిళా ఎమ్మెల్యేలపై దురుసుగా వ్యవహరిం చడం కాంగ్రెస్ ప్రభుత్వ దిగజారుడు తనమన్నారు. తెలంగాణాలో కాంగ్రెస్ ప్రభుత్వం అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్య విలువలను తుంగలో తొక్కుతుందన్నారు. ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఉపయోగించాల్సిన అధికార యంత్రాంగాన్ని ప్రతిపక్షాలను అణిచివేసేందుకు ఉపయోగిస్తుందన్నారు. నిరసన తెలిపే హక్కు ఇస్తామన్న కాంగ్రెస్ నేడు నిరసన తెలిపే హక్కును హరించి ప్రజాస్వా మ్యాన్ని మోసం చేసిందన్నారు. రాజ్యాంగాన్ని అడ్డం పెట్టుకొని అధికారంలోకి వచ్చి రాజ్యంగ స్ఫూర్తిని తుంగలో తొక్కుతున్న కాంగ్రెస్కు బుద్ధి చెప్పాలని ప్రజాస్వామ్య విలువల పాఠం చెప్పాలని అంబేద్కరు విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ అంగిరేకుల నాగార్జున, మాజీ జడ్పీటీసీ జీడి భిక్షం, మాజీ ఎంపీపీ నెమ్మాది బిక్షం, జిల్లా నాయకులు ఉప్పల ఆనంద్, బందారు రాజా, పట్టణ పార్టీ అధ్యక్ష, కార్యదర్శులు సవరాల సత్యనారాయణ, బూర బాలసైదులు, మండలాల అధ్యక్షులు తూడి నర్సింహ్మారావు, వంగాల శ్రీ నివాస్డి, దొంగరి యుగంధర్, జూలకంటి జీవన్రెడ్డి, నాయకులు ఆకుల లవకుశ, ముదిరెడ్డి సంతోష్రెడ్డి, ముదిరెడ్డి అనిల్ రెడ్డిలతో పాటు ప్రజా ప్రతినిదులు, తదితరులు పాల్గొన్నారు.

# రైస్ మిల్లర్ల సమస్యలు పరిష్కరించాలి




విశ్వంభర, ముషీరాబాద్ : రైస్ మిల్లర్ల దీర్ఘకాలిక సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని రైస్ మిల్లర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ డిమాండ్ చేసింది. సీఎంఆర్ ఒప్పందాలను న్యాయబద్ధంగా రూపొందించి, ధాన్యం రకం, నాణ్యత ఆధారంగా బియ్యం దిగుబడి నిష్పత్తిని నిర్ణయించాలని కోరింది. హైదరాబాదు ఇందిరా పార్క్ ధర్నాచౌక్‌లో మంగళవారం అసోసియేషన్ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించారు. తెలంగాణ ఉద్యమకారుడు, సామాజిక కార్యకర్త సయ్యద్ రఫీ మాట్లాడుతూ రైస్ మిల్లింగ్ రంగం రైతులు, కార్మికుల ప్రయోజనాలతో ముడిపడి ఉందన్నారు. మిల్లర్లపై ఆకస్మిక తనిఖీలు, దాడులను నిలిపివేసి సమస్యలను చర్చల ద్వారా పరిష్కరించాలని కోరారు. అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు పాడి గణపతిరెడ్డి మాట్లాడుతూ 2014 నుంచి పెండింగ్‌లో ఉన్న మిల్లింగ్, రవాణా, డ్రైయేజ్ తదితర బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. క్వింటాల్‌కు మిల్లింగ్ ఛార్జీ రూ.150గా నిర్ణయించాలని, 25 శాతం జరిమానా, 12 శాతం వడ్డీని మాఫీ చేయాలని కోరారు. మిల్లింగ్ రంగానికి అనుకూలమైన విధానాలను అమలు చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వం సమస్యలను పరిష్కరించకపోతే సెప్టెంబరు 11 నుంచి రాష్ట్రవ్యాప్తంగా రైస్ మిల్లులను బంద్ చేస్తామని అసోసియేషన్ ప్రకటించింది. ఈ కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి ఉట్కూరు వీరేశం, కోశాధికారి విశ్వనాథం వెంకటరమణ, మల్లేశం, సత్యనారాయణ, బుచ్చి రామ్,నాగరాజు, కిష్టయ్యతో పాటు వివిధ జిల్లాల రైస్ మిల్లర్లు పాల్గొన్నారు.

# వినాయక నిమజ్జనోత్సవాలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించాలి

: జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్



విశ్వంభర, మహబూబాబాద్: జిల్లాలో వినాయక చవితి వేడుకలను అత్యంత వైభవంగా, ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అన్ని శాఖల అధికారులు పటిష్టమైన చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ స్నేహ శబరిష్ జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ తో కలిసి, వినాయక నిమజ్జన వేడుకలపై రెవెన్యూ, మున్సిపల్, విద్యుత్, పోలీస్ తదితర శాఖల ఉన్నతాధికారులతో నిమజ్జన ఏర్పాట్లపై సమగ్ర సమీక్షా సమావేశం నిర్వహించి, కీలక దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో శోభాయాత్ర సాగే ప్రధాన మార్గాల్లో, నిమజ్జన ఘాట్ల వద్ద పోలీస్ శాఖ పటిష్టమైన పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయాలన్నారు. సమస్యాత్మక ప్రాంతాల్లో అదనపు బలగాలను మోహరించి, సీసీటీవీ కెమెరాలు, డ్రోన్ల ద్వారా నిరంతర నిఘా ఉంచాలన్నారు. ట్రాఫిక్ సమస్యలు తలెత్తకుండా ముందస్తుగా రూట్ డైవర్షన్ ప్రణాళికలు అమలు చేయాలన్నారు. విగ్రహాల ఊరేగింపు మార్గాల్లో రోడ్ల మరమ్మతులు, గుంతల పూడ్చివేత పనులను వెంటనే పూర్తి చేయాలన్నారు. నిమజ్జనం పూర్తయిన వెంటనే వ్యర్థాలను తొలగించేందుకు పారిశుధ్య కార్మికులను షిఫ్టుల వారీగా నియమించాలి. ఊరేగింపు మార్గాల్లో వేలాడుతున్న విద్యుత్ తీగలను సంబంధిత శాఖల వారు సరిచేసి, ఎత్తు పెంచాలన్నారు. విద్యుత్ సరఫరాలో అంతరాయం కలగకుండా నిరంతర విద్యుత్‌తో పాటు ఘాట్ల వద్ద అదనపు జనరేటర్లు, హైమాస్ట్ లైట్లను సిద్ధంగా ఉంచాలన్నారు. విగ్రహాల నిమజ్జనానికి ఇబ్బంది కలగకుండా, క్రేన్లు సులభంగా నిలిచేందుకు మరియు విగ్రహాలు నీటిలో సరిగ్గా మునిగేందుకు నిమజ్జన పాయింట్ల వద్ద పూడిక తీత పనులు చేపట్టాలని అన్నారు. ఇరిగేషన్ అధికారులు నిమజ్జనం జరిగే చెరువులు, జలాశయాలు లేదా కాలువల్లో తగినంత నీటి మట్టం ఉందో లేదో పర్యవేక్షించి మండల అధికారులను సమన్వయం చేసుకొని నివేదికలు అందజేయాలని అన్నారు. ప్రమాదాలు జరగకుండా ఘాట్ల వద్ద బలమైన బారికేడింగ్, గజ ఈతగాళ్లు, బోట్లు, లైఫ్ జాకెట్లతో కూడిన ప్రత్యేక రెస్క్యూ టీమ్‌లను మోహరించాలన్నారు. అగ్నిమాపక శకటాలను (ఫైర్ ఇంజిన్లు) ఎల్లవేళలా అందుబాటులో ఉంచాలన్నారు. మండప నిర్వాహకులు, ప్రజలు అధికారులకు సహకరించి, పర్యావరణ పరిరక్షణను దృష్టిలో ఉంచుకుని నిబంధనలకు అనుగుణంగా నిమజ్జనం పూర్తి చేయాలని అన్నారు. మండల స్థాయిలో తహసీల్దార్లు పంచాయతీ కార్యదర్శులు, గణేశ్ ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశాలు నిర్వహించి అవసరమైన ఏర్పాట్లపై కార్యాచరణ రూపొందించాలన్నారు. అన్ని శాఖల అధికారులు తమకు అప్పగించిన బాధ్యతలను సమర్థవంతంగా నిర్వర్తించి వినాయక చవితి ఉత్సవాలను విజయవంతం చేయాలని ఆదేశించారు. నిమజ్జనం పూర్తయిన తరువాత ఘాట్ల వద్ద, ప్రధాన రహదారులపై మున్సిపల్ మరియు పంచాయతీ సిబ్బంది సహాయంతో మట్టి, వ్యర్థాలు, పూజా సామగ్రిని తొలగించి శుభ్రపరిచే చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ డాక్టర్ శబరిష్ మాట్లాడుతూ వినాయక మండపాల నిర్వాహకులు పోలీస్ శాఖ వెబ్‌సైట్‌లో పూర్తి వివరాలను నమోదు చేసి అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోలేని వారు సంబంధిత పోలీస్‌స్టేషన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. అనుమతులు పొందిన తర్వాతే మండపాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యు అదనపు కలెక్టర్ కె.అనిల్ కుమార్, ఇంచార్జ్ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ పురుషోత్తం, డి.ఆర్.ఓ. నాగావాణి, డి.ఆర్.డి.ఓ మధుసూధనరాజు, మహబూబా బాద్, తొర్రూరు ఆర్డీఓ లు రాజేశ్వరీ, గణేష్ ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నితీష్ కుమార్, మున్సిపల్ కమిషనర్లు, తహసిల్దార్లు మరియు వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## మాదకద్రవ్యాల పై అవగాహన సదస్సు




విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ సాంస్కృతిక సారథి, ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు మాదకద్రవ్యాల (డ్రగ్స్) దుష్పరిణామాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపాల్ జగదీష్ అధ్యక్షత వహించి, విద్యార్థులను ఉద్దేశించి ప్రసంగించారు. మాదకద్రవ్యాలు యువత జీవితాలను ఎలా నాశనం చేస్తున్నాయో ఆయన వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉంటూ, చదువుపై దృష్టి పెట్టాలని పిలుపునిచ్చారు. ఈ సదస్సులో తెలంగాణ సాంస్కృతిక సారథి కళాకారులు సాంస్కృతిక కార్యక్రమాలు, పాటల ద్వారా డ్రగ్స్ వల్ల కలిగే అనర్థాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ స్వచ్ఛంద కార్యకర్తలు, అధ్యాపక బృందం, విద్యార్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## శోభనాద్రిపురం పాఠశాలలో విద్యార్థులకు కరాటే శిక్షణ



విశ్వంభర, రామన్నపేట: యాదాద్రి భువనగిరి జిల్లా, రామన్నపేట మండలం, శోభనాద్రిపురం గ్రామంలోని ప్రభుత్వ మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాల, ఫూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు కరాటే శిక్షణను పునఃప్రారంభించారు. విద్యార్థుల్లో ఆత్మ రక్షణ నైపుణ్యాలతో పాటు క్రమశిక్షణ, ఏకాగ్రత, ధైర్యం, ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించడమే ఈ శిక్షణ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని నిర్వాహకులు తెలిపారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ కంచి మధుసూదన్ ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులను ప్రోత్సహించారు. కరాటే సీనియర్ మాస్టర్ చెన్నకేశవర్, ఇన్స్ట్రక్టర్ తెల్లాప్రసాద్ ఆధ్వర్యంలో విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఫూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ సభ్యులు ఏటెల్లి పరమేష్ తదితరులు పాల్గొన్నారు. విద్యార్థులకు ఆత్మరక్షణ విద్యను అందించడం ద్వారా వారిలో ధైర్యం, క్రమశిక్షణ పెంపొందించడంతో పాటు, ఆరోగ్యకరమైన జీవనశైలిపై అవగాహన కల్పించేందుకు ఈ శిక్షణ కార్యక్రమాన్ని కొనసాగిస్తామని ఫూలే అంబేద్కర్ స్టడీ సర్కిల్ ఫౌండర్, కార్యక్రమ నిర్వాహకులు ఎర్ర నరేష్ తెలిపారు.

# కాంగ్రెస్ పాలనలో ఆగిపోయిన అభివృద్ధి

: అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించిన మంచిరెడ్డి కిషన్ రెడ్డి



విశ్వంభర, ఇబ్రహీంపట్నం: 100 రోజుల్లో 420 హామీలు అమలు చేస్తామని చెప్పి, అధికారంలోకి వచ్చి 1000 రోజులు గడుస్తున్నా హామీలను పూర్తిస్థాయిలో అమలు చేయని కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి నిరసనగా బీఆర్ఎస్ పార్టీ చేపట్టిన పోరుబాట కార్యక్రమంలో భాగంగా తుర్కయాంజల్ మున్సిపల్ కేంద్రంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. మున్సిపల్ కేంద్రంలోని బాబాసాహెబ్ అంబేద్కర్, బాబు జగ్జీవన్ రామ్ చౌరస్తాలో రంగారెడ్డి జిల్లా బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు మంచిరెడ్డి కిషన్ రెడ్డి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో తెలంగాణ రాష్ట్రంలో జరుగుతున్న అరాచకాలు, ఇబ్రహీంపట్నం నియోజకవర్గంలో ఆగిపోయిన అభివృద్ధి పనులకు సంబంధించిన వివరాలతో కూడిన వినతిపత్రాలను అంబేద్కర్, జగ్జీవన్ రామ్ విగ్రహాలకు సమర్పించారు. కనీసం ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి, మిగిలిన 800 రోజుల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి, అభివృద్ధి చేసేలా ఆ ప్రభుత్వ నేతలకు బుద్ధి, జ్ఞానం కలగాలని ఆయన ఆకాంక్షించారు. అనంతరం చౌరస్తాలో సమావేశం నిర్వహించి, ప్రెస్ మీట్ లో మాట్లాడారు. ఈ సందర్భంగా ఇబ్రహీం పట్నం ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డిపై మంచిరెడ్డి కిషన్ రెడ్డి తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో శంకుస్థాపన చేసిన అభివృద్ధి పనులకు ఈ ఎమ్మెల్యే రిబ్బన్లు కట్ చేస్తూ ప్రారంభోత్సవాలకే పరిమితమయ్యారని, అందుకే ఆయనను "రిబ్బన్ కటింగ్ ఎమ్మెల్యే" అని పిలుస్తున్నారని ఎద్దేవా చేశారు. కలియుగ దైవమైన వెంకటేశ్వర స్వామి పేరు పక్కన మీ కుటుంబసభ్యుల పేర్లు పెట్టడం ఏంటని ప్రశ్నించారు. నియోజక వర్గంలో ఏ చిన్న అభివృద్ధి పని జరగాలన్నా ఎం ఆర్ఆర్ ట్యాక్సుల పేరుతో వసూళ్లు జరుగుతున్నాయని ఆరోపించారు. నియోజకవర్గ అభివృద్ధిని పూర్తిగా పక్కన పెట్టి తన సొంత అభివృద్ధి కోసం ఢిల్లీకి ప్రయాణాలు చేస్తున్నారని విమర్శించారు. అంతేకాకుండా "నీ కారు ఎవరి పేరు మీద ఉంది, ఆ కారును ఎందుకు కొన్ని రోజులు దాచావ్?" అంటూ సూటిగా ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో నాయకులు వంగేటి లక్ష్మారెడ్డి ,రొక్కం చంద్రశేఖర్ రెడ్డి, కొంతం సంపతీశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## శంకరయ్య కాలనీ నూతన కమిటీ అధ్యక్షుడిగా చిల్లా రమేష్



విశ్వంభర, బోడుప్పల్: మల్కాజ్గిరి మున్సిపల్ కార్పొరేషన్ బోడుప్పల్ సర్కిల్ పరిధిలోని శంకరయ్య కాలనీ నూతన కమిటీని అధ్యక్ష కార్యదర్శులను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ముఖ్య సలహాదారులుగా పి. వెంకట్‌రెడ్డి, అధ్యక్షుడిగా చిల్లా రమేష్,ఉపాధ్యక్షులుగా ఎస్.రాజేష్,బాబు రావు,రంగారెడ్డి,ప్రధాన కార్యదర్శిగా బి.రామ్‌గోపాల్,కోశాధికారిగా శశిధర్,సంయుక్త కార్యదర్శులుగా మహేందర్‌రెడ్డి, రామ్‌చందర్,సాంస్కృతిక కార్యదర్శులుగా జె.నరేందర్,బి. కిరణ్, కార్యవర్గ సభ్యులుగా భరత్,నరేందర్,పి. శ్రీనివాస్, సలహాదారులుగా బిక్షపతి, బిక్షాచారి, బాలరాములు, వెంకటయ్య, వీరాచారి, డీజీపీ శర్మ, ఫణి శర్మలను ఎన్నుకున్నారు.ఈ సంధర్భంగా చిల్లా రమేష్ మాట్లాడుతూ అధ్యక్షుడి నన్ను ఎన్నుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. కాలనీ అభివృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారం కోసం సమష్టిగా పనిచేస్తుందని సభ్యులు తెలిపారు.

## ఫీజు బకాయిలు చెల్లించే వరకు పోరాటం



విశ్వంభర, బర్కత్‌పుర : ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు రూ.8 వేల కోట్లు చెల్లించే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు, రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య తెలిపారు. ఫీజుల పథకాన్ని కొనసాగిస్తూ పాత విధానంలోనే బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర కన్వీనర్లు మోదీ రాందేవ్, నిఖిల్‌పటేల్ ఆధ్వర్యంలో మంగళవారం హైదరాబాదు బర్కత్‌పురలో విద్యార్థులతో కలిసి ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణయ్య మాట్లాడుతూ.. మూడేళ్లుగా ఫీజు బకాయిల కోసం ఆందోళనలు చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని విమర్శించారు. ఫీజుల పథకానికి తగిన బడ్జెట్ కేటాయించి పేద విద్యార్థుల చదువుకు ఆటంకం లేకుండా చూడాలని కోరారు. బకాయిల చెల్లింపుపై ప్రభుత్వం మొండి వైఖరి కొనసాగిస్తే తీవ్ర వ్యతిరేకత ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంఘం నేతలు నరేశ్‌గౌడ్, చిక్కుడు బాలయ్య, రాజు నేత, పాల్గొన్నారు.

## వలిగొండలో గ్రామసభ



విశ్వంభర, వలిగొండ: యాదాద్రి భువనగిరి జిల్లా వలిగొండ గ్రామంలో వి.బి.-జి.రామ్‌జీ అజెండాతో గ్రామసభ నిర్వహించారు. సర్పంచ్ కుంభం వెంకటపాపిరెడ్డి, మండల అధికారులు పాల్గొని గ్రామ అభివృద్ధి, ప్రజా సమస్యలు, సంక్షేమ పథకాల అమలు, పారిశుధ్యం, తాగునీ రు, రహదారులు, డ్రైనేజీ తదితర అంశాలపై చర్చించారు. గ్రామస్తులు తమ సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. అనంతరం తహశీల్దార్ దశరథ్‌నాయక్ ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియపై గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఓటరు జాబితాలో పేరు, చిరునామా తదితర వివరాలు సరిగా ఉన్నాయో పరిశీలించుకోవాలని, తప్పులు ఉంటే బీఎల్ఓలను సంప్రదించి సవరణలు చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జి.జలంధర్‌రెడ్డి, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సహదేవ్, ఏఈ కిరణ్, పంచాయతీ కార్యదర్శి షేక్ రసూల్, వార్డు సభ్యులు, పంచాయతీ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సు పోస్టర్ ఆవిష్కరణ



విశ్వంభర, మహబూబాబాద్: ఈ నెల 15న హైదరాబాద్‌లో నిర్వహించనున్న హమాలీ కార్మికుల రాష్ట్ర సదస్సు పోస్టర్‌ను మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ బట్టు అంజయ్య భవన్‌లో ఆవిష్కరించారు. హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శివారపు శ్రీధర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హమాలీ కార్మికులకు సమగ్ర చట్టం, ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. 50 ఏళ్లు నిండిన కార్మికులకు నెలకు రూ.10 వేల పెన్షన్, ఈపీఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, ఆరోగ్య సదుపాయాలు కల్పించాలని కోరారు. వ్యవసాయ మార్కెట్లలో పనిచేసే కార్మికులకు ఏటా రూ.10 వేల బోనస్, రూ.5 వేల యూనిఫాం భత్యం ఇవ్వాలని, స్థానిక కార్మికులకు ఉపాధిలో ప్రాధాన్యత కల్పించాలని డిమాండ్ చేశారు. కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను ఉపసంహరించి హమాలీ కార్మికుల హక్కులను పరిరక్షించాలని కోరారు.

## ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకారం



విశ్వంభర, పాలకుర్తి : రాయపర్తి మండల ఆర్యవైశ్య సంఘం నూతన కమిటీ ప్రమాణ స్వీకార మహోత్సవాన్ని మండల కేంద్రంలో ఘనంగా నిర్వహించారు. ఇటీవల ఎన్నికైన మండల అధ్యక్షుడు, ఉపాధ్యక్షుడు, కార్యదర్శులతో పాటు నూతన కమిటీ సభ్యులు ఈ కార్యక్రమంలో ప్రమాణ స్వీకారం చేశారు.ఈ కార్యక్రమానికి ఆర్యవైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు దుబ్బ శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు గౌరవ అతిథులుగా పాల్గొన్నారు. నూతన కమిటీ సభ్యులను ఈ సందర్భంగా ఎమ్మెల్యే అభినందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తూ ప్రజలకు అండగా నిలుస్తున్న సంఘం సభ్యులను అభినందించారు. సమాజ సేవలో ఆర్యవైశ్య సంఘం మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు. రాయపర్తి మండల ఆర్యవైశ్య సంఘం నూతన అధ్యక్షుడిగా పుల్లూరు దామోదర్, ఉపాధ్యక్షుడిగా ఉకల్ గ్రామానికి చెందిన తేరాల మధు ఎన్నికయ్యారు. నూతన కమిటీ ప్రమాణ స్వీకార కార్యక్రమంలో వారు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తేరాల మధు మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం తరఫున అందుబాటులోకి వచ్చే నిధులను మండలంలోని ప్రతి గ్రామంలోని ఆర్యవైశ్య కుటుంబాలకు ఉపయోగపడేలా ప్రణాళికాబద్ధంగా వినియోగిస్తామని తెలిపారు. సంఘ సభ్యుల సంక్షేమంతో పాటు సామాజిక సేవా కార్యక్రమాలకు ప్రాధాన్యం ఇస్తామని పేర్కొన్నారు. నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా పలువురు సంఘ నాయకులు, సభ్యులు వారికి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వివిధ గ్రామాలకు చెందిన ఆర్యవైశ్య కుటుంబాలు పాల్గొన్నాయి.

## నూతన ఎస్ఐ కు సన్మానం



విశ్వంభర, ఇనుగుర్తి: మహబూబాబాద్ జిల్లా ఇనుగుర్తి మండల నూతన ఎస్సై పి.నరేష్ ను మండలంలోని లక్ష్మీపురం గ్రామానికి చెందిన మాజీ వార్డు సభ్యులు బిఆర్ఎస్ సీనియర్ నాయకుడు చిర్రగోని కిరణ్ గౌడ్ మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛం అందజేసి శాలువాతో సన్మానించారు. శుభాభినందనలు తెలిపారు. ఎస్సై నరేష్ విధి నిర్వహణలో ఇనుగుర్తి మండలం మరింత శాంతియుతంగా ఉండాలని, డ్రగ్స్ వంటి మారకద్రవ్యాలు రహిత మండలం గా రూపొందాలని ఆకాంక్షించారు. పోలీసు శాఖకు తాము నిరంతరం సహకరిస్తామని తెలిపారు.

## సీఎం, కాంగ్రెస్ ఎమ్మెల్యేల దిష్టి బొమ్మలు దహనం

విశ్వంభర, ఎల్లారెడ్డిపేట: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్ల శంకర్, వేముల వీరేశం వ్యాఖ్యలను బీఆర్ఎస్ యూత్‌వింగ్ నాయకులు తీవ్రంగా ఖండిచారు. గులాబీ అధినేతపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో సాయంత్రం మెరుపు ధర్నాకు దిగారు. సాయంత్రం 5 గంటలకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యేల చిత్రపటాలతో కూడిన దిష్టి బొమ్మను పాత బస్టాండులో కాసేపు ఉంచి.. కాంగ్రెస్ నాయకులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వీరిని గమనించిన పోలీసులు పరుగెత్తుకుని వచ్చేలోపు సీఎం, ఎమ్మెల్యేల దిష్టిబొమ్మను దహనం చేశారు. ఎల్లారెడ్డిపేట, సెప్టెంబర్ 8: మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌పై సీఎం రేవంత్ రెడ్డి, ఎమ్మెల్యేలు వీర్ల శంకర్, వేముల వీరేశం వ్యాఖ్యలను బీఆర్ఎస్ యూత్‌వింగ్ నాయకులు తీవ్రంగా ఖండిచారు. గులాబీ అధినేతపై అనుచిత వ్యాఖ్యలకు నిరసనగా మండల కేంద్రంలో సాయంత్రం మెరుపు ధర్నాకు దిగారు.

## నెల్లికుదురు జిజెసిలో యాంటీ డ్రగ్స్ పై అవగాహన



విశ్వంభర, నెల్లికుదురు: మండల కేంద్రం నెల్లికుదురు ప్రభుత్వ జూనియర్ కళాశాలలో యాంటీ డ్రగ్స్ పై మంగళవారం విద్యార్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. దీనికి ప్రిన్సిపాల్ కె.వీరస్వామి, స్థానిక పోలీస్ స్టేషన్ హెడ్ కానిస్టేబుల్ ఎన్.శ్రీనివాసరావు హాజరై డ్రగ్స్ వంటి మాదకద్రవ్యాల జోలికి వెళ్ళొద్దని, అవి ఒక్కసారి వాడినట్లయితే బానిసలవుతారని దీనితో, ఆరోగ్యం పాడవడంతోపాటు కుటుంబాలు చిద్రమవుతాయని హెచ్చరించారు. తల్లిదండ్రుల ఆశయాలకు అనుగుణంగా విద్యాభ్యాసం చేసి ఉన్నత శిఖరాలకు ఎదగాలని సూచించారు. మాదకద్రవ్యాలు ఎవరైనా వాడినా విక్రయించిన వెంటనే సమాచారం అందించాలని కోరారు.ఈ కార్యక్రమంలో స్టూడెంట్ కౌన్సిలర్ డా. ఎ.సుధాకర్, కళాశాల ఎన్ఎస్ఎస్ 2 ప్రోగ్రాం ఆఫీసర్ పి వెంకటేశ్వర్లు అధ్యాపక బృందం,శ్రీనివాస్, ప్రకాశ్ బాబు,కవిరాజు, యాకన్న, బాబు , రాంమూర్తి, మహేందర్ , రఘురాం , సుభాష్ మరియు అధ్యాపకేతర బృందం ప్రదీప్, శ్రావణ్ , లక్ష్మణ్ ,గౌరీ శంకర్ విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి కరాటే పోటీల్లో గోదావరిఖని విద్యార్థుల ప్రతిభ

విశ్వంభర, కోల్ సిటీ : కర్నూలులో జరిగిన 13వ జీకేఎంఎస్ జాతీయ స్థాయి కరాటే చాంపియన్ షిప్-2026 పోటీల్లో గోదావరిఖనికి చెందిన డ్రాగన్ షాటోకాన్ కరాటే క్లబ్ విద్యార్థులు విజేతలుగా నిలిచారు. దేశంలోని వివిధ రాష్ట్రాల నుంచి సుమారు 3155 మంది కరాటే విద్యార్థులు పాల్గొన్న ఈ పోటీల్లో గోదావరిఖని నుంచి కటాస్, కుమితే విభాగాల్లో సత్తా చాటారు. బ్లాక్ బెల్ట్ కటాస్ విభాగంలో టీ.జయ సాయిచరణ్, సహస్రలు స్వర్ణ పతకాలు సాధించగా, స్పందన, వశికర్, సాయి రోషన్, ప్రణీత్, అశ్విత్ రెడ్డిలు రజత, కాంస్య పతకాలు సాధించారు.

## గడ్డమల్లయ్యగూడకు బీఆర్ఆర్ ఫౌండేషన్ చేయూత




విశ్వంభర, ఇబ్రహీంపట్నం: యాచారం మండలం గడ్డమల్లయ్యగూడ గ్రామానికి బీఆర్ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో సేవా కార్యక్రమం నిర్వహించారు. ఫౌండేషన్ చైర్మన్ బూడిద రాంరెడ్డి గ్రామ పంచాయతీకి 40 కుర్చీలను అందజేశారు. గ్రామంలో జరిగే గ్రామసభలు, వివిధ సమావేశాలు, సాంస్కృతిక కార్యక్రమాలకు ఈ కుర్చీలు ఎంతో ఉపయోగపడతాయని గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ప్రజా సేవే తమ ఫౌండేషన్ లక్ష్యమని, గ్రామాల అభివృద్ధికి తమ వంతు సహకారం అందిస్తామని బూడిద రాంరెడ్డి తెలిపారు. సేవా ప్రస్థానంలో భాగంగా భవిష్యత్తులో మరిన్ని సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అర్చన జంగయ్య మంగమ్మ, ఉప సర్పంచ్ గౌర లక్ష్మణ్, వార్డు సభ్యులు, గ్రామ పెద్దలు, యువకులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గ్రామానికి అండగా నిలిచిన రాంరెడ్డి గారికి వారు ప్రత్యేకంగా హృదయపూర్వక ధన్యవాదాలు, కృతజ్ఞతలు తెలిపారు.

## ఆశాలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలి




విశ్వంభర, ముషీరాబాద్ : అసెంబ్లీ సమావేశాల్లో ఆశా వర్కర్లకు నెలకు రూ.18 వేల ఫిక్స్‌డ్ వేతనం నిర్ణయించి, పీఎఫ్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) డిమాండ్ చేసింది. డిమాండ్లు పరిష్కరించకపోతే నిరవధిక సమ్మె చేపడతామని హెచ్చరించింది. మంగళవారం వేలాది మంది ఆశా వర్కర్లు చలో హైదరాబాదు కార్యక్రమంతో దోమలగూడ నుంచి ర్యాలీగా బయలుదేరి ఇందిరాపార్క్ సిగ్నల్ వద్ద ధర్నా నిర్వహించారు. పోలీసులు అడ్డుకోవడంతో తోపులాట చోటుచేసుకుంది. పలువురిని అరెస్టు చేశారు. నిర్బంధాలతో ఉద్యమాలను అడ్డుకోలేరని నాయకులు పేర్కొన్నారు. అసెంబ్లీ సమావేశాలు ముగిసేలోపు తమ సమస్యలను పరిష్కరించాలని, లేకపోతే సమ్మెకు దిగుతామని తెలిపారు. ప్రభుత్వ నిర్బంధాన్ని నిరసిస్తూ బుధవారం రాష్ట్రవ్యాప్తంగా మండల కేంద్రాల్లో ఆందోళనలు చేపట్టాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆశా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. జయలక్ష్మి, ప్రధాన కార్యదర్శి ఆర్. నీలాదేవి, కోశాధికారి పి. గంగమణి, సీఐటీయూ నాయకులు జె. వెంకటేశ్, పాలడుగు సుధాకర్, దశరథ్, మీన తదితరులు పాల్గొన్నారు.

# అభివృద్ధితో ఓటు బ్యాంక్‌ను పెంచుకుందాం : సీఎం చంద్రబాబు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** అభివృద్ధి ద్వారా ఓటు బ్యాంక్?ను పెంచుకుందామని, ఓటేయని వారినీ మెప్పిద్దామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతీ ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని సూచించారు. గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలను టీం స్పిరిట్‌తో ఆధార సహితంగా తిప్పికొట్టాలని పార్టీ నేతలకు చంద్రబాబు పిలుపునిచ్చారు. మంగళగిరి టీడీపీ కార్యాలయంలో నాయకత్వ సదస్సులో రెండోరోజు సుస్థిరాభివృద్ధిపై చర్చించారు. రాష్ట్ర స్థూల అభివృద్ధితో నియోజకవర్గాల అభివృద్ధిని అనుసంధానం చేసి ప్రజల్లో సానుకూల అభిప్రాయం పెంచాలని నేతలకు చంద్రబాబు సూచించారు. వచ్చే మూడేళ్లలో రూ.35,000ల కోట్లతో 36 ప్రాజెక్టులు పూర్తి చేస్తామని చెప్పారు. అన్ని ప్రాజెక్టులు పూర్తయితే 1250 నుంచి 1400 టీఎంసీల నీరు నిల్వ చేసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. గూగుల్ వంటి డేటా సెంటర్లతో లక్షల మందికి ఉపాధి, ఉద్యోగాలు వస్తాయని, నీటి లభ్యత సమస్యే కాదని చంద్రబాబు స్పష్టం చేశారు. 'గొడ్డలి పార్టీ ఫేక్ ప్రచారాలను టీం స్పిరిట్‌తో ఆధార సహితంగా తిప్పికొట్టాలి. కుప్పం వెళ్లి టీచర్లను బెదిరించే స్థాయికి వైఎస్సార్సీపీ అనుకూల మీడియా దిగజారింది. ఇలా బరితెగించేవారిని ఉపేక్షించబోమని హెచ్చరించారు. జెన్‌జీ ఆలోచనలను పరిగణనలోకి తీసుకుంటూ రియల్‌టైమ్ నిర్ణయాలతో ముందుకెళ్లాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా సక్సెస్ స్టోరీలు సృష్టించి ప్రతి ప్రాంతాన్ని అభివృద్ధి చేయాలని' చంద్రబాబు సూచించారు. ఉచిత ఇసుక విధానంపై కూడా సీఎం చంద్రబాబు కీలక ఆదేశాలిచ్చారు. ప్రజలకు ఉచితంగా ఇసుక అందించేందుకు ప్రభఉత్వం ఏడాదికి రూ.1000 కోట్ల ఆదాయాన్ని వదులుకుంటోందని చెప్పారు. ఇతర రాష్ట్రాలకు ఇసుక అక్రమ తరలింపును అడ్డుకోవాలని ప్రతి ఇసుక రీచ్‌లో పరిస్థితులను నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. మద్యం విక్రయాల్లో ఎమ్మార్పీ కంటే ఒక్క రూపాయి అదనంగా వసూలు చేసినా కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. నియోజకవర్గాల్లో దీర్ఘకాలిక సమస్యలను సుమోటోగా పరిష్కరిస్తే ఎమ్మెల్యేలకు మంచి బ్రాండ్ వస్తుందన్నారు.ఎల్‌నినో దెబ్బకు రాష్ట్రం లో నీటి సంక్షోభం ముంచుకొస్తోందని, అప్రమత్తంగా ఉండి పరిస్థితిని సమర్థంగా ఎదుర్కోవాలని చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. 54 శాతం వర్షపాత లోటు నమోదైన వేళ, రిజర్వాయర్లలో నీటి నిల్వలు 737 నుంచి 530 టీఎంసీలకు పడిపోవడం, భూగర్భ జలాలు తగ్గిపోవడం వల్ల రాబోయే రోజుల్లో మరిన్ని సవాళ్లు ఎదురయ్యే అవకాశం ఉందని హెచ్చరించారు.



# మత్తు ఇంజక్షన్ల అక్రమ దందాపై పోలీసుల ఉక్కుపాదం

## - ఐదుగురు నిందితులు అరెస్ట్

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** రాష్ట్రంలో యువతను పక్కదారి పట్టిస్తున్న మత్తు ఇంజక్షన్ల ముఠాపై పోలీసులు గట్టి నిఘా పెట్టారు. అక్రమంగా మత్తు ఇంజక్షన్లను విక్రయిస్తున్నట్లు వచ్చిన సమాచారంతో రంగంలోకి దిగిన ప్రత్యేక బృందాలు పలు మెడికల్ ఏజెన్సీలు, మందుల దుకాణాల్లో విస్తృత తనిఖీలు చేపట్టాయి. ఈ కేసులో కీలక సూత్రధారులతో పాటు ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్న పోలీసులు, నెట్‌వర్క్ వెనుక ఉన్న పెద్ద తలకాయల కోసం విచారణ జరుపుతున్నారు. మత్తు ఇంజక్షన్లు కొనుగోలు, విక్రయం కేసులో పోలీసులు విచారణ చేపట్టారు. మెడికల్ ఏజెన్సీలు, మందుల దుకాణాలలో పోలీసులు విస్తృత తనిఖీలు చేపట్టి ఐదుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం జంగారెడ్డిగూడెం సర్కిల్ కార్యాలయంలో డీఎస్పీ మీడియా సమావేశాన్ని నిర్వహించారు. జంగారెడ్డిగూడెం పట్టణంలోని శ్రీ లక్ష్మీ శ్రీనివాస మెడికల్ ఏజెన్సీ యజమాని లక్ష్మణ సాయి కిషోర్ 20000 ట్రేమడాల్ ఇంజక్షన్లను దిగుమతి చేసుకొని డాక్టర్ల ప్రిస్క్రిప్షన్ లేకుండా అక్రమంగా విక్రయించిన ఘటనలో అతడిని కొద్ది రోజుల క్రితం ఎన్డీపీఎస్ యాక్టు కింద జంగారెడ్డిగూడెం పోలీసులు అరెస్టు చేశారు. విచారణ నేపథ్యంలో అతడి వద్ద నుంచి జ్యోతిక పెద్దింటి మెడికల్ ఏజెన్సీ నిర్వాహకుడు ఏలూరు సతీష్, రూపా పెద్దింటి మెడికల్స్ ఏజెన్సీ ఏలూరి దుర్గాప్రసాద్, దేవ రాజశేఖర్, చిరు మెడికల్స్ తమ్మిశెట్టి చిరంజీవి, శ్రీ భవాని మెడికల్ ఏజెన్సీస్ చెందిన మాధవరపు శివకృష్ణలు కొనుగోలు చేసిన విషయం తెలుసుకున్న పోలీసులు గత రెండు రోజులుగా ఆయా ఏజెన్సీలు, దుకాణాల వద్ద తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో భాగంగా ఐదుగురు నిందితుల వద్ద నుంచి 880 మత్తు ఇంజక్షన్లు ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారిని మంగళవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పర్సనల్ ఉన్నట్లు డీఎస్పీ వెల్లడించారు.




# కాకినాడ శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో పోలీసుల తనిఖీలు

**విశ్వంభర, ఏపీ బ్యూరో:** కాకినాడలోని శ్యామ్ ఇనిస్టిట్యూట్‌లో మంగళవారం వన్‌టౌన్ పోలీసుల తనిఖీలు నిర్వహించారు. మెగా పోలీస్ నోటిఫికేషన్ కోసం నిరుద్యోగ యువత సోమవారం ర్యాలీగా వెళ్లి కలెక్టరేట్ వద్ద నిరసన చేపట్టారు. ఈ క్రమంలో ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అందులో శ్యామ్ ఇనిస్టిట్యూట్‌కి చెందిన వారు విద్యార్థులను ఆందోళనకు ప్రేరేపించారన్న ఆరోపణలొచ్చాయి. ఈ నేపథ్యంలోనే ఇనిస్టిట్యూట్ నిర్వాహకులతో పోలీసులు మాట్లాడారు. ధర్నాలో ఎవరెవరు పాల్గొన్నారని వివరాలను సేకరించారు. ఆందోళనలో పాల్గొన్న వారు స్వచ్ఛందంగా వచ్చారా? లేదంటే ఎవరైనా సర్కార్?కి వ్యతిరేకంగా ధర్నా చేయమన్నారా? అనే కోణంలో పోలీసులు ఆరా తీశారు. కాకినాడ కలెక్టరేట్ వద్ద సోమవారం నాడు నిరుద్యోగ యువత నిర్వహించిన ధర్నాతో తనకు ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి సంబంధం లేదని శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఛైర్మన్ శ్యామ్ స్పష్టం చేశారు. పోలీసుల సోదాలపై ఆయన కన్నీటి పర్యంతమయ్యారు. మెగా పోలీస్ నోటిఫికేషన్‌లో పోస్టుల సంఖ్య పెంచాలని డిమాండ్ చేస్తూ తన ఇనిస్టిట్యూట్ పూర్వ విద్యార్థులు ధర్నా నిర్వహించారని తెలిపారు. ఈ ఘటనలో తన పాత్ర లేకపోయినా తనతో పాటు మరో 20 మంది విద్యార్థులపై పోలీసులు కేసులు నమోదు చేశారని వాపోయారు. ఎలాంటి ముందస్తు సమాచారం లేకుండా ఉదయం 10 మంది పోలీసులు హాస్టల్‌కు వచ్చి తనిఖీలు నిర్వహించి, విద్యార్థులను భయభ్రాంతులకు గురిచేశారని శ్యామ్ పేర్కొన్నారు. తాను విద్యార్థులను ఎక్కడా రెచ్చగొట్టలేదని, ఆందోళనలో పాల్గొనాలని కూడా చెప్పలేదని స్పష్టం చేశారు. కొంతమంది కావాలనే కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నారని చెప్పారు. గత 26 ఏళ్లుగా శ్యామ్ ఇనిస్టిట్యూట్‌ను నిర్వహిస్తున్నానని ఇప్పటివరకు ఎవరితోనూ విభేదాలు లేవన్నారు. తనపై నమోదైన కేసుల విషయంలో చట్టపరంగా పోరాడతానని, న్యాయపరంగానే ముందుకు వెళ్తానని వివరించారు. పోలీసులు నిజాయితీగా విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని శ్యామ్ కోరారు.



కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రలోభాలతో ఆందోళనలకు దిగొద్దని హోంమంత్రి అనిత పేర్కొన్నారు. ఏ ప్రభుత్వంలో పోలీసు ఉద్యోగాలు వచ్చాయో ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. ఏటా జాబ్ క్యాలెండర్‌లో 11,000ల పోస్టుల భర్తీకి సర్కార్ సిద్ధమని చెప్పారు.అభ్యర్థులు ఆందోళనలకు దిగి భవిష్యత్ నాశనం చేసుకోవద్దని సూచించారు. ఒక్క కానిస్టేబుల్ పోస్టు జగన్ ఇవ్వకుండా నోటిఫికేషన్ ఇచ్చి గాలికి వదిలేశారని విమర్శించారు. తమ ప్రభుత్వం వచ్చాక 6000ల పోస్టుల సమస్యలు క్లియర్ చేసిందని, కానిస్టేబుళ్లకు స్టైఫండ్ రూ.12,000లు పెంచిన ఘనత కూడా తమదేనని అనిత గుర్తుచేశారు.

# ఉత్తరాంధ్రలో వైసీపీకి బిగ్‌షాక్.. టీడీపీలో చేరిన బొత్స మేనల్లుడు

**విశ్వంభర, విజయనగరం:** స్థానిక ఎన్నికల ముందు ఉత్తరాంధ్రలో వైసీపీకి బిగ్ షాక్ తగిలింది. మాజీ మంత్రి, శాసన మండలి ప్రతిపక్ష నేత బొత్స సత్యనారాయణ మేనల్లుడు, విజయనగరం జిల్లా వైకాపా అధ్యక్షుడు మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) ఆ పార్టీకి రాజీనామా చేసిన తెదేపాలో చేరారు. ఈ మేరకు తన రాజీనామా లేఖను వైకాపా అధ్యక్షుడు జగన్‌కు పంపారు. విజయనగరం జడ్పీ ఛైర్మన్, భీమిలి వైకాపా ఇన్‌ఛార్జ్‌గానూ చిన్న శ్రీను పనిచేస్తున్నారు. వైకాపా సభ్యత్వంతో పాటు విజయనగరం జిల్లా అధ్యక్ష పదవి, భీమిలి ఇన్‌ఛార్జ్ పదవికీ ఆయన రాజీనామా చేశారు. కొన్నాళ్లుగా బొత్స సత్యనారాయణ, చిన్న శ్రీను మధ్య కోల్డ్ వార్ జరుగుతోంది. పార్టీలో మేనల్లుడి ప్రాధాన్యం తగ్గించేలా బొత్స ప్రయత్నిస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిన్న శ్రీను వైసీపీకి రాజీనామా చేయడం చర్చనీయాంశంగా మారింది.



**సీఎం చంద్రబాబు సమక్షంలో టీడీపీలోకి..**

వైకాపాకు రాజీనామా చేసిన అనంతరం చిన్న శ్రీను టీడీపీలో చేరారు. ఆ పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు సమక్షంలో అనుచరులతో కలిసి పసుపు కండువా కప్పుకొన్నారు. శ్రీను కుమార్తె సిరి సహస్ర, ఆమె అనుచరులు కూడా తెదేపాలో చేరారు. పార్టీలో చిన్న శ్రీను చేరిక కార్యక్రమానికి మంత్రులు అనిత, కొండపల్లి శ్రీనివాస్, ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ఎమ్మెల్యేలు కళా వెంకట్రావు, కొండ్రు మురళి, కోళ్ల లలితకుమారి తదితరులు హాజరయ్యారు.

## బైక్‌ను ఢీకొన్న అంబులెన్స్.. ఇద్దరి మృతి

విశ్వంభర, పెరవలి: తూర్పుగోదావరి జిల్లాలో రోడ్డు ప్రమాదం జరిగింది. బైక్‌ను ప్రైవేట్ అంబులెన్స్ ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు మృతిచెందారు. పెరవలి మండలం పిట్టల వేమవరంలో ఈ ఘటన చోటుచేసుకుంది. మృతులను నేలపూడి ప్రదీప్ (25), హరిదాసు సాయి (24)గా గుర్తించారు. ఈ ప్రమాదంపై పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

## డివైడర్‌ను ఢీకొట్టిన ఆర్టీసీ బస్సు.. ముగ్గురికి గాయాలు

**విశ్వంభర, డోన్:** అడ్డువచ్చిన ద్విచక్ర వాహనాన్ని తప్పించబోయి.. ఓ ఆర్టీసీ బస్సు డ్రైవర్ డివైడర్‌ను ఢీకొట్టిన ఘటన నంద్యాల జిల్లా డోన్ పట్టణంలో చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సు కర్నూలు నుంచి డోన్ పట్టణంలోకి వెళుతుండగా ఈ ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో డ్రైవర్ సహా ఇద్దరు ప్రయాణికులకు స్వల్ప గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని క్షతగాత్రులను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. జేసీబీతో బస్సును వెనక్కి తీసి డిపోకు తరలించారు.

## ఆ అధికారులే ఇప్పుడూ ఇబ్బంది పెడుతున్నారు: దస్తగిరి

**విశ్వంభర, అమరావతి:** వైసీపీ ప్రభుత్వంలో తనను చంపేస్తానని బెదిరించిన అధికారులే ఇప్పుడూ ఇబ్బంది పెడుతున్నారని మాజీ మంత్రి వివేకా హత్య కేసులో అప్రూవర్‌గా మారిన దస్తగిరి అన్నారు. సీఎం చంద్రబాబును కలిసి వినతిపత్రం ఇచ్చేందుకు భార్య షేక్ షబానాతో కలిసి ఆయన అమరావతి వచ్చారు. తనను ఇబ్బంది పెడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రిని కోరతామని.. ఆయన్ను కలిసేందుకు అనుమతివ్వాలన్నారు. ఈ సందర్భంగా జగన్‌పై దస్తగిరి విమర్శలు చేశారు. "వివేకా హత్య కేసులో వాస్తవాలు, మనీలాండరింగ్‌పై సీఎంకు వివరాలు అందిస్తా. నాతో కూడా నీతులు చెప్పించుకునే స్థాయికి జగన్ దిగజారారు. రాష్ట్రం గురించి మాట్లాడే ముందు బాబాయ్ కుమార్తెకు న్యాయం చేయాలి. న్యాయవాది సిద్ధార్థ లూథ్రా వద్ద వకాల్తా తీసుకున్నట్లు నిరూపిస్తే జైలుకు వెళ్లేందుకు నేను సిద్ధం. నిరూపించకపోతే జగన్ రాజకీయాలు వదులుకుంటారా? వివేకా హత్య కేసులో దర్యాప్తు సంస్థలకు జగన్, భారతి సహకరించాలి" అని దస్తగిరి అన్నారు. పులివెందుల వెళ్లాలంటే భయంగా ఉందని దస్తగిరి భార్య షేక్ షబానా అన్నారు. సీఎంను కలిసి తమ గోడు చెప్పుకొనేందుకు అనుమతి ఇవ్వాలని కోరారు.



## యూరియా కలిసిన దాణా తిని 18 ఆవుల మృత్యువాత


**విశ్వంభర, ముప్పాళ్ల:** యూరియా కలిసిన దాణా తినడంతో ఆవులు మృత్యువాత పడ్డాయి. ఈ ఘటన పల్నాడు జిల్లా ముప్పాళ్ల మండలం మాదలలోని గోశాలలో చోటుచేసుకుంది. ఓ రైతు నిల్వ చేసిన బస్తాల్లోని యూరియా వర్షానికి కరిగి గోవుల దాణాలో కలిసింది. మంగళవారం ఉదయం ఆ దాణా తినడంతో 18 ఆవులు మృతిచెందాయి

## ఇబ్రహీంపట్నం పీఎస్‌కు యూట్యూబర్ నందన

**విశ్వంభర, ఇబ్రహీంపట్నం:** శంషాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో అరెస్టయిన యూట్యూబర్ నందన ను పోలీసులు ఎన్టీఆర్ జిల్లా ఇబ్రహీంపట్నం పీఎస్‌కు తీసుకొచ్చారు. విదేశాల్లో ఉద్యోగాల పేరిట మోసాలకు పాల్పడ్డారంటూ నందన, ఆమె భర్తపై ఆరోపణలు ఉన్నాయి. ఈ క్రమంలో పలువురు బాధితులు ఫిర్యాదు చేయడంతో ఇబ్రహీంపట్నం పీఎస్‌లో గతంలో కేసు నమోదైంది. ఈ విషయం వెలుగులోకి రాగానే నందన దంపతులు అజ్ఞాతంలోకి వెళ్లడంతో ఏపీ పోలీసులు లుక్ అవుట్ సర్క్యులర్(ఎల్‌వోసీ) జారీ చేశారు. ఈ క్రమంలో బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ విమానంలో స్వదేశానికి ఒంటరిగా బయలుదేరిన నందన సోమవారం శంషాబాద్‌లో దిగారు. ఆమె పాస్‌పోర్ట్, వీసా పత్రాలు తనిఖీ చేసిన ఇమిగ్రేషన్ అధికారులు ఎల్‌వోసీ ఆధారంగా అదుపులోకి తీసుకొని ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. విచారణ నిమిత్తం ఇబ్రహీంపట్నం పోలీసులు పీఎస్‌కు తీసుకొచ్చారు.



## ఎల్‌నినో.. తాగునీటికే మొదటి ప్రాధాన్యం: చంద్రబాబు



**విశ్వంభర, అమరావతి:** ఎల్‌నినో వల్ల ఏపీపై ప్రతికూల ప్రభావం పడుతోందని సీఎం చంద్రబాబు అన్నారు. రాష్ట్రంలో ఇప్పటికే 54శాతం లోటు వర్షపాతం నమోదైందని, జలాశయాల్లో గతేడాది 737 టీఎంసీల నీరు ఉంటే.. ఈసారి 530 టీఎంసీలే ఉందని తెలిపారు. ఎల్‌నినోపై జరిగిన చర్చలో నేతలకు ఆయన దిశానిర్దేశం చేశారు. భూగర్భ జలాలు కూడా గణనీయంగా తగ్గుతున్నాయని అన్నారు. "నెల్లూరు, తిరుపతి, కోనసీమ జిల్లాల్లో వేయాల్సిన దానికన్నా ఎక్కువగా పంటలు వేశారు. మార్కాపురం, పోలవరం, ప్రకాశం జిల్లాల్లో 12శాతం పంటలే వేశారు. ఉద్యాన పంటలు కూడా పెద్ద ఎత్తున సాగు చేస్తున్నారు. సంక్షోభం దృష్ట్యా తాగునీటికే మొదటి ప్రాధాన్యత ఇస్తాం. బోర్లు ఎండిపోయిన చోట తాగునీటి కొరత లేకుండా చూడాలి. ప్రతి ఎకరాన్నీ పీఎండీఎస్ విధానంలో సాగు చేసేలా చూడాలి. 32 రకాల విత్తనాలను పీఎండీఎస్ ద్వారా సాగు చేసేందుకు అవకాశం ఉంది. సాగునీటి ప్రాజెక్టులకు మా ప్రభుత్వమే ఎక్కువ ఖర్చు చేసింది. ఉచిత ఇసుక.. ఇతర రాష్ట్రాలకు వెళ్తే అడ్డుకోవాలి. ఏటా రూ.1000 కోట్ల ఆదాయం వదులుకొని ఉచిత ఇసుక ఇస్తున్నాం. వైకాపా పాలనలో జే బ్రాండ్ల వల్ల 30 వేల మంది ప్రాణాలు కోల్పోయారు. మద్యాన్ని ఎమ్మార్పీ కంటే ఎక్కువకు విక్రయించేందుకు వీల్లేదు. గొడ్డలి పార్టీ నేతల దుష్ప్రచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించవద్దు. టీచర్లను బెదిరించే స్థాయికి గొడ్డలి పార్టీ మీడియా దారుణాలకు ఒడిగట్టింది. ఇలా బరితెగించే వారిని ఎట్టిపరిస్థితుల్లోనూ ఉపేక్షించకూడదు" అని చంద్రబాబు అన్నారు.

## డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసులో ఇకపై రోజువారీ విచారణ.. హైకోర్టు ఆదేశం

విశ్వంభర, రాజమహేంద్రవరం: దళిత యువకుడు, డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్య కేసు విచారణలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఈ కేసులో ఇకపై రోజువారీ విచారణ చేపట్టాలని హైకోర్టు ఆదేశించింది. ఈ మేరకు రాజమహేంద్రవరం ప్రత్యేక న్యాయస్థానం జడ్జికి ఆదేశాలు జారీ చేసింది.ఈ కేసులో వైసీపీఎమ్మెల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్నారు. సుప్రీంకోర్టు ఆదేశాలతో రాజమహేంద్రవరంలో ప్రత్యేక కోర్టు ఏర్పాటు చేయగా.. హైకోర్టు ఈ కేసును పర్యవేక్షిస్తోంది. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆగస్టు నెలాఖరుకు ట్రయల్స్ పూర్తికావాల్సింది. కానీ.. విచారణలో జాప్యం కావడంతో సమీక్షించిన ఉన్నత న్యాయస్థానం.. ఇకపై రోజువారీ విచారణకు ఆదేశించింది.హైకోర్టు ఆదేశాల నేపథ్యంలో రాజమహేంద్రవరం ప్రత్యే క న్యాయస్థానం ఈనెల 11 నుంచి రోజువారీ విచారణ ప్రారంభించనుంది. సాక్షుల వాంగ్మూలాల నమోదు ప్రక్రియ చేపట్టనుంది. ఈ మేరకు పోలీసులు, పబ్లిక్ ప్రాసిక్యూటర్, నిందితుల తరఫు న్యాయవాదులకు ప్రత్యేక న్యాయస్థానం సమాచారం ఇచ్చింది.



## దివాన్ చెరువులో కెమికల్స్ డ్రమ్ముల కలకలం

**విశ్వంభర, రాజానగరం:** తూర్పుగోదావరి జిల్లా రాజానగరం మండలం దివాన్ చెరువులో కెమికల్స్ డ్రమ్ములు కలకలం సృష్టించాయి. దివాన్ చెరువు సమీపంలో కెమికల్, యాసిడ్ నింపిన డ్రమ్ములను గుర్తుతెలియని వ్యక్తులు రోడ్డు పక్కన పడేసి వెళ్లిపోయారు. ఒక్కసారిగా ఆ డ్రమ్ముల నుం చి భారీగా మంటలు చెలరేగాయి. విపరీతమైన దుర్వాసన, పొగ రావడంతో స్థానికులు భయాందోళనలకు గురయ్యారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపులోకి తెచ్చారు. డ్రమ్ముల్లో రసాయనాలు నింపి పడేస్తున్నా అధికారులు పట్టించుకోవడం లేదని స్థానికుల ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా దివాన్ చెరువుకు సమీపంలోని కోమటి చెరువు వద్ద వందకు పైగా కెమికల్ డ్రమ్ములు ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. వర్షం కురిస్తే అవి కరిగి చెరువులో కలిస్తే చేపలు, పశువుల ప్రాణాలకు ప్రమాదం పొంచి ఉందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



## కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రలోభాలకు లోనై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దు: హోంమంత్రి వంగలపూడి అనిత

విశ్వంభర, ఏపీ బ్యూరో:



కానిస్టేబుల్ అభ్యర్థులు ప్రలోభాలకు లోనై భవిష్యత్‌ను నాశనం చేసుకోవద్దని హోంమంత్రి వంగలపూడి అనిత అన్నారు. రాజకీయ ప్రలోభాలకు లోనై ఆందోళనలకు దిగవద్దని చెప్పారు. గత వారం రోజులుగా కానిస్టేబుల్ అభ్యర్థులు కొన్ని చోట్ల ధర్నాలు చేస్తున్నారని అన్నారు. ప్రలోభాలకు లోనయ్యో, ఇతర కారణాలతోనో ధర్నాలు చేస్తున్నారని వ్యాఖ్యానించారు. 2014లో రాష్ట్ర విభజన తరవాత పోలీస్ వ్యవస్థను ప్రక్షాళన చేయాలని 9640 ఉద్యోగాలను భర్తీ చేశారని అన్నారు. జగన్ అధికారంలోకి వచ్చిన తరవాత నోటిఫికేషన్ ఇచ్చినప్పటికీ ఖాళీలు భర్తీ చేయలేదన్నారు. తిరిగి కూటమి అధికారంలోకి వచ్చిన తరవాత అవే ఆరువేల పోస్టుల భర్తీకి రంగం సిద్ధం చేసిందన్నారు. ఎలాంటి కోర్టు సమస్యలు లేకుండా ఆరువేల మందికి నియామకపత్రాలు అందజేశామన్నారు. స్టైఫండ్ కూడా రూ.12వేలు చేసిన ఘనత చంద్రబాబుదేనని చెప్పారు. వాళ్లు ట్రైనింగ్ పూర్తి చేసుకుని విధుల్లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారని అన్నారు. పోలీసు ఉద్యోగాల భర్తీపై వాస్తవాలు తెలుసుకుని ఆత్మపరిశీలన చేసుకోవాలని సూచించారు. ప్రతిఏటా జాబ్ క్యాలెండర్ లో సుమారు 11వేల పోలీసు పోస్టులు భర్తీ చేసేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉందని చెప్పారు. ఏ పార్టీ అధికారంలో ఉంటే మేలు జరిగిందో అభ్యర్థులు అర్థం చేసుకోవాలన్నారు.

## యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌కు మళ్లీ రిమాండ్ పొడిగింపు

**విశ్వంభర, గన్నవరం:** కృష్ణా జిల్లా గన్నవరం నియోజకవర్గానికి చెందిన ప్రముఖ యూట్యూబర్ జోసెఫ్ రావణ్‌కు న్యాయస్థానం మరోసారి జ్యుడీషియల్ రిమాండ్‌ను పొడిగిస్తూ ఆదేశాలు జారీ చేసింది. దీంతో ఆయన మరికొన్ని రోజుల పాటు జైలులోనే కొనసాగనున్నారు. వివాదాస్పద వ్యాఖ్యలు, పలు కేసుల నేపథ్యంలో ఇప్పటికే అరెస్టయి ప్రస్తుతం నెల్లూరు సెంట్రల్ జైలులో రిమాండ్ ఖైదీగా ఉన్నారు. ఈ కేసుల విచారణ కొనసాగుతున్న తరుణంలో జోసెఫ్ రావణ్‌ను గన్నవరం కోర్టులో ప్రవేశపెట్టారు. కేసు తీవ్రత, పోలీసుల వాదనలను పరిశీలించిన జడ్జి ఆయన జ్యుడీషియల్ రిమాండ్‌ను ఈ నెల 22 వరకు పొడిగిస్తూ కీలక తీర్పునిచ్చారు. కేసు విచారణ దశలో ఉండటంతో న్యాయమూర్తి ఈ నిర్ణయం తీసుకున్నారు. సోషల్ మీడియా వేదికగా విద్వేష పూరితమైన, వివాదాస్పద వ్యాఖ్యలు చేశారన్న ఆరోపణలతో జోసెఫ్ రావణ్‌పై పలు పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదైన సంగతి తెలిసిందే. చట్టపరమైన చర్యల్లో భాగంగా పోలీసులు ఆయనను అరెస్ట్ చేసి నెల్లూరు సెంట్రల్ జైలుకు తరలించారు. రిమాండ్ పొడిగింపుతో ఆయన తరఫు న్యాయవాదులు బెయిల్ కోసం సన్నాహాలు చేస్తున్నారు.



## అనకాపల్లి జిల్లాలో మళ్ళీ లంచం లీలలు: ఏసీబీకి చిక్కిన వీఆర్వో

విశ్వంభర, అనకాపల్లి: అనకాపల్లి జిల్లా పరిధిలోని కె.కోటపాడు మండలంలో రెవెన్యూ అధికారి లంచం తీసుకుంటూ అవినీతి ఏసీబీ అధికారులకు గురువారం రెడ్ హ్యాండెడ్‌గా పట్టుబడ్డారు. రైతు నుంచి భూ మ్యుటేషన్ ప్రక్రియ పూర్తి చేయడం కోసం వారాడ గ్రామానికి చెందిన వీఆర్వో సూర్యనారాయణ రూ.20,000 లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించారు. రంగంలోకి దిగిన అధికారులు లంచం సొమ్ము తీసుకుంటున్న సమయంలో అకస్మాత్తుగా దాడి చేశారు. వీఆర్వో సూర్యనారాయణను అదుపులోకి తీసుకున్నారు. లంచం మొత్తాన్ని స్వాధీనం చేసుకుని, దర్యాప్తు కొనసాగించారు. అయితే అత్యంత దిగ్భ్రాంతికరమైన విషయమేమిటంటే సూర్యనారాయణ గతంలో కూడా ఇదే తరహా అవినీతికి పాల్పడి ఏసీబీకి దొరికిపోయారు. ఓ కేసులో రూ.20,000 లంచం తీసుకుంటూ పట్టుబడిన దాఖలాలు ఉన్నప్పటికీ, ఆయన ప్రవర్తనలో మార్పు రాకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సూర్యనారాయణపై కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు, రైతులు కోరుతున్నారు.

# మహాగణపతి వేడుక.. మహత్తర బాధ్యత!





విఘ్నేశ్వరుడి నవరాత్రులు వచ్చేస్తున్నాయి. ఈ నెల 14 నుంచి దేశమంతటా గణనాథుడి ఉత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభం కానున్నాయి. వీధివీధినా మండపాలు కొలువు దీరనున్నాయి. కులమతాలకు, ప్రాంతీయ భేదాలకు అతీతంగా ప్రజలంతా ఒక్కటై గణనాథుడిని పూజించనున్నారు. ప్రతి ఇంటా భక్తి పరిమళించనుంది. ప్రతి గుండెలో ఉత్సాహం ఉప్పొంగనుంది. ఏ శుభకార్యానికైనా తొలి పూజ అందుకునే విఘ్నేశ్వరుడు విఘ్నాలను తొలగించి విజయాలను ప్రసాదిస్తాడన్నది మన విశ్వాసం. అలాంటి విఘ్నేశ్వరుడి ఉత్సవాలు మన నిర్లక్ష్యంతో ప్రకృతికి, సమాజానికి కొత్త సమస్యలకు కారణం కాకూడదు. భక్తి అంటే ప్రకృతిని గౌరవించడం కూడా. ప్రకృతికి భారంగా మారే విధానంలో దేవుడిని ఆరాధించడం మన సంప్రదాయ స్ఫూర్తికి తగదు. కానీ నేటి గణపతి ఉత్సవాల్లో ఆర్భాటం పెరిగే కొద్దీ పర్యావరణంపై భారం పెరుగుతోంది. ముఖ్యంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీఓపీ) విగ్రహాలు, వాటికి పూసే కృత్రిమ రంగులు నదులు, చెరువులు, కుంటల స్వచ్ఛతకు సవాలుగా మారుతున్నాయి. పీఓపీ విగ్రహాలు నీటిలో సులభంగా కరగవు. నిమజ్జనం తర్వాత వాటి అవశేషాలు నీటిలో మిగిలిపోతాయి. విగ్రహాలకు ఉపయోగించే కొన్ని కృత్రిమ రంగుల్లోని హానికర రసాయనాలు, లోహాలు నీటి నాణ్యతను ప్రభావితం చేసే అవకాశం ఉంది. జలచరాల మనుగడపైనా ప్రతికూల ప్రభావం పడుతుంది. ఈ పదార్థాలు నేలలోకి చేరితే భూగర్భ జలాలపైనా ప్రభావం చూపే ప్రమాదం ఉంది. అంటే భక్తితో నిమజ్జనం చేసిన విగ్రహం.. చివరకు మన జీవనాధారమైన నీటినే కలుషితం చేసే పరిస్థితి. దేవుడి ఆశీస్సుల కోసం చేసే పూజ మన జలవనరుల స్వచ్ఛతకు ముప్పుగా మారకూడదు. ఇక్కడే 'మట్టి గణపతి' ఆలోచనకు ప్రాధాన్యం పెరుగుతోంది. ప్రకృతి నుంచి వచ్చిన మట్టి.. తిరిగి ప్రకృతిలోనే కలిసిపోవడం మన జీవన తత్వానికి ప్రతీక. బంకమట్టితో, సహజ రంగులతో తయారు చేసిన విగ్రహాలు పర్యావరణానికి మేలు చేస్తాయి. ఇంటి వద్దే నీటితో కూడిన కుండీల్లో నిమజ్జనం చేసుకోవచ్చు. ఆ మట్టిని మొక్కలకు వినియోగించుకోవచ్చు. మట్టి గణపతిని ప్రోత్సహించడం ద్వారా పర్యావరణ పరిరక్షణతోపాటు మట్టి విగ్రహాలు తయారు చేసే సంప్రదాయ కళాకారుల ఉపాధికీ అండగా నిలవొచ్చు. ఉత్సవాల్లో పర్యావరణంతోపాటు భద్రతపైనా ప్రత్యేక శ్రద్ధ అవసరం. వీధుల్లో ఏర్పాటు చేసే మండపాలకు ముందుగానే సంబంధిత అధికారుల అనుమతులు తీసుకోవాలి. పోలీసులు, మున్సిపల్ అధికారులు సూచించే నిబంధనలను తప్పనిసరిగా పాటించాలి. తాత్కాలిక విద్యుత్ కనెక్షన్లు, వైరింగ్ పనులను నిపుణులతోనే చేయించాలి. వేలాడే, తెగిన తీగలు లేకుండా చూసుకోవాలి. విద్యుత్ తీగలు మండపాలకు, అలంకరణలకు తగలకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. అగ్ని ప్రమాదాల నివారణకు తగిన ఏర్పాట్లు ఉండాలి. అత్యవసర వాహనాలరాకపోకలకు మార్గం ఖాళీగా ఉంచాలి. విగ్రహం ఎంత భారీగా ఉంటే అంత గొప్ప భక్తి అన్న భావనను కూడా వీడాలి. భారీ విగ్రహాల రవాణా, ప్రతిష్ఠాపన, నిమజ్జనం సమయంలో ఇబ్బందులు, ప్రమాదాల అవకాశాలు పెరుగుతాయి. అందుబాటులో ఉన్న స్థలం, రహదారులు, నిమజ్జన ఏర్పాట్లను దృష్టిలో ఉంచుకుని సురక్షిత పరిమాణంలో విగ్రహాలను ఏర్పాటు చేయడం మేలు. మండపాల వద్ద పిల్లలు, మహిళలు, వృద్ధుల భద్రతకు ప్రత్యేక శ్రద్ధ చూపాలి. ఇక ఉత్సవం పేరుతో శబ్ద కాలుష్యానికీ స్వస్తి పలకాలి. డీజేలు, భారీ సౌండ్ సిస్టమ్స్‌తో రాత్రింబవళ్లు హంగామా చేయడం సంబరం కాదు. చిన్నారులు, వృద్ధులు, రోగులు, విద్యార్థులు, ఉద్యోగులు, పక్కింటివారి ప్రశాంతతను గౌరవించాలి. పోలీసులు, అధికారులు సూచించిన సమయ, శబ్ద పరిమితులను పాటించాలి. మన ఆనందం.. ఇతరుల అసౌకర్యానికి కారణం కాకూడదు. 'వీధికో విగ్రహం' అనే పోటీ కంటే సామూహికంగా, సమష్టి స్ఫూర్తితో ఉత్సవాలు నిర్వహించడం మేలు. అలంకరణలు, అనవసర ఆర్భాటాలకు వెచ్చించే డబ్బులో కొంత భాగాన్ని పేద విద్యార్థుల చదువుకు, పాఠశాలల అభివృద్ధికి, మొక్కలు నాటడానికి వినియోగిస్తే అదే గణనాథుడికి నిజమైన నైవేద్యం. విఘ్నేశ్వరుడు జ్ఞానానికి ప్రతీక. మనం ఆరాధించే దేవుడి పేరుతో మన భవిష్యత్తుకు ఇబ్బందులు తెచ్చుకోకూడదు. నదులు, చెరువులు ఈ తరానివే కావు.. భావితరాలకూ చెందినవే. ఈ వినాయక చవితి కేవలం పూజా కార్యక్రమంగా కాకుండా పర్యావరణ పరిరక్షణకు, సామాజిక బాధ్యతకు ప్రతిజ్ఞగా మారాలి. మట్టి గణపతిని ఇంటికి తెచ్చుకుందాం. సహజ రంగులతో అలంకరిద్దాం. ఇంటి వద్దే లేదా కృత్రిమ కుండీల్లో నిమజ్జనం చేద్దాం. మండపాల్లో భద్రతా ప్రమాణాలు పాటిద్దాం. పోలీసుల సూచనలు, అధికారుల అనుమతులను గౌరవిద్దాం. భారీ విగ్రహాలు, భారీ శబ్దాలకు దూరంగా ఉందాం. పక్కవారికి ఇబ్బంది కలగకుండా ఉత్సవాలను జరుపుకుందాం. ఉత్సవాన్ని నింపాలి.. విషాదాన్ని కాదు. భక్తిని చాటాలి.. బాధ్యతను మరిచిపోకూడదు. గణనాథుడిని పూజిద్దాం.. ప్రకృతిని గౌరవిద్దాం. మన ఆనందం అందరి ఆనందంగా మారినప్పుడే.. గణపతి నవరాత్రులు నిజమైన పండుగ అవుతాయి.



గడగోజు రవీంద్రాచారి,
జర్నలిస్టు, 9848772232


# రాజకీయ విరాళాలకు పారదర్శకతే ప్రాణం




ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు విరాళాలు రావడం సహజం. ఎన్నికల నిర్వహణకు, పార్టీ కార్యకలాపాలకు ఆర్థిక వనరులు అవసరమే. కానీ ఎవరు ఇస్తున్నారు? ఎంత ఇస్తున్నారు? ఎందుకు ఇస్తున్నారు? ఆ సొమ్ము ఎక్కడ ఖర్చవుతోంది? అన్న ప్రశ్నలకు సమాధానం లభించనప్పుడు రాజకీయ విరాళాలు ప్రజాస్వామ్యానికి బలం కాకుండా అనుమానాలకు కేంద్రంగా మారతాయి. గుజరాత్‌లో వెలుగుచూసిన తాజా వ్యవహారం ఈ ఆందోళనను మరింత తీవ్రం చేసింది. 2023--24 ఆర్థిక సంవత్సరంలో అక్కడి ఆరు నమోదిత, గుర్తింపు పొందని రాజకీయ పార్టీలు కలిపి సుమారు రూ.1,700 కోట్లు విరాళాలుగా పొందినట్లు ఎన్నికల సంఘం, అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రిఫార్మ్స్ గణాంకాలను ఉటంకిస్తూ నివేదికలు వెల్లడించాయి. అదే సమయంలో అప్పటికి జాతీయ పార్టీలుగా గుర్తింపు పొందిన ఐదు పార్టీలు---కాంగ్రెస్, ఆమ్‌ఆద్మీ పార్టీ, బీఎస్పీ, సీపీఎం, నేషనల్ పీపుల్స్ పార్టీ---కలిపి పొందిన విరాళాలు సుమారు రూ.1,480 కోట్లు మాత్రమే. ఈ ఆరు గుజరాత్ పార్టీలు 2024 లోక్‌సభ ఎన్నికల్లో కేవలం 15 మంది అభ్యర్థులను బరిలోకి దించాయి. ఇది అక్రమానికి రుజువు కాదు. కానీ రాజకీయ ఉనికి పరిమితంగా ఉన్న పార్టీలకు ఇంత భారీగా నిధులు ఎందుకు వచ్చాయి? వాటి మూలం ఏమిటి? అనే ప్రశ్నలను మాత్రం విస్మరించలేం. అంతకుముందు 2025 ఆగస్టులో 'దైనిక్ భాస్కర్' నివేదిక మరో తీవ్రమైన అంశాన్ని వెలుగులోకి తెచ్చింది. 2019--20 నుంచి 2023--24 మధ్య గుజరాత్‌లోని పది 'అజ్ఞాత పార్టీలు' సుమారు రూ.4,300 కోట్లు నిధులుగా పొందినప్పటికీ, 2019, 2022, 2024 ఎన్నికల్లో కలిపి కేవలం 43 మంది అభ్యర్థులను మాత్రమే నిలబెట్టాయని, వారికి మొత్తం 54,069 ఓట్లు మాత్రమే వచ్చాయని ఆ నివేదిక పేర్కొంది. ఇక్కడ అసలు ప్రశ్న పార్టీల సంఖ్య గురించి కాదు; రాజకీయ వ్యవస్థలోకి ప్రవేశిస్తున్న డబ్బు పారదర్శకత గురించి. రాజకీయ పార్టీ అన్న ముసుగులో నిధుల మళ్లింపు, పన్ను ఎగవేత లేదా అక్రమ ఆర్థిక లావాదేవీలకు అవకాశం ఏర్పడితే అది ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తుంది. అందుకే సంస్కరణలు అత్యవసరం. భారీ విరాళాలకు దాత వివరాలతోపాటు నిధుల అసలు మూలాన్ని తప్పనిసరిగా బహిర్గతం చేయాలి. పార్టీలు సమర్పించే విరాళాల నివేదికలు, ఆడిట్ ఖాతాలను నిర్ణీత గడువులోనే ప్రజలకు సులభంగా అందుబాటులో ఉంచాలి. అసాధారణంగా భారీ విరాళాలు పొందుతున్న, కానీ ఎన్నికల్లో అత్యల్పంగా పాల్గొంటున్న పార్టీలపై స్వతంత్ర ఆర్థిక పరిశీలన జరగాలి. ఎన్నికల సంఘానికి మరింత బలమైన తనిఖీ, ఆడిట్ అధికారాలు కల్పించాలి. ఓటు వేసే పౌరుడికి తన ఓటు ఎవరిని అధికారంలోకి తెస్తుందో తెలుసుకునే హక్కు ఉన్నట్లే, ఆ రాజకీయ శక్తి వెనుక ఆర్థికంగా ఎవరు నిలిచారో తెలుసుకునే హక్కు కూడా ఉంది. ప్రజాస్వామ్యంలో రాజకీయ పార్టీలకు విరాళాలు అవసరం. కానీ విరాళాల చీకటిలో ప్రజాస్వామ్యం నడవకూడదు. డబ్బు మూలం బహిరంగం కావాలి; లెక్కలు స్పష్టంగా ఉండాలి; నిబంధనలు అందరికీ సమానంగా వర్తించాలి. ఎన్నికల్లో ప్రజల ఓటే నిర్ణయాత్మక శక్తి కావాలి–అజ్ఞాత నిధులు.

–హెచ్. ప్రతాప్

## మోడీ పాలనకు అంతిమ ఘడియలు
## మీట్ ద ప్రెస్‌లో సీపీఐ రామకృష్ణ



**విశ్వంభర; విజయవాడ:** అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ దురహంకార చర్యలు, ఆంక్షల కారణంగా క్యూబా ప్రజలు ప్రత్యక్ష నరకం చూస్తున్నారని సీపీఐ జాతీయ కార్యదర్శి కె. రామకృష్ణ విమర్శించారు. అమెరికా ఎన్ని ఆంక్షలు విధించినా, క్యూబా ప్రజలు లొంగకుండా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నారని అన్నారు. క్యూబా రాజధాని హవానాలో ఇటీవల జరిగిన 24వ అంతర్జాతీయ కమ్యూనిస్టు, కార్మిక పార్టీల సమావేశానికి హాజరైన రామకృష్ణతో మంగళవారం విజయవాడ ప్రెస్‌క్లబ్‌లో 'మీట్ ది ప్రెస్' కార్యక్రమం నిర్వహించారు. ప్రెస్‌క్లబ్ అధ్యక్షుడు కంచల జయరాజ్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో రామకృష్ణ అంతర్జాతీయ, జాతీయ, రాష్ట్ర రాజకీయాలపై మాట్లాడారు. అమెరికాకు అత్యంత సమీపంలో ఉన్న క్యూబాను ఎలాగైనా తన ఆధీనంలోకి తెచ్చుకోవాలనే ఉద్దేశంతో అమెరికా అనేక ఆంక్షలు విధిస్తోందని రామకృష్ణ ఆరోపించారు. క్యూబాలో విద్యుత్, నీరు, రవాణా, మందులు వంటి కనీస సౌకర్యాల కొరత తీవ్రంగా ఉందన్నారు. ముఖ్యంగా క్యాన్సర్ బాధితులు అవసరమైన మందులు అందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్యూబాకు ఇతర దేశాల నుంచి సహాయ సహకారాలు అందకుండా అమెరికా ఆంక్షలు విధించిందని విమర్శించారు. సీపీఐ, సీపీఎం ఆధ్వర్యంలో సేకరించిన మందులను క్యూబాకు అందజేశామని చెప్పారు. 66 ఏళ్లుగా అమెరికా సామ్రాజ్యవాదానికి వ్యతిరేకంగా క్యూబా పోరాడుతోందని, ఎన్నో కష్టాలు ఎదురైనా అమెరికాకు లొంగకుండా నిలబడటం అభినందనీయమని రామకృష్ణ అన్నారు. తాజాగా అమెరికా ఆంక్షలను పక్కనపెట్టి రష్యా నుంచి చమురు తరలించేందుకు చర్యలు చేపట్టడం శుభపరిణామమన్నారు. దేశ రాజకీయాలపై మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ పాలనపై ప్రజల్లో తీవ్ర అసంతృప్తి పెరుగుతోందని రామకృష్ణ అన్నారు. 12 ఏళ్ల కేంద్ర ప్రభుత్వ పాలనలో నిరుద్యోగ సమస్య, ఇతర ప్రజల దైనందిన సమస్యలు ఏ ఒక్కటీ పరిష్కారం కాలేదని విమర్శించారు. 2014 ఎన్నికల సమయంలో ఇచ్చిన ధరల నియంత్రణ, ఏటా రెండు కోట్ల ఉద్యోగాలు, అవినీతి నిర్మూలన, విదేశాల్లోని నల్లధనం వెనక్కి తీసుకురావడం వంటి హామీలు అమలుకు నోచుకోలేదన్నారు. నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరగడంతో సామాన్య ప్రజలపై భారం పడిందని, నిరుద్యోగం పెరగడంతో యువతలో అసంతృప్తి నెలకొందని చెప్పారు. ఇందుకు ఇటీవల ఢిల్లీలో జరిగిన జెన్ జీ ఉద్యమంలో వెల్లువెత్తిన ప్రజాగ్రహమే నిదర్శనంగా పేర్కొన్నారు. అవినీతిని నిర్మూలిస్తామని అధికారంలోకి వచ్చిన బీజేపీ, అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న నేతలను తమ పార్టీలో చేర్చుకుని రక్షణ కల్పిస్తోందని రామకృష్ణ ఆరోపించారు. ఎన్నికల వ్యవస్థపై ప్రజల్లో నమ్మకం పెంచేందుకు బ్యాలెట్ పేపర్ విధానాన్ని పునరుద్ధరించాలని, ఎన్నికల కమిషన్ పూర్తిగా నిష్పక్షపాతంగా వ్యవహరించాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ విలువలు, లౌకికవాదం దెబ్బతింటున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ఆర్‌ఎస్‌ఎస్ అధినేత మోహన్ భగవత్ విదేశాల్లో ఒక రకంగా, దేశంలో మరో రకంగా మాట్లాడుతున్నారని రామకృష్ణ విమర్శించారు. న్యూయార్క్‌లో మత సామరస్యంపై మాట్లాడుతున్న భగవత్ దేశంలో మైనార్టీలపై జరుగుతున్న ఘటనలపై ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. దేశంలో చర్చిలపై దాడులు జరుగుతున్నాయని, మణిపూర్‌లో రెండున్నరేళ్లుగా హింస కొనసాగుతున్నప్పటికీ చర్చిలు, పాస్టర్లు, మహిళలపై జరుగుతున్న దాడులపై భగవత్ స్పందించలేదని ఆరోపించారు. దేశవ్యాప్తంగా ముస్లింలు, ఇతర మైనార్టీ వర్గాలు అభద్రతా భావంతో జీవించాల్సిన పరిస్థితి ఏర్పడిందని రామకృష్ణ అన్నారు. ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావడంతో పాటు కేంద్ర ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా డిసెంబర్ 1, 2, 3 తేదీల్లో దేశవ్యాప్తంగా 'జైల్ భరో' కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. అక్టోబర్ 2న గాంధీ జయంతిని మత సామరస్య దినంగా నిర్వహిస్తామని వెల్లడించారు. ప్రజాస్వామ్యం, రాజ్యాంగ పరిరక్షణను బలోపేతం చేయడమే లక్ష్యంగా సీపీఐ, ఇతర వామపక్ష, లౌకిక ప్రజాతంత్ర శక్తులతో కలిసి కేంద్ర ప్రభుత్వాన్ని గద్దె దించే వరకు పోరాటం కొనసాగిస్తామని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వంపై కూడా రామకృష్ణ తీవ్ర విమర్శలు చేశారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు వైఎస్ జగన్ రాష్ట్రాన్ని అప్పులపాలు చేస్తున్నారని విమర్శించిన సీఎం చంద్రబాబు నాయుడు, అధికారంలోకి వచ్చిన తర్వాత అదే విధానాన్ని కొనసాగిస్తున్నారని ఆరోపించారు. జగన్ ఐదేళ్లలో చేసిన అప్పులను చంద్రబాబు ప్రభుత్వం రెండేళ్లలోనే అధిగమించిందని అన్నారు. డబుల్ ఇంజన్ సర్కార్ అని చెప్పుకుంటున్న చంద్రబాబు, కేంద్రంలో ఉన్న పలుకుబడితో అప్పులు చేయడం మినహా రాష్ట్రానికి అదనంగా చేసిన అభివృద్ధి ఏమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో రైతాంగం తీవ్ర అసంతృప్తితో ఉందని రామకృష్ణ అన్నారు. 300కుపైగా మండలాల్లో కరువు పరిస్థితులు నెలకొన్నాయని, అయినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివరకు కరువు మండలాలను ప్రకటించలేదని విమర్శించారు. తక్షణమే కరువు మండలాలను ప్రకటించి రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితా నుంచి పేర్ల తొలగింపు చర్యలను వ్యతిరేకిస్తూ పోరాటం కొనసాగిస్తామని తెలిపారు. స్థానిక సంస్థల ఎన్నికలు రాజకీయాలకు అతీతంగా జరుగుతాయని, గ్రామాభివృద్ధిని కోరుకునే అభ్యర్థులకు తమ పార్టీ మద్దతు ఇస్తుందని రామకృష్ణ చెప్పారు. అనంతరం మీడియా ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఆయన సమాధానమిచ్చారు. ఈ కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ యూనిట్ అధ్యక్ష, కార్యదర్శులు చావా రవి, దారం వెంకటేశ్వరరావు, ఐజేయూ సభ్యుడు షేక్ బాబు, సామ్నా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్యం నుంచి ఏఐ వరకు బిగ్ ఫోకస్..బ్రిక్స్‌లో భారత్ కొత్త అజెండా..




వాణిజ్యం నుంచి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ వరకు బ్రిక్స్ వేదికగా భారత్ తన కొత్త అజెండాను ప్రపంచం ముందు పెట్టేందుకు సిద్ధమవుతోంది. బ్రిక్స్ కూటమికి 2026లో అధ్యక్షత వహిస్తున్న భారత్, సెప్టెంబర్ 12, 13 తేదీల్లో దిల్లీలో 18వ శిఖరాగ్ర సదస్సును నిర్వహించనుంది. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ, టెక్నాలజీ, ఇంధనం, వాతావరణం, అంతర్జాతీయ పాలనలో మార్పులపై సదస్సులో కీలక చర్చలు జరగనున్నాయి. అదే సమయంలో బిల్డింగ్ ఫర్ రెసిలియన్స్, ఇన్నోవేషన్, కోఆపరేషన్ అండ్ సస్టెయినబిలిటీ అనే థీమ్‌ను భారత్ ఎంచుకుంది. అంటే సంక్షోభాలను తట్టుకునే ఆర్థిక వ్యవస్థలు, కొత్త సాంకేతికత, దేశాల మధ్య సహకారం, సుస్థిర అభివృద్ధి, ఆ నాలుగు అంశాల చుట్టూ బ్రిక్స్ సదస్సును ముందుకు తీసుకెళ్లాలని భారత్ భావిస్తోంది. దీనికి హ్యూమానిటీ ఫస్ట్ అనే దృక్పథాన్ని జోడించింది.

**వాణిజ్యానికి కొత్త ఊపు..**

బ్రిక్స్‌లో భారత్ ప్రధానంగా ఆర్థిక సహకారాన్ని మరింత బలోపేతం చేయాలని చూస్తోంది. సభ్య దేశాల మధ్య వాణిజ్యాన్ని పెంచడం, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలను తగ్గించడం, అంతర్జాతీయ చెల్లింపులను సులభతరం చేయడం ఇందులో కీలకం. జాతీయ కరెన్సీల వినియోగాన్ని పెంచడం, సరిహద్దు చెల్లింపుల వ్యవస్థలను మరింత అనుసంధానం చేయడం వంటి అంశాలపై కూడా చర్చలు జరగనున్నాయి. ప్రపంచ వాణిజ్యంలో ఎదురవుతున్న భౌగోళిక, రాజకీయ సవాళ్ల నేపథ్యంలో సరఫరా గొలుసులను మరింత పటిష్ఠం చేయడం భారత్ అజెండాలో ముఖ్యమైన అంశంగా మారింది. చిన్న, మధ్య తరహా పరిశ్రమలకు కూడా బ్రిక్స్ సహకారం అందించాలనేది భారత్ లక్ష్యం. ఇందుకోసం ఇన్వాయిస్ డిస్కౌంటింగ్ విధానం, ఎంఎస్ఎంఈల కోసం ప్రత్యేక సహకార పోర్టల్ వంటి ప్రతిపాదనలను ముందుకు తెచ్చింది.

**ఏఐపై ఎందుకంత ఫోకస్?..**

ప్రస్తుతం ప్రపంచ ఆర్థిక వ్యవస్థను వేగంగా మార్చుతున్న అంశాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఒకటి. అందుకే బ్రిక్స్‌లో కూడా ఏఐ సహకారానికి భారత్ ప్రాధాన్యం ఇస్తోంది. ఏఐతో పాటు ఫిన్‌టెక్, డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్, డేటా ఆధారిత వ్యవస్థలపై సభ్య దేశాల మధ్య సహకారాన్ని పెంచాలని భారత్ భావిస్తోంది. డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్‌కు సంబంధించిన పరిజ్ఞానాన్ని పరస్పరం పంచుకునేందుకు ప్రత్యేక రిపాజిటరీ ప్రతిపాదన కూడా ఉంది. భారత్‌కు ఇప్పటికే ఆధార్, యూపీఐ వంటి డిజిటల్ పబ్లిక్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ వ్యవస్థల్లో అనుభవం ఉంది. ఆ అనుభవాన్ని ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలతో పంచుకోవడం ద్వారా సాంకేతికతను కేవలం అభివృద్ధి చెందిన దేశాలకే పరిమితం చేయకుండా గ్లోబల్ సౌత్‌కు అందుబాటులోకి తీసుకురావాలన్నది భారత్ ఆలోచనగా కనిపిస్తోంది.

**స్టార్టప్‌లకు కూడా ప్రాధాన్యం..**

కొత్త ఆవిష్కరణలకు బ్రిక్స్ దేశాల్లోని యువత, స్టార్టప్‌లను అనుసంధానం చేయడంపైనా భారత్ దృష్టి పెట్టింది. బ్రిక్స్ ఇంక్యుబేటర్ నెట్‌వర్క్, స్టార్టప్ ఇన్నోవేషన్ ఫండ్ వంటి ప్రతిపాదనల ద్వారా కొత్త సంస్థలకు పెట్టుబడులు, సాంకేతిక సహకారం అందించే ప్రయత్నం చేస్తోంది. వ్యవసాయంలో కూడా డిజిటల్ టెక్నాలజీని విస్తృతంగా ఉపయోగించాలనేది భారత్ లక్ష్యం. ఏఐ, జియోస్పేషియల్ టెక్నాలజీ, డిజిటల్ వ్యవస్థల సాయంతో రైతులకు మెరుగైన సేవలు అందించే దిశగా బ్రిక్స్ సహకారాన్ని పెంచాలని భావిస్తోంది.

**వాతావరణం కూడా కీలకమే..**

బ్రిక్స్‌లో ప్రపంచంలోని ప్రధాన ఇంధన ఉత్పత్తిదారులు, వినియోగదారులు ఉన్నారు. అందుకే ఇంధన భద్రతపై కూడా సదస్సులో చర్చలు జరగనున్నాయి. స్మార్ట్ గ్రిడ్లు, ఎనర్జీ స్టోరేజ్, హైడ్రోజన్, బయోఫ్యూయల్స్, కీలక ఖనిజాలు, కార్బన్ క్యాప్చర్ వంటి రంగాల్లో సహకారాన్ని పెంచేందుకు భారత్ ప్రయత్నిస్తోంది. అదే సమయంలో వాతావరణ మార్పుల ప్రభావాన్ని ఎదుర్కొనేందుకు క్లైమేట్ రెసిలియంట్ మౌలిక వసతులు, గ్రీన్ ఫైనాన్స్, సుస్థిర పట్టణ అభివృద్ధి వంటి అంశాలను కూడా ముందుకు తీసుకెళ్లనుంది.

**ప్రపంచానికి భారత్ ఇచ్చే మెసేజ్ ఇదేనా?..**

బ్రిక్స్ విస్తరణ తర్వాత భారత్?లో జరగనున్న సదస్సుకు మరింత ప్రాధాన్యం ఏర్పడింది. ప్రస్తుతం బ్రెజిల్, రష్యా, భారత్, చైనా, దక్షిణాఫ్రికాతో పాటు ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, సౌదీ అరేబియా, యూఏఈ, ఇండోనేసియా మొత్తం 11 దేశాలు సభ్యులుగా ఉన్నాయి. ఇలాంటి సమయంలో భారత్ అధ్యక్షత వహించడం కీలక సందర్భం. కేవలం రాజకీయ ప్రకటనలకే పరిమితం కాకుండా వాణిజ్యం, టెక్నాలజీ, ఇంధనం, ఆరోగ్యం, వ్యవసాయం, వాతావరణం వంటి రంగాల్లో ప్రత్యక్ష ప్రయోజనాలు కల్పించే సహకారం అవసరమనే సందేశాన్ని భారత్ ఇవ్వాలని చూస్తోంది. అంతర్జాతీయ ద్రవ్య, రాజకీయ సంస్థల్లో సంస్కరణలు, అభివృద్ధి చెందుతున్న దేశాలకు ఎక్కువ ప్రాధాన్యం, ఆర్థిక సమ్మిళితత్వం వంటి అంశాలను కూడా భారత్ బలంగా ప్రస్తావించనుంది. ముఖ్యంగా గ్లోబల్ సౌత్ దేశాల గొంతుకగా బ్రిక్స్‌ను మరింత బలమైన వేదికగా మార్చడమే భారత్ లక్ష్యంగా కనిపిస్తోంది. అందుకే ఈసారి బ్రిక్స్ సదస్సు కేవలం దేశాధినేతల సమావేశం మాత్రమే కాదు. ప్రపంచ వాణిజ్యం, టెక్నాలజీ, ఆర్థిక వ్యవస్థ భవిష్యత్‌పై భారత్ తన ఆలోచనలను చెప్పే వేదికగా మారనుంది. సెప్టెంబర్‌లో దిల్లీలో జరిగే ఆ సదస్సులో వెలువడే నిర్ణయాలు, బ్రిక్స్ భవిష్యత్ దిశను కూడా నిర్దేశించే అవకాశం ఉంది.

# ధాన్యం నిల్వ చేయడానికి గోదాముల నిర్మాణాలకు స్థల పరిశీలన చేయాలి

**విశ్వంభర, మెదక్ ప్రతినిధి:** వానాకాలం ధాన్యం సీజన్–2026ను దృష్టిలో ఉంచుకుని రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ధాన్యం కొనుగోలు ప్రక్రియను పకడ్బందీగా నిర్వహించేందుకు అధికారులు చర్యలు చేపట్టాలని జిల్లా అదనపు కలెక్టర్ నగేష్ అన్నారు. బుధవారం కలెక్టరేట్లోని మినీ సమావేశ మందిరంలో సివిల్ సప్లై, వ్యవసాయ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ నగేష్ మాట్లాడుతూ ధాన్యం నిల్వ చేసేందుకు అవసరమైన గోదాముల నిర్మాణాల కోసం అనువైన స్థలాలను పరిశీలించాలని సంబంధిత ఆర్డీఓలు, తహసీల్దార్లను ఆదేశించినట్లు తెలిపారు. జిల్లాలో ధాన్యం దిగుబడికి అనుగుణంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు ప్రభుత్వ స్థలాలు, వ్యవసాయ మార్కెట్ యార్డులు తదితర ప్రాంతాల్లో స్థలాలను గుర్తించి పరిశీలన చేయాలన్నారు. గోదాముల నిర్మాణానికి అవసరమైన మౌలిక వసతులు, రవాణా సౌకర్యాలు, రైతులకు అందుబాటులో ఉండే విధంగా స్థలాల ఎంపికపై అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని చెప్పారు. అదేవిధంగా అక్టోబర్ మొదటి వారంలో జిల్లాలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవాలని, రైతులు తమ ధాన్యాన్ని దళారులకు విక్రయించకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసే కొనుగోలు కేంద్రాల్లోనే విక్రయించేలా విస్తృత అవగాహన కల్పించాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో అవసరమైన మౌలిక సదుపాయాలు, తూకం యంత్రాలు, టార్పాలిన్లు, గన్నీ బ్యాగులు, ధాన్యం నాణ్యత పరీక్షించే పరికరాలు తదితర ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. రైతులకు పారదర్శకంగా, వేగవంతంగా ధాన్యం కొనుగోలు జరిగేలా సమన్వయంతో పనిచేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలు, నిల్వ ప్రక్రియలో ఎలాంటి సమస్యలు తలెత్తకుండా అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని, రైతులకు ప్రభుత్వం నిర్ణయించిన నిబంధనల ప్రకారం మద్దతు ధర అందేలా చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో డీఆర్వో అంబాదాస్ రాజేశ్వర్, రీజనల్ డిప్యూటీ డైరెక్టర్, ఇన్‌చార్జి జిల్లా మార్కెటింగ్ అధికారి ప్రసాద్ రావు, సివిల్ సప్లై అధికారులు నిత్యానంద, జగదీష్, డీఆర్డీఓ శ్రీనివాస్ రావు, డీసీఓ పద్మ, వివిధ శాఖల అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## అటు రామాయణ.. ఇటు మహాశక్తి.. దీపావళి సందడి డబుల్!



ఈసారి దీపావళికి బాక్సాఫీసు సందడి రెట్టింపుకానుంది. భారీస్థాయిలో తెరకెక్కుతున్న పాన్ఇండియా చిత్రం 'రామాయణ'ను దీపావళి సందర్భంగా నవంబరు 6న విడుదల చేయనున్నట్లు చిత్రబృందం ప్రకటించిన సంగతి తెలిసిందే. రాముడిగా రణ్‌బీర్ కపూర్ , సీతగా సాయిపల్లవి , రావణాసురుడిగా యశ్ (ఖుంప్ల) నటిస్తున్న ఈ చిత్రంపై అంచనాలు ఆకాశాన్నంటుతున్నాయి. ఇప్పుడు మరో ఆసక్తికరమైన చిత్రం వెలుగుల పండగ సందర్భంగా బరిలో నిలిచేందుకు సిద్ధమవుతోంది. అది ఇంకేదో కాదు.. ప్రముఖ నటి నయనతార మరోసారి అమ్మవారి పాత్రలో నటిస్తున్న 'మూకుత్తి అమ్మన్ 2' . తెలుగులో 'మహాశక్తి' టైటిల్‌ను ఫిక్స్ చేశారు. ఈ చిత్రంలో రెజీనా, దునియా విజయ్ తదితరులు కీలక పాత్రల్లో నటిస్తున్నారు. సీనియర్ దర్శకుడు సుందర్.సి తెరకెక్కిస్తున్నారు. ఇందులో ఆయన కూడా ఓ ముఖ్య పాత్రలో కనిపించనున్నారు. ఆరేళ్ల క్రితం ఆర్జే బాలాజీ దర్శకత్వంలో వచ్చిన 'మూకుత్తి అమ్మన్', తెలుగులో 'అమ్మోరు తల్లి' పేరుతో విడుదలై విజయం సాధించిన సంగతి తెలిసిందే. దీంతో మూకుత్తి అమ్మన్ 2'పై ప్రేక్షకుల్లో ఆసక్తి నెలకొంది. ఈ సినిమాను దీపావళి కానుకగా ప్రేక్షకుల ముందుకు తీసుకొచ్చేందుకు చిత్ర బృందం సన్నాహాలు చేస్తున్నట్లు సమాచారం. అందుకనుగుణంగా పోస్ట్ ప్రొడక్షన్ పనులను వేగవంతం చేసినట్లు తెలుస్తోంది. ఇప్పటికే విడుదల చేసిన నయతార ఫస్ట్‌లుక్‌కు మంచి స్పందన వచ్చింది.

## సీతాకోకచిలుకల్లా జీవితాన్ని మార్చేస్తాయి

అమ్మా..! నువ్వు ఇకనుంచి ఒంటరిగా ప్రయాణం చేయాలి. జీవితం మనం కలలు కన్నట్లు ఎప్పుడూ ఉండదంటూ తన కూతురికి మంచి చెడు చెప్తోంది ఓ తల్లి. అమ్మా నీకున్నంత ధైర్యంలో సగం నాకైనా ఉంటే ఈ ప్రపంచమంతా చుట్టేసేదాన్ని అంటోంది ఆమె కూతురు. ఇంత సంతోషంగా ఉన్న ఆ తల్లీకూతుళ్లు అనుకోకుండా ఓ ప్రమాదం చిక్కుకుంటారు. ఇంతకి ఆ ప్రమాదం ఏంటి? అలాంటి గందరగోళ పరిస్థితుల నుంచి వారు ఎలా బయటపడ్డారో తెలియాలంటే 'ఆశా' సినిమా చూడాల్సిందే. ఐశ్వర్య లక్ష్మి, ఊర్వశి, జోజు జార్జ్ నటించిన చిత్రమిది. సఫర్ సనల్ దర్శకత్వంలో వినాయక అజిత్ నిర్మించారు. రమేశ్ గిరిజ, అజయన్, ప్రశాంత్, జో మాథ్యూ తదితరులు కీలక పాత్రలు పోషించారు. ఈ చిత్రం ఈ నెల 11న థియేటర్లలో విడుదల కానుంది. ఈ నేపథ్యంలో సామాజిక మాధ్యమాల వేదికగా ఈ చిత్ర ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రబృందం. "ఆశా ప్రపంచాన్ని ఆవిష్కరిస్తున్నాం. ఇక్కడ చిన్న చిన్న నిర్ణయాలు పైకి చిన్నవిగా కనిపిస్తాయి. కానీ అవి సీతాకోకచిలుకల్లాగా జీవితాన్ని మార్చే సంఘటనలకు దారితీస్తాయి" అనే క్యాప్షన్‌ను జోడించింది. "కైపట్టూర్ సమీపంలో జరిగిన ప్రమాదంలో ఇద్దర్ని అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం. మీరు ఈ కేసును ముందుకు తీసుకువెళితే చాలా ఖర్చు అవుతుంది. అది కాక మీరిద్దరూ పదేపదే కోర్టుకు వెళ్లాల్సి ఉంటుంది. ఆమెను రానివ్వండి అప్పుడే తనకు మనం ఎవరో అర్థమవుతుంది" అనే సంభాషణలతో ట్రైలర్ సాగుతోంది.




## ఆ భయంతో విగ్గు తీయకుండా వచ్చేశా: విజయ్ దేవరకొండ



హైదరాబాద్: వచ్చే మూడు నెలలు వరుస సినిమాలతో ప్రేక్షకుల్ని రెగ్యులర్‌గా కలుస్తుంటానని యువ కథానాయకుడు విజయ్ దేవరకొండ అన్నారు. తన సోదరుడు ఆనంద్ దేవరకొండ ప్రధాన పాత్రలో నటించిన 'ఎపిక్ - ఫస్ట్ సెమిస్టర్' (జుజూఅఖి) ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో పాల్గొని మాట్లాడారు. "సెప్టెంబర్ 11న ఆనంద్ దేవరకొండ సినిమా ఉంది. అక్టోబర్ 16న నా సినిమా ఉంది. మళ్లీ నవంబర్‌లో దేవరకొండ రష్మిక సినిమా ఉంది. ఇంకా నాన్‌స్టాప్‌గా అభిమానుల్ని కలుస్తూనే ఉంటా. సెట్ నుంచి ఇక్కడికి నేరుగా వచ్చా. సినిమా (రణబాలి) రిలీజ్ డేట్ దగ్గరపడుతోంది. ఇప్పుడు త్వరగా ముగించి సెట్‌కి వెళ్లిపోవాలి. ఈ మధ్య సినిమాలు లేటవుతున్నాయంటే తిడుతున్నారు గట్టిగా. ఇక ఆ భయంతో విగ్గు తీయకుండానే వచ్చేశా. నిజానికి ఆ బట్టల్లోనే వచ్చేద్దామని అనుకున్నా. మళ్లీ రణబాలి ప్రమోషన్ అనుకుంటారని ఎట్లనో త్వరగా మార్చుకొని వచ్చా" అని చెప్పారు. "తెలుగు సినిమాకు ఇది సూపర్ ఇయర్. నాన్‌స్టాప్ సినిమాలే. ప్రజలు అభిమానిస్తున్నారు. సినిమాలు సక్సెస్ అవుతున్నాయి. సెప్టెంబర్ 11న 'ఎపిక్' వస్తుంది.. ఆ తర్వాత శ్రీకాంత్ ఓదెల- నాని 'ది ప్యారడైజ్' వస్తుంది. ఆ తర్వాత నా 'రణబాలి' వస్తుంది. ఆ తర్వాత రష్మిక 'మైసా' వస్తుంది. తరుణ్ భాస్కర్ 'ఈనగరానికి ఏమైంది 2', డిసెంబర్‌లో 'ఫౌజీ' వస్తుంది. బాలయ్య గారి 'దాదా' వస్తుంది. ఈ ఇయర్ ఫినిషింగ్ సాలిడ్ అవ్వబోతోంది. నాకు ఈ సినిమాల్లో నాలుగు సినిమాల కంటెంట్ తెలుసు. గ్లింప్స్ చూశాను. వంద శాతం స్ట్రయిక్ రేట్ వస్తుందని భావిస్తున్నాను" అన్నారు.

## వివాదంలో శివరాజ్‌కుమార్.. ట్రోల్స్ చేస్తున్న కన్నడిగులు



హిందీని 'జాతీయ భాష'గా పేర్కొంటూ కన్నడ స్టార్ శివరాజ్‌కుమార్ చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు సోషల్ మీడియాలో చర్చకు దారితీశాయి. ఆయన ప్రధాన పాత్రలో, ఆర్. చంద్రు దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రం 'ఒరిజినల్ మాన్‌స్టర్'. ఈ మూవీ కన్నడతో పాటు హిందీలో కూడా రూపొందుతుండగా.. ఈ సినిమాతో శివరాజ్ కుమార్ హిందీ చిత్రసీమలోకి అడుగుపెట్టబోతున్నారు. ఈ క్రమంలోనే తాజాగా టైటిల్ లాంచ్ ఈవెంట్‌లో పాల్గొన్న ఆయన్ను.. హిందీ డైలాగులు చెప్పడం గురించి ఆయనను ప్రశ్నించగా.. హిందీ తనకు రెండో భాష అని, తాను హిందీ మాట్లాడగలనని, అది సులభమైన భాష అని శివరాజ్ కుమార్ పేర్కొన్నారు. అంతే కాకుండా ప్రేక్షకులను కలిపేందుకు ఉపయోగపడే 'జాతీయ భాష'గా హిందీని అభివర్ణించారు. ఈ కామెంట్స్ కాస్త నెట్టింట వైరల్ అవుతుండగా.. ఈ వ్యాఖ్యలపై కన్నడిగులు, కన్నడ సంస్కృతి పరిరక్షకులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. హిందీని 'జాతీయ భాష'గా పేర్కొనడాన్ని ప్రశ్నిస్తూ.. భారతదేశానికి ఎలాంటి అధికారిక 'జాతీయ భాష' లేదని, అన్ని ప్రాంతీయ భాషలకు సమాన ప్రాధాన్యం ఉందనే స్పృహ కూడా లేకుండా.. కన్నడ నాట దిగ్గజ కుటుంబానికి చెందిన హీరో అయ్యుండి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం కరెక్ట్ కాదంటూ మండిపడుతున్నారు.

## పెళ్లి కాకుండానే ఫిజికల్‌గా ఒక్కటైతే ఎలా ఉంటుంది అనేదే ఈ సినిమా..




ఆనంద్ దేవరకొండ, వైష్ణవి చైతన్య జంటగా నటిస్తున్న చిత్రం 'ఎపిక్: ఫస్ట్ సెమిస్టర్'. ఇప్పటికే షూటింగ్‌తో పాటు అన్నీ కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ సెప్టెంబర్ 11న గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్‌కు రాబోతున్నది. దీంతో ప్రమోషన్స్‌లో జోరు పెంచిన టీమ్ వరుస ఇంటర్వ్యూలో పాల్గొంటున్నారు. ఈ క్రమంలోనే తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న నిర్మాత నాగవంశీ సినిమా ఫార్మెట్ గురించి ఆసక్తికర విషయాలు పంచుకున్నారు. 'సినిమాలో లవ్ స్టోరీస్‌కు పేరెంట్స్ అడ్డుపడుతున్నారనో, లేక వీరిద్దరి మధ్య గొడవలు రావడం అని ఒక ఫ్లో ఉంటుంది కదా.. అవన్నీ కాకుండా.. పూర్తిగా సెటిల్ అవ్వకుండా నిజంగా నువ్వు ఒక అమ్మాయిని లవ్ చేస్తే.. ఎమోషనల్‌గా ఒకటి అయ్యాక నెక్స్ ఏం జరుగుతుంది అనేది ఏ సినిమాలో చర్చించలేదు. శారీరక సాన్నిహిత్యం జరిగిన మరుసటి రోజు అబ్బాయి, అమ్మాయి మధ్య జరిగే సంభాషణ గురించి తెలుగు సినిమా ఎప్పుడూ చర్చించలేదు. వాణిజ్య చిత్రాలలో అరుదుగా కనిపించే రుతుస్రావం గురించి కూడా మనం చర్చిస్తాం. ఎపిక్ ఒక వాణిజ్య ప్రయోగం' అని చెప్పుకొచ్చారు. కాగా.. ఈ సినిమాను సితార ఎంటర్‌టైన్‌మెంట్స్, ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ బ్యానర్లు సంయుక్తంగా నిర్మించాయి.

### ఆ బయోపిక్‌లో రష్మిక ఫిక్స్..

నేషనల్ క్రష్ రష్మిక మందన్న.. పెళ్లి తర్వాత సినిమాల్లో జోరు పెంచింది. ఈ మేరకు తన భర్త రౌడీ హీరో విజయ్ దేవరకొండతో 'రణబాలి'తో పాటు, లేడీ ఓరియెంటెడ్ మూవీ 'మైసా'కోసం సిద్ధం అవుతున్నది. ఈ సినిమాలు రెండు ప్రజెంట్ షూటింగ్ దశలో ఉండగా.. రష్మిక తదుపరి మూవీకి సంబంధించిన లేటెస్ట్ అప్డేట్ వచ్చింది. గౌతమ్ తిన్ననూరి దర్శకత్వంలో భారతరత్న, దిగ్గజ కర్ణాటక గాయని ఎంఎస్ సుబ్బలక్ష్మి బయోపిక్ రాబోతున్న విషయం తెలిసిందే. మొదటి ఈ సినిమాలో ఎంఎస్ సుబ్బలక్ష్మి పాత్ర కోసం సాయి పల్లవి, రుక్మిణి వసంత్ లాంటి పేర్లు వినిపించగా.. డేట్స్ సర్దుబాటు కాకపోవడంతో రష్మికను సంప్రదించారట మేకర్స్. దాదాపు ఇందులో రష్మిక కన్ఫర్మ్ అయినట్లు తెలుస్తుండగా.. అల్లు అరవింద్, బన్నీ వాసు, రాక్‌లైన్ వెంకటేష్ సంయుక్తంగా నిర్మించబోతున్నారట. ఇప్పటికే రష్మిక మందన్న ప్రోమో షూట్ కూడా పూర్తయినట్లు ఫిలిమ్ వర్గాల నుంచి వార్తలు వస్తుండగా.. దసరా సందర్భంగా లేదా, ఎం.ఎస్. సుబ్బులక్ష్మి జయంతి సెప్టెంబర్ 16న కానీ ఈ సినిమాకు సంబంధించిన అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉన్నట్లు సమాచారం.



## దులీప్ ట్రోఫీ ఫైనల్.. మూడో రోజూ ఈస్ట్ జోన్‌దే జోరు



చెన్నై: సౌత్ జోన్‌తో జరుగుతున్న దులీప్ ట్రోఫీ 2026 ఫైనల్లో మొదటి రెండ్రోజులు బ్యాట్‌తో అదరగొట్టిన ఈస్ట్ జోన్.. మూడో రోజు బౌలింగ్‌లోనూ సత్తాచాటింది. కెప్టెన్ ఇషాన్ కిషన్ (270; 334 బంతుల్లో) భారీ డబుల్ సెంచరీకితోడు మిగతా బ్యాటర్లూ రాణించడంతో తొలి ఇన్నింగ్స్‌లో ఈస్ట్ జోన్ 708పరుగుల భారీస్కోరు సాధించిన విషయం తెలిసిందే. మంగళవారం, మూడో రోజు తొలి ఇన్నింగ్స్‌ను ప్రారంభించినసౌత్ జోన్ తడబడుతోంది. ఏ ఒక్క బ్యాటర్ కూడా భారీ స్కోరు చేయకపోవడంతో ఆట ముగిసే సమయానికి 242/6 స్కోరుతో నిలిచింది. కెప్టెన్ తిలక్ వర్మ (56ని) అర్ధ శతకం చేయగా.. అతడితోపాటు చామ మిలింద్ (2ని) క్రీజులో ఉన్నాడు. ఫామ్‌లో ఉన్న దేవదత్ పడిక్కల్ (62; 104 బంతుల్లో 4 ఫోర్లు) హాఫ్ సెంచరీ చేసినా దాన్ని భారీ స్కోరుగా మలచలేకపోయాడు. నారాయణ్ జగదీశన్ (32), షేక్ రషీద్ (27), శ్రేయస్ గోపాల్ (26), స్మరన్ రవిచంద్రన్ (23) పరుగులు చేశారు. ఓపెనర్ రికీ భుయ్ (1) సింగిల్ డిజిట్ స్కోరుకే వెనుదిరిగాడు. ఈస్ట్ జోన్ బౌలర్లలో మహ్మద్ షమి, ముకేశ్ కుమార్ రెండేసి వికెట్లు పడగొట్టగా.. శిఖర్ మోహన్, ఎండీ కౌనైన్ ఖురేషికి ఒక్కో వికెట్ దక్కింది. ఇంకా రెండు రోజుల ఆట మిగిలిన ఉన్న మ్యాచ్‌లో ప్రస్తుతం సౌత్ జోన్ 466 పరుగుల వెనుకంజలో ఉంది.

## పీసీబీ ఇంకా వేల డాలర్లు బకాయి ఉంది: పాక్ మాజీ కోచ్ జేసన్ గెలెస్పీ



విశ్వంభర, స్పోర్ట్స్: ఆస్ట్రేలియా మాజీ బౌలర్ జేసన్ గిలెస్పీ 2024లో పాకిస్థాన్ టెస్టు కోచ్‌గా పనిచేసిన విషయం తెలిసిందే. పాక్ కోచ్‌గా ఉన్నప్పుడు తనకు ఎదురైన చేదు అనుభవాలను తాజాగా గుర్తుచేసుకున్నాడు. పాక్ చీఫ్ సెలక్టర్ అకిబ్ జావేద్ తనను అగౌరవపరిచిన సంఘటనలను ఓ ఇంటర్వ్యూలో పంచుకున్నాడు. కోచ్ పదవి కాలానికి సంబంధించి పీసీబీ తనకు ఇంకా వేల డాలర్లు బాకీ ఉందని పేర్కొన్నాడు."అకిబ్ జావేద్‌ను చీఫ్ సెలక్టర్‌గా నియమించడంతో పరిస్థితులు పూర్తిగా మారిపోయాయి. ఆ క్షణం నుంచే పాకిస్థాన్ క్రికెట్ తో నాకున్న సంబంధం పూర్తిగా మారిపోయింది. ప్రతి విషయంలోనూ ఆయన పెత్తనమే కొనసాగింది. టెస్టు జట్టు బాధ్యతలు చూడటం, ఆటగాళ్లు, సిబ్బందిని పర్యవేక్షించడం, జట్టు ఎంపిక.. ఇలా ఏ విషయంలోనూ ఎటువంటి పాత్ర లేని స్థితికి వచ్చాను. ఆ అనుభవం నన్ను పూర్తిగా నిరుత్సాహపరిచి, కోచింగ్‌పై విరక్తి కలిగించింది. అది నాపై మానసికంగా ప్రభావం చూపింది. నన్ను నేను సందేహించుకునేలా చేసింది. అకిబ్ జావేద్ నా పట్ల పూర్తిగా అగౌరవంగా ప్రవర్తించాడు. అతడికి బోర్డు (ఖ్రజదీ) మద్దతు ఉంది. అందుకే తనను ఎవరూ ఏమీ చేయలేరని అనుకుంటున్నాడు. ప్రస్తుతం జరుగుతోన్న పరిణామాలను చూస్తుంటే చాలా బాధగా ఉంది. దీనికి అసలు కారకుడు అకిబ్ జావేద్. అతడు అక్కడ ఉన్నంత కాలం పాకిస్థాన్ క్రికెట్ వెనకడుగు వేస్తూనే ఉంటుంది" అని జేసన్ వివరించాడు.

Edited, Printed, Published & Owned by Dr. KACHAM SATYANARAYANA. Printed at DVM Multi Colour Offset Printers, Dilsukhnagar, Hyderabad - 500060. Telangana. Published at #204, 2nd Floor, Badam Complex, Opp. Metro Pillar No. 1560, Chaitanyapuri X Road, Hyderabad - 500060. Telangana.EDITOR: Dr. KACHAM SATYANARAYANA. Cell: 9441222429 | Email: vishwambhara.daily@gmail.com